
SRI GAYATRI AYURVEDIC MULTI SPECIALITY CENTRE
శ్రీ గాయత్రి ఆయుర్వేదిక్ మల్టీ స్పెషాలిటీ సెంటర్
GIAYS

D.No. 58-15-124,
Santhinagar,
NAD 'x' Road,
Visakhapatnam-530016
Email: srigayatriayurvedavskp@gmail.com
ph:9247011553

APTEL RNI NO: 62061/2015

# వార్తావళి

తెలుగు దినపత్రిక


వివాహ మరియు గృహ సంబంధమైన శుభ ముహూర్తములు మరియు పుట్టిన తేది, సమయం, పుట్టిన ప్రాంతం నక్షత్రములు బట్టి జాతకములు వ్రాయబడును
బులుసు వెంకట సుబ్రహ్మణ్యం
M.A. Astrology
#135/B.Sector-3, Ukkunagaram, Vizag-32
bulusu333@gmail.com ph:7032034001, 8500159006

విశాఖపట్నం : బుధవారం 08 జూలై 2020 | ఎడిటర్ : బులుసు వెంకట సుబ్రహ్మణ్యం | VAARTAVALI TELUGU DAILY | పేజీలు : 8 | రూ. 1.00 | సంపుటి 5 | సంచిక 145

## ఆగస్టు 15న ఇళ్ల స్థలాల పంపిణీ



**విశాఖపట్నం, వార్తావళి, జూలై 7 :** నిరుపేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమం ఆగస్టు 15వ తేదీన ఏర్పాటు చేసే ఆలోచనలో రాష్ట్రప్రభుత్వం ఉన్నదని, రిజిస్ట్రేషన్ కి సంబంధించి పట్టా డాక్యుమెంట్లో ఫొటోతో పాటు, ప్లాట్ నం, బౌండరీలు తదితరాల నన్నిటిని పొందుపర్చాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హౌస్ సైట్‌లు, శాండ్, కోవిడ్-19, ఎన్ఆర్ఈజీఎస్ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ లేఅవుట్లు వేసే ప్రక్రియ వేగవంతం చేయాలని ,ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. అర్హులై ఉండి ఇళ్ళ స్థలం రానివారు దరఖాస్తు చేసుకున్న నిర్ణీత గడువు 90 రోజుల లోపల ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇసుక సేకరణకు సంబంధించి రానున్న పది రోజుల్లోగా జిల్లాలకు అవసరమైన నాణ్యమైన ఇసుకను సేకరించి కొరత లేకుండా నిల్వ చేసుకోవాలని జాయింట్ కలెక్టర్లను ఆదేశించారు. ముఖ్యంగా ప్రభుత్వ అభివృద్ధి పనులు. హౌసింగ్, స్కూల్ భవనాలు, నాడు-నేడు, అర్ బీ కే, ఇరిగేషన్ పనులపై దృష్టి పెట్టాలన్నారు. ఉపాధి హామీ పనులు మూడు నెల ల్లో ఎనిమిది కోట్ల పనిదినాలు కల్పించి కరోనా కష్ట కాలంలో నిరు పేద కుటుంబాలకు ఆర్థిక చేయూత అందించిన కలెక్టర్ లను అభినందిస్తున్నానన్నారు. గ్రామ సచివాలయాలు, అర్‌బీకేలు, వై ఎస్ ఆర్ క్లినిక్స్, అంగన్వాడీ కేంద్రాలు, నాడు-నేడు నిర్మాణాలకు సంభందించి స్థలాలను గుర్తించాలన్నారు. కోవి డ్-19కి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకూ పది లక్షల టెస్ట్‌లు చేయించినజిల్లా యంత్రాంగాన్నిఅభినందిస్తున్నానన్నారు. క్వారంటైన్ ఫెసిలిటీస్ బాగుండాలని,కోవిడ్ కేర్ సెంటర్ లలో బెడ్స్, పరిశుభ్రమైన టాయిలెట్స్, నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. వీటన్నిటి పై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలక్టర్ వినయ్ చంద్, జాయింట్ కలక్టర్ వేణు గోపాల్ రెడ్డి, రూరల్ ఎస్ పీ బీ కృష్ణారావు తదితరులు హాజరయ్యారు.

## కడప చేరుకున్న సీఎం వైఎస్ జగన్



**కడప, వార్తావళి, జూలై 7 :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడప చేరుకున్నారు. వైఎస్సార్ జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరిన ఆయన కడప విమానాశ్రయానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రికి ఇంచార్జ్ మంత్రి ఆదిమూలపు సురేష్, జిల్లా కలెక్టర్ హరికిరణ్, కర్నూల్ రేంజ్ డీఐజీ, విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, సుధీర్ రెడ్డి, కడప పార్లమెంట్ అధ్యక్షుడు సురేష్ బాబు ఘనస్వాగతం పలికారు. ఇడుపులపాయకు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా ముఖ్యమంత్రి పయనమయ్యారు. రేపు(బుధవారం) వైఎస్సార్ జయంతి సందర్భంగా ఇడుపులపాయలో వైఎస్సాఆర్ ఘాట్ వద్ద సీఎం వైఎస్ జగన్, ఆయన సతీమణి భారతి నివాళులర్పించనున్నారు. అనంతరం ట్రిపుల్ ఐటీ వద్ద వైఎస్సార్ విగ్రహావిష్కరణతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం వైఎస్ జగన్ ప్రారంభించనున్నారు. తిరిగి సాయంత్రం విజయవాడ చేరుకోనున్నారు.

## అంబులెన్స్ నడిపిన రోజా..



**అమరావతి, వార్తావళి, జూలై 7 :** నగరిలో అంబులెన్స్‌ల ప్రారంభోత్సవం సందర్భంగా దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజా గజమాలతో నివాళి అర్పించారు. పూజాకార్యక్రమాల అనంతరం సైరన్ మోగిస్తూ స్వయంగా 108 వాహనాన్ని నడిపి అందరిని ఆశ్చర్యానికి గురి చేశారు. ఏపీ రాజకీయాల్లో నిత్యం ఆమె చర్చనీయంశంగా ఉంటారు. తాజాగా స్టీరింగ్ పట్టి 108 వాహనాన్ని నడిపారు ఎమ్మెల్యే రోజా. కుయ్ కుయ్‌మని సైరన్ మోగుతుంటే.. రయ్ రయ్‌మని టాప్‌గేర్‌లో దూసుకెళ్లారు. ఏపీ సీఎం జగన్ ఇటీవల 1088 కొత్త 108, 104 వాహనాలను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గానికి ఐదు 104, ఐదు 108 వాహనాలను కేటాయించారు. ఆ వాహనాలు మంగళవారం నగరికి చేరుకున్నాయి. నగరిలో అంబులెన్స్‌ల ప్రారంభోత్సవం సందర్భంగా దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజా గజమాలతో నివాళి అర్పించారు. పూజాకార్యక్రమాల అనంతరం సైరన్ మోగిస్తూ స్వయంగా 108 వాహనాన్ని నడిపి అందరిని ఆశ్చర్యానికి గురి చేశారు. ప్రజారోగ్యం పట్ల వైఎస్ఆర్‌కు బాధ్యత ఉంది గనుకే, ఏ సీఎంకు రాని ఆలోచన వచ్చింది. అందుకే 104, 108 వాహనాలను ప్రవేశపెట్టారు. తండ్రి రెండు అడుగులు వేస్తే తనయుడు 4 అడుగులు ముందుకు వేసి 1088 వాహనాలు రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులోకి తెచ్చారు. 108,104 వాహనాలపై చంద్రబాబు మాట్లాడటం దెయ్యాలు వేదాలు వాళ్లించినట్లుగా ఉంది. రూ. 203 కోట్లతో 108,104 వాహనాలను ఏర్పాటు చేస్తే చంద్రబాబు రూ.100 కోట్ల అవినీతి జరిగిందని చెప్పడం దారుణం. కరోనా కాలంలో ప్రజలకు భరోసాని ఇవ్వలేని చంద్రబాబు.. అవినీతి పరులైన నేతలను అరెస్ట్ చేస్తే మాత్రం రోడ్డు మీదకు వచ్చారని విమర్శలు గుప్పించారు రోజా. మాట్లాడితే అచ్చెన్నాయుడు బీసీ అంటున్నారని.. ఆయన బీసీ, ఎస్టీ, ఎస్సీల డబ్బులను దోచుకోలేదా అని ప్రశ్నించారు. కొల్లు రవీంద్రను అరెస్ట్ చేస్తే కక్షసాధింపు అంటూ విమర్శిస్తున్నారని.. మరి ఆయన చంపిన భాస్కర్ రావు ఏ కులపు వారో చెప్పాలని ఈ సందర్భంగా నిలదీశారు రోజా. చంద్రబాబు తీరు ఇలాగే ఉంటే.. వచ్చే ఎన్నికల్లో 23 సీట్లు కూడా రావని ఎద్దేవా చేశారు.

## అన్ని రాష్ట్రాల కంటే మిన్నగా కరోనాను ఎదుర్కొంటున్నాం

### ఆహారం, పారిశుధ్యంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

### కాంట్రాక్టర్లకు మంత్రి హెచ్చరిక



**విజయవాడ, వార్తావళి, జూలై 7 :** కరోనాను దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే మిన్నగా, మన రాష్ట్రం సమర్ధవంతంగా ఎదుర్కొంటున్నదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ళ కాళీ కృష్ణ శ్రీనివాస్ వెల్లడించారు. మంగళవారం ఆయన విజయవాడలోని ప్రభుత్వ వైద్యశాలను సందర్శించిన అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయం వీడియో కాన్ఫరెన్సు ద్వారా కోవిడ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేషెంట్లతో వైద్య, భోజన సదుపాయాలు ఎలా అందుతున్నది అడిగి తెలుసుకున్నారు. కోవిడ్ టెస్టుల నిర్వహణ, హాస్పటల్ ప్రిపేర్డ్, క్వారంటైన్ సెంటర్ల ఏర్పాటు, నిర్వహణ, డాక్టర్ల నియామకం తదితర అన్ని అంశాలలో ముందంజలో ఉన్నామన్నారు. లాక్ డౌన్ సడలించిన తరువాత కేసులు పెరుగుతున్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు పాటించాలని మన బాధ్యతలను ముఖ్యమంత్రి ప్రతిరోజూ గుర్తుచేస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రభుత్వం కోవిడ్ సెంటర్లు, ఆసుపత్రులలో ఆహారం, నీరు, వైద్యం, శానిటేషన్ సమర్ధవంతంగా అమలుచేస్తున్నప్పటికీ కొన్ని ప్రాంతాలలో కొన్ని అపోహలు పత్రికల ద్వారా, సోషల్ మీడియా ద్వారా ముఖ్యమంత్రి గారి దృష్టికి వెళ్ళాయన్నారు. దీనిపై ముఖ్యమంత్రి ప్రభుత్వ వైద్యశాలలను, కోవిడ్ సెంటర్లను స్వయంగా పరిశీలించాలని తనను ఆదేశించారని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ఆదేశాలమేరకు విజయవాడలోని ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మికంగా సందర్శించడం జరిగిందన్నారు. అక్కడ పేషెంట్లకు ఇస్తున్న ఆహారాన్ని రుచి చూశానన్నారు. ఆహారం శుభ్రంగా బాగానే ఉంది అయినా ఇంకా మెరుగైన భోజనం అందించాలని, ఇంకా పరిశుభ్రంగా ఉండాలని, ఫిర్యాదులు లేకుండా చూడాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించామన్నారు. మంచి సేవలు సంతృప్తికరంగా అందుతున్నాయని పేషెంట్లు చెబుతున్నారన్నారని మంత్రి తెలిపారు. ఒక్కో పేషెంట్ కు ఆహారం, త్రాగునీరు, శానిటేషన్ తదితర వాటికోసం రోజుకు ప్రభుత్వం రు.500 ఖర్చు చేస్తున్నదని మంత్రి తెలిపారు. భోజనం, శానిటేషన్ కాంట్రాక్టర్లు సరిగా ఆహారం అందించకపోయినా అవినీతికి పాల్పడినా తొలగించడం తోపాటు ప్రభుత్వపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే కేసులు నమోదు చేయడానికి కూడా వెనుకాడేది లేదన్నారు. కోవిడ్ క్వారంటైన్ సెంటర్లలో చిన్నచిన్న సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కలుగజేయడానికి సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ కమీషనర్ కాటంనేని భాస్కర్, జాయింట్ కలెక్టర్ ఎల్. శివశంకర్ పాల్గొన్నారు.

## 'కరోనా' బాధితులతో మాట్లాడిన మంత్రి ఆళ్ళ నాని

**విజయవాడ, వార్తావళి, జూలై 7 :**విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలోని కోవిడ్ సెంటర్లో అన్ని సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని చికిత్స పొందుతున్న పలువురు పేషెంట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ళ కాళీ కృష్ణ శ్రీనివాస్ కు వివరించారు. మంగళవారం ఆయన జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్సు ద్వారా డాక్టర్లు, పేషెంట్లతో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వ వైద్యశాలలోని కోవిడ్ సెంటర్ లో ఆహారం ఎలా ఉంది, సమయానికి పెడుతున్నారా, త్రాగునీరు సరిపడినంతగా అందుబాటులో ఉందా, శానిటేషన్ ఎలా ఉంది, వైద్యులు సిబ్బంది మంచి వైద్యం అందిస్తున్నారా అని పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. తమ వార్డులో 55 మంది ఉన్నారని వారిలో 27 మంది పాజిటివ్ ఉన్నారని ఆవార్డులో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మంత్రికి వివరించారు. కోవిడ్ సెంటర్ లోని పేషెంట్లతో మంత్రి ఆళ్ళ నాని వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. విజయవాడ దుర్గాపురానికి చెందిన శివరాం ప్రసాద్ తాను ఎడ్మిట్ అయి 4 రోజులయిందని, డాక్టర్లు బాగా చూస్తున్నారని, మందులు ఇస్తున్నారని, టాయిలెట్స్ నీట్ గా ఉన్నాయని, అన్ని సౌకర్యాలు బాగున్నాయని వివరించారు. బెడ్ షీట్లు రోజూ మారుస్తున్నారని, భోజనం చాలా బాగుందని, టైమ్ కు వస్తున్నదని ఏ ఇబ్బందీ లేదని తెలిపారు. లయోలా కాలేజీ ప్రాంతానికి చెందిన వల్లూరు షీబారాణి తాను జాయినయి వారం రోజులయిందని భోజనం ఉదయం 12-30కి రాత్రి 9-00 లోపు పెడుతున్నారని, త్రాగునీరు తగినంత ఇస్తున్నారని ప్రభుత్వ వైద్యం ఇంత బాగా ఉంటుందని అనుకోలేదని, కార్పొరేట్ హాస్పటల్ లోలాగా ఉందని మంత్రికి వివరించారు. విజయవాడ దుర్గాపురంకు చెందిన రాకేష్ తాను ఎడ్మిట్ అయి 3 రోజులు అయిందని, తమ కుటుంబంలో ఇంకా కొందరికి పాజిటివ్ వచ్చిందని తెలిపారు. ఇబ్బందులేమైనా ఉన్నాయా అని మంత్రి ప్రశ్నించగా ప్రభుత్వ వైద్యశాలలో మంచి సేవలు అందిస్తున్నారని, ఆహారం తగిన సమయానికి వస్తున్నదని, సరిపోయినంత ఆహారం ఇస్తున్నారని డాక్టర్లు ఉదయం, సాయంత్రం వచ్చి చూస్తున్నారని, ఫుడ్ క్వాలిటీ బాగుందని, శానిటేషన్ కూడా బాగుందని వివరించారు. టెస్ట్ రిజల్ట్ లో కొంచెం జాప్యం జరుగుతున్నదని త్వరగా ఇప్పించాలని కోరారు. సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ కమీషనర్ కాటంనేని భాస్కర్, జాయింట్ కలెక్టర్ ఎల్. శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## 14 రోజులపాటు లాక్‌డౌన్



**కోల్‌కతా:** దేశవ్యాప్తంగా రోజురోజుకు కరోనా కేసులు పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసుల్లో భారత్ మూడో స్థానంలో ఉంది. కరోనా కట్టడి కోసం పలు రాష్ట్రాలు పూర్తిగా లేక పాక్షిక లాక్‌డౌన్ వైపు మొగ్గు చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం ఉత్తర 24 పరగణ జిల్లాల్లో లాక్‌డౌన్ విధించాలని భావిస్తున్నట్లు సమాచారం. కరోనా కేసులు పెరుగుతుండటంతో మమత సర్కార్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## మాజీ మంత్రి బండారు అరెస్ట్



**పెందుర్తి, వార్తావళి, జూలై 7:** పెందుర్తిలో మాజీ మంత్రి బండారు అరెస్ట్ అయ్యారు. ఇల్లు అర్హులైన లబ్దిదారులకు కేటాయించాలని టీడీపీ నేతలు నిరసనకు దిగారు. దీంతో కోవిడ్ నిబంధనల్ని ఉల్లంఘించారంటూ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నవిశాఖ జిల్లాలో మాజీ మంత్రిని పోలీసులు అరెస్ట్ చేశారు. పెందుర్తి రాతిచెరువు సమీపంలో ఉన్న ఇళ్ల నిర్మాణ పనులను సందర్శించేందుకు వెళ్లిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణను పెందుర్తి పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇల్లు అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని కోరుతూ టీడీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అయితే కోవిడ్ నిబంధనల నేపథ్యంలో ఎక్కువమంది గుమిగూడదని పోలీసులు తెలిపారు. నిబంధనల్ని తిరస్కరించాంటూ మాజీ మంత్రి బండారు సత్యనారాయణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## 2021 దాకా వ్యాక్సిన్ వచ్చే అవకాశం లేదు..




**న్యూఢిల్లీ:** ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 150 కోవిడ్-19 వ్యాక్సిన్లు ప్రయోగ దశలో ఉన్నాయని.. అయితే వీటిలో ఏ ఒక్కటి కూడా 2021 కంటే ముందు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే అవకాశం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ చీఫ్ సైంటిస్ట్ సౌమ్య స్వామినాథన్ తెలిపారు. అదే విధంగా వైరస్‌ను సమర్ధవంతంగా ఎదుర్కొనే ఏ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేయాలంటే మూడు దశల్లో ప్రయోగాలు నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. తొలి రెండు దశల్లో ప్రాథమిక పరీక్షలు మాత్రమే నిర్వహిస్తారని.. వ్యాక్సిన్ పనితీరును పూర్తి స్థాయిలో పరీక్షించే మూడో దశే అత్యంత కీలకం, కఠినమైనదని పేర్కొన్నారు. ప్రస్తుతం యూకేలోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ తయారు చేసిన వ్యాక్సిన్ మాత్రమే క్లినికల్ ట్రయల్స్ ఫేజ్-3లో ఉందని తెలిపారు. "ఏయే వ్యాక్సిన్లు ప్రయోగ దశలో ఉన్నాయి, వాటి అభివృద్ధి తీరును డబ్ల్యూహెచ్ నిపుణుల కమిటీ పర్యవేక్షిస్తుంది" అని చెప్పుకొచ్చారు. "ఇప్పటివరకు కోవిడ్?-19కు వ్యాక్సిన్ అందుబాటులోకి రానందున పేషెంట్ల చికిత్సకు రెమెడిసివిర్ వంటి మందులు ఉపయోగిస్తున్నారు. అయితే అది పూర్తిస్థాయిలో మరణాలను కట్టడి చేస్తుందనే విషయంపై ఎలాంటి స్పష్టతా లేదు. అలాగే ఫావిపిరవిర్ కూడా అంతే. నిజానికి దానిని అమితంగా ఉపయోగించడం వల్ల టెరాజెనిక్(జనన లోపాలు) తలెత్తే అవకాశం ఉంది. కాబట్టి జాగ్రత్త వహించాలి" అని పేర్కొన్నారు. ఇక కరోనా మరణాలపై అన్ని దేశాలు కచ్చితమైన లెక్కలు చెబుతున్నాయా లేదా అన్న విషయం బయటపడటానికి మరికొంతకాలం వేచి చూడక తప్పదని అభిప్రాయపడ్డారు. ఇక ఆగష్టు 15 నాటి భారత్‌లో వ్యాక్సిన్ అందుబాటులోకి వస్తుందన్న భారత వైద్య పరిశోధన మండలి(ఐసీఎంఆర్) ప్రకటన గురించి మాట్లాడుతూ.. ట్రయల్స్ నిర్వహించడానికి చాలా సమయం పడుతుందని, అన్ని రకాల పరీక్షలు నిర్వహించిన తర్వాతే వ్యాక్సిన్‌ను ఉపయోగించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వ్యాక్సిన్ ట్రయల్స్ పూర్తికావడానికి కనీసం 6 నుంచి 9 నెలల సమయం పడుతుందని స్పష్టం చేశారు. కాగా కరోనా వ్యాక్సిన్‌కు సంబంధించి ఐసీఎంఆర్ చేసిన ప్రకటనపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వ్యాక్సిన్ ప్రీ-క్లినికల్ ట్రయల్స్ విజయవంతంగా పూర్తి చేసుకున్నందునే.. తదుపరి అనుమతులు ఇచ్చినట్టు ఐసీఎంఆర్ ఓ ప్రకటనలో తెలిపింది. దేశంలో అత్యవసర పరిస్థితిని పరిగణలోకి తీసుకొని? వ్యాక్సిన్‌ను వేగంగా తీసుకురావడంలో భాగంగా అంతర్జాతీయ నిబంధలను అనుగుణంగా ప్రయోగాలు చేపడుతున్నట్టు స్పష్టం చేసింది.

# యుఎస్‌లో భారతీయ విద్యార్థులకు చెక్



**వాషింగ్టన్:** ఇప్పటికే హెచ్‌-1బీ వంటి పలు వీసాలు, గ్రీన్‌కార్డుల జారీపై నిషేధం విధించిన అమెరికా ప్రభుత్వం మరో అనూహ్య నిర్ణయం తీసుకుంది. విదేశీ విద్యార్థులకు భారీ షాక్ ఇచ్చేందుకు సిద్ధమైంది. కరోనా వ్యాప్తి నేపథ్యంలో పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ తరగతులు నిర్వహించేందుకు విద్యాసంస్థలు సిద్ధమైనట్లయితే విదేశీ విద్యార్థులు దేశం విడిచి వెళ్లాల్సి ఉంటుందని ప్రకటించింది. అలాగే కొత్తగా విద్యార్థి వీసాలు జారీ చేయబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ) సోమవారం ప్రకటన విడుదల చేసింది. "వచ్చే విద్యా సంవత్సరానికి గానూ పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించేందుకు నిర్ణయించిన స్కూళ్లలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వీసా జారీచేయబోం. అలాంటి వారిని దేశంలోకి అనుమతించబోం. నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా ఎఫ్‌-1, ఎం-1పై ప్రస్తుతం అమెరికాలో ఉంటూ ఆన్‌లైన్ తరగతులకు హాజరవుతున్నవారు దేశం విడిచి వెళ్లాల్సి ఉంటుంది. చట్టబద్ధంగా ఉండాలనుకుంటే భౌతికంగా తరగతులకు హాజరయ్యేందుకు అనుమతిస్తున్న విద్యా సంస్థలకు బదిలీ చేసుకోవాలి" అని ఐసీఈ తన ప్రకటనలో పేర్కొంది. లేదంటే ఇమ్మిగ్రేషన్ శాఖ తీసుకోబోయే చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించింది. రెండు మాధ్యమాల ద్వారా తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలు.. ఎక్కువ మంది విద్యార్థులు భౌతికంగా హాజరవుతున్నారని నిరూపించుకోవాల్సి ఉంటుందని తెలిపింది.

# చైనా యాప్‌లపై నిషేధం దిశగా అమెరికా?



**దిల్లీ:** టిక్ టాక్‌తో సహా 59చైనా యాప్‌లను భారత్ నిషేధించిన విషయం తెలిసిందే. భారత్ దారిలోనే అమెరికా అడుగులు వేస్తోంది. తాజాగా టిక్‌టాక్‌తోపాటు చైనా సామాజిక మాధ్యమాల యాప్‌లను నిషేధించే యోచనలో ఉన్నట్లు అమెరికా విదేశాంగమంత్రి మైక్ పాంపియో వెల్లడించారు. ఓ అంతర్జాతీయ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మైక్ పాంపియో ఈ విధంగా అభిప్రాయపడ్డారు. 'ఈ విషయాన్ని అధ్యక్షుడు ట్రంప్ కన్నాముందే బహిరంగపరచడం ఇష్టం లేదు. కానీ, కచ్చితంగా చైనా యాప్‌లను నిషేధించే యోచనలో ఉన్నాం' అని మైక్ పాంపియో స్పష్టం చేశారు. చైనా కమ్యూనిస్టు ప్రభుత్వ నియంత్రణలో ఉన్న అక్కడి కంపెనీలు, చైనా ప్రభుత్వానికి సహకరిస్తున్నాయని ఇప్పటికే అమెరికా చట్టసభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా టిక్‌టాక్ వంటి యాప్‌లు సేకరించే సమాచారంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే, చైనా యాప్‌లను నిషేధిస్తూ భారత్ తీసుకున్న నిర్ణయాన్ని మైక్ పాంపియో సమర్థించారు. ఆ యాప్‌లను నిషేధించడం సరైన నిర్ణయమేనని పాంపియో ఇదివరకే స్పష్టం చేశారు. చైనా వంచన విధానంతోనే కరోనా వైరస్ మహమ్మారి ప్రపంచాన్ని చుట్టుముట్టిందని అమెరికా ఆరోపిస్తోంది. సమయం దొరికినప్పుడల్లా చైనా తీరుపై విరుచుకుపడుతున్న అమెరికా, హాంగ్‌కాంగ్ వ్యవహారంలోనూ డ్రాగన్ దేశంపై గుర్రుగా ఉంది. తాజాగా యాప్ నిషేధం దిశగా అడుగులు వేయడం గమనార్హం.

# ఈ ఏనుగు హెయిర్‌స్టైల్ చూస్తే మతిపోవాల్సిందే!





తమిళనాడుకు చెందిన ఒక ఏనుగు ప్రస్తుతం సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తోంది. బాబ్ కట్ హెయిర్‌స్టైల్‌తో ఉన్న ఆ ఏనుగు ఫోటోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. తమిళనాడుకు చెందిన ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఆఫీసర్(ఐఎఫ్ఎస్) సుధా రమన్ దీనికి సంబంధించిన ఫోటోలను తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ ఏనుగును బాబ్ కట్ సెంగమలం అని పిలుస్తుంటారు. ఈ హెయిర్‌స్టైల్ వల్లే ఈ ఏనుగు చాలా మంది ఫ్యాన్స్ తయారయ్యారు. మీరు దీనిని తమిళనాడు రాజగోపాలస్వామి దేవాలయంలో చూడొచ్చు అని ఆమె ట్వీట్ చేశారు. ఆ దేవాలయంలో ఈ ఏనుగు 2003 నుంచి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ట్వీట్‌కు ఇప్పటి వరకు 20.2కె లైక్‌లు రాగా, 3.3కె మంది రీట్వీట్ చేశారు. కొంత మంది బాబ్ కట్ ఏనుగుతో దిగిన ఫోటోలను షేర్ చేస్తున్నారు.

# పాన్- ఆధార్ లింక్ గడుపు పెంపు




**న్యూఢిల్లీ:** పాన్- ఆధార్ కార్డ్ లింక్ గడువును పొడగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే చాలా సార్లు దీని గడువును పొడిగించిన కేంద్రం.. తాజాగా సోమవారం మరోసారి పొడగించింది. రేపటితో (మంగళవారం) గడువు ముగుస్తుండగా.. వచ్చే ఏడాది (2021) మార్చి 31 వరకు పొడిగించింది. దేశంలో కరోనా వైరస్ దృష్ట్యా ఆదాయపు పన్నుశాఖ నిర్ణయం తీసుకుంది. కాగా పాన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డుతో కచ్చితంగా అనుసంధానం చేసుకోవాల్సిందే. దీనిని ఈ ఏడాది ఏప్రిల్‌లో కేంద్రం తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. లేకుంటే పాన్ కార్డు చెల్లదని ఐటీశాఖ ప్రకటించింది.

# వరుస భూకంపాలు.. ఇండోనేషియాలో అత్యధికం



**జకార్తా :** ఇండోనేషియా సహా వివిధ ప్రాంతాల్లో భూకంపం సంభవించింది. మంగళవారం తెల్లవారు జామున ఇండోనేషియా, సింగపూర్ సహ భారత్‌లోని అరుణాచల్ ప్రదేశ్‌లో భూమి కంపించింది. అత్యధికంగా ఇండోనేషియాలో భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.3గా నమోదు కాగా, సింగపూర్‌లో తెల్లవారుజామున 4.24 గంటలకు రిక్టర్ స్కేలుపై 6.1గా నమోదైంది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని తవాంగ్ సమీపంలో తెల్లవారుజామున 1:33 గంటలకు రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 3.4 గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. జావా తీరం సముద్రగర్భంలో 528 కిలోమీటర్ల లోతులో భూకంపన కేంద్రాన్ని గుర్తించినట్టు ఇండోనేషియా వాతావరణ జియోఫిజిక్స్ అధికారులు వెల్లడించారు. అయితే ఈ భూకంపం వల్ల ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదని, సునామీ వచ్చే అవకాశం కూడా లేదని పేర్కొన్నారు.

# అమెరికా, బ్రెజిల్ తర్వాత ఇండియా



**న్యూఢిల్లీ:** ఇండియాలో కరోనా మహమ్మారి ఉధృతి కొనసాగుతోంది. పాజిటివ్ కేసుల విషయంలో రష్యాను దాటేసి, ప్రపంచంలో మూడో స్థానానికి చేరుకుంది. మొదటి రెండు స్థానాల్లో అమెరికా, బ్రెజిల్ ఉన్నాయి. వైరస్ వ్యాప్తి ఇలాగే కొనసాగితే త్వరలోనే బ్రెజిల్‌ను కూడా వెనక్కి నెట్టేసి, రెండో స్థానం ఆక్రమించే పరిస్థితి కనిపిస్తోంది. ఇండియాలో కరోనా కేసులు 7 లక్షలకు, మరణాలు 20 వేలకు చేరువవుతున్నాయి. దేశంలో గత 24 గంటల్లో కొత్తగా 24,248 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. 425 మంది కరోనాతో మరణించారు. దీంతో ఇప్పటిదాకా మొత్తం కేసులు 6,97,413, మరణాలు 19,693కు చేరుకున్నాయని కేంద్ర ఆరోగ్య శాఖ సోమవారం ప్రకటించింది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం కరోనా యాక్టివ్ కేసులు 2,53,287 కాగా, 4,24,432 మంది బాధితులు చికిత్సతో పూర్తిగా కోలుకున్నారు. ఆసుపత్రుల నుంచి డిశ్చార్జి అయ్యారు. రికవరీ రేటు 60.85 శాతంగా నమోదయ్యింది. అమెరికాలోని జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ గణాంకాల ప్రకారం.. కరోనా మరణాల విషయంలో ఇండియా ప్రపంచంలో ఎనిమిదో స్థానంలో నిలిచింది.

# ప్లాస్మా దానం చేసిన సంబిత్ పాత్రా




**దిల్లీ:** కరోనా నుంచి కోలుకొని ఇంటికి చేరిన భాజపా అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా సోమవారం తన ప్లాస్మాను దానం చేశారు. ఇటీవల పార్టీ కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించిన ప్రధాని మోదీ.. ప్రతిఒక్కరూ సేవాభావాన్ని కలిగి ఉండాలని పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఆ మాటల స్ఫూర్తితోనే తాను ప్లాస్మా దానం చేసినట్లు సంబిత్ పాత్రా తెలిపారు. అంతకుముందు భాజపా జాతీయాధ్యక్షుడు జె.పి.నడ్డా ఆశీస్సులు తీసుకున్నట్లు పేర్కొన్నారు. కరోనాను జయించి ఆరోగ్యంగా ఉన్నవారు ప్లాస్మాను దానం చేయాలని ఈ సందర్భంగా సంబిత్ పాత్రా ప్రజలకు కోరారు. కరోనా సోకడంతో సంబిత్ పాత్రా గత నెల గురుగ్రామ్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. కొన్ని రోజుల చికిత్స అనంతరం కోలుకున్న ఆయన ఇటీవలే ఇంటికి చేరకున్నారు. కరోనా సోకి నయమైన వ్యక్తి రక్తాన్ని ప్లాస్మా థెరపీలో సేకరిస్తారు. అనంతరం దాని నుంచి ప్లాస్మాను వేరుచేస్తారు. ఇలా వేరుచేసిన ప్లాస్మాను అత్యవసర చికిత్స పొందుతున్న కరోనా బాధితునికి ఎక్కిస్తారు. కోలుకున్న వ్యక్తిలో కరోనా వైరస్‌పై పోరాడే శక్తి కలిగిన యాంటీబాడీస్ ఎక్కువగా ఉంటాయి. అందుకే, ఇటువంటి వ్యక్తి నుంచి సేకరించిన ప్లాస్మాను కరోనా బాధితుడికి ఎక్కించడం ద్వారా అతడి శరీరంలో యాంటీబాడీస్ వృద్ధిచెంది వైరస్‌పై పోరాడటంలో దోహదపడతాయి. దీంతో అతడు ఈ వైరస్ బారినుంచి బయటపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇప్పటికే దీన్ని ప్రయోగాత్మకంగా అనేక దేశాల్లో వినియోగిస్తున్నారు. సానుకూల ఫలితాలు ఉండడంతో ఈ చికిత్సను విస్తృతపరిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

# దేశంలో కరోనా పాజిటివ్ రేటు 6.73శాతం!



**దిల్లీ:** భారత్‌లో కరోనా వైరస్ విజృంభణ కొనసాగుతూనే ఉంది. తాజాగా దేశంలో 7లక్షల కేసులకు చేరువకావడంతో ప్రపంచంలోనే అత్యధిక కరోనా కేసులు నమోదవుతున్న దేశాలలో మూడో స్థానానికి చేరింది. ఈ సమయంలో దేశంలో కరోనా నిర్ధారణ పరీక్షలు పెంచడం, కాంటాక్ట్ ట్రేసింగ్‌ను గుర్తించడంతో పాజిటివ్ వచ్చినవారికి సకాలంలో వైద్య సేవలు అందిస్తున్నట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో కొవిడ్-19 పాజిటివ్ రేటు 6.73శాతంగా ఉన్నట్లు తెలిపింది. ఇప్పటివరకు దేశంలో కోటి శాంపిళ్లకు కరోనా నిర్ధారణ పరీక్షలు పూర్తిచేసినట్లు ఐసీఎంఆర్ ప్రకటించింది. ప్రస్తుతం దేశంలో ప్రతి పదిలక్షల జనాభాకు సగటున 6859 టెస్టులు నిర్వహిస్తున్నారు. అయితే కొన్ని రాష్ట్రాల్లో జాతీయ సగటుకంటే ఎక్కువ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నప్పటకీ పాజిటివిటీ రేటు తక్కువగా ఉన్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ స్పష్టంచేసింది. పుదుచ్చేరిలో 5.55శాతం, చండీగఢ్-4.36, అస్సాం-2.84, త్రిపుర-2.72, కర్ణాటక-2.64, రాజస్థాన్-2.51, గోవా-2.5, పంజాబ్ 1.92శాతంగా ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఏదైనా ప్రాంతంలో కరోనా వైరస్ వ్యాప్తిని అంచనా వేయడంతో కేసుల పాజిటివ్ రేటును ఎంతో కీలకంగా తీసుకుంటారు.

# అక్కడ టిక్‌టాక్ నిష్క్రమణ




**హాంకాంగ్:** భారత్‌లో నిషేధానికి గురైన టిక్‌టాక్ భారీ నష్టాన్ని మూటగట్టుకుంది. ఫలితంగా దాని మాతృ సంస్థ 'బైట్‌డాన్స్'కు దాదాపు 6 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లినట్లు అంచనా. ఇదిలా ఉండగా టిక్‌టాక్ హాంకాంగ్ మార్కెట్ నుంచి వైదొలగనున్నట్లు మంగళవారం ప్రకటించింది. అయితే దీనికి ఓ ప్రత్యేక కారణం ఉంది. హాంకాంగ్ స్వయంప్రతిపత్తిని కాలరాస్తూ చైనా పార్లమెంటు ఇటీవలే జాతీయ భద్రతా చట్టానికి ఆమెదం తెలిపింది. దీంతో అక్కడ నిరసనలు భగ్గుమన్నాయి. సోషల్ మీడియాలో నెటిజన్లు చైనా తీరును ఎండగడుతూ ఒకే తాటిపైకి వస్తున్నారు. దీనిపై కన్నెర్ర జేసిన ప్రభుత్వం హాంకాంగ్‌లో నిరసనలను అణిచివేసేంచుకు టిక్‌టాక్ వినియోగాన్ని నిలిపివేయాలని నిర్ణయించింది. ఇందుకోసం టిక్‌టాక్ నిర్వాహకులతోనూ అక్కడి ప్రభుత్వ అధికారులు సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో టిక్‌టాక్ తన కార్యకలాపాలను హాంకాంగ్‌లో నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. అయితే ప్రభుత్వ అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయానికి రాలేదని స్పష్టం చేసింది. కేవలం అక్కడ నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఈ నిర్ణయానికొచ్చినట్లు వివరించింది. ఈ చర్యతో 1,50,000 మంది యూజర్లను టిక్‌టాక్ కోల్పోనుంది. కాగా 1997లో బ్రిటన్ నుంచి హాంకాంగ్ చైనా చేతికి వచ్చాక.. "ఒక దేశం రెండు వ్యవస్థల విధానం" కింద హాంకాంగ్‌కు 50 ఏళ్ల పాటు అత్యున్నత స్వయంప్రతిపత్తి, న్యాయ స్వతంత్రత లభించాయి. అయితే హాంకాంగ్ స్వయంప్రతిపత్తి రద్దయ్యేలా చైనా తాజాగా జాతీయ భద్రతా చట్టాన్ని అక్కడ అమలు చేయనున్న నేపథ్యంలో మరోసారి నిరసనలు వ్యక్తమవుతున్నాయి.


# 7లక్షల కేసులు, 20వేల మరణాలు!

## 24గంటల్లో 22,252 కేసులు, 467మంది మృతి



**దిల్లీ:** కరోనా మహమ్మారి విజృంభణతో భారత్ అతలాకుతలం అవుతోంది. గతవారం రోజులుగా నిత్యం 20వేలకు పైగా పాజిటివ్ కేసులు బయటపడుతూనే ఉన్నాయి. తాజాగా దేశంలో నిన్న 22,252 కేసులు బయటపడడంతో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 7,19,665కి చేరినట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ వెల్లడించింది. ఇక దేశంలో కొవిడ్ మరణాల సంఖ్య కలవరపెడుతోంది. తాజాగా నిన్న ఒక్కరోజే 467మంది మృత్యువాతపడ్డారు. దీంతో భారత్‌లో కొవిడ్ మృతుల సంఖ్య 20,160కు చేరింది. కరోనా సోకిన మొత్తం బాధితుల్లో ఇప్పటివరకు 4,39,948 మంది కోలుకోగా మరో 2,59,557 యాక్టివ్ కేసులు ఉన్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుతం కరోనా వైరస్ విజృంభణతో భారత్ ప్రపంచంలోనే మూడోస్థానంలో కొనసాగుతోంది. ఆరు రోజుల్లోనే లక్షా 34వేల కేసులు,2760 మరణాలు.. ఇక దేశంలో జులై మాసం ప్రారంభం నుంచి కేసుల సంఖ్య మరింత పెరుగుతోంది. జులై 1 నాటికి దేశంలో 5,85,493 కరోనా కేసులు నమోదుకాగా ఈ ఆరు రోజుల్లోనే లక్షా 34వేల కేసులు నమోదయ్యాయి. అంతేకాకుండా ఈ ఆరురోజుల్లోనే దేశంలో 2760 మంది కరోనా రోగులు మృత్యువాతపడ్డారు.

# 100ఏళ్లలో తొలిసారి సరిహద్దులు మూత!



**సిడ్నీ:** పప్రంచాన్ని వణికిస్తోన్న కరోనా వైరస్ మహమ్మారి తాజాగా ఆస్ట్రేలియాలోనూ విజృంభిస్తోంది. దీంతో అధిక జనాభా కలిగిన రాష్ట్రాల సరిహద్దులను మూసివేస్తున్నట్లు అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. న్యూసౌత్ వేల్స్‌తో ఇతర ప్రాంతాలకు రాకపోకలను నిషేధిస్తున్నట్లు విక్టోరియా ప్రీమియర్ డేనియల్ ఆండ్రూస్ ప్రకటించారు. రాష్ట్రంలో ఒకేరోజు 127 పాజిటివ్ కేసులు నమోదుకావడంతో పాటు ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో ఆండ్రూస్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, ఆస్ట్రేలియాలో రాష్ట్రాల సరిహద్దులు మూయడం మాత్రం వందేళ్లలో ఇదే తొలిసారి. గతంలో స్పానిష్ ఫ్లూ వచ్చినప్పుడు మాత్రమే ఇలా ఇతర రాష్ట్రాలకు రాకపోకలు నిలిపివేసినట్లు అక్కడి అధికారులు పేర్కొన్నారు. మెల్‌బోర్న్‌లో గత కొన్ని రోజులుగా కొవిడ్ కేసుల సంఖ్య పెరిగింది. దీంతో 9ప్రాంతాల్లో పూర్తి లాక్‌డౌన్ విధించడంతోపాటు 30ప్రాంతాల్లో భౌతికదూరం నిబంధనలను కఠినంగా అమలుచేస్తున్నారు. మెల్‌బోర్న్ నుంచి ఇతర ప్రధాన నగరాలకు రాకపోకలను నియంత్రిస్తున్నారు. విక్టోరియా, సౌత్‌వేల్స్ రాష్ట్రాల సరిహద్దుల మూసివేతకు ఆస్ట్రేలియా ప్రధానమంత్రి స్కాట్ మారిసన్ మద్దతు పలికారు. ఇదిలాఉంటే, ఆస్ట్రేలియాలో కరోనా వైరస్ తీవ్రత తక్కువగానే ఉంది. ఇప్పటివరకు దేశంలో 8900 కరోనావైరస్ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వీరిలో 106 మంది మృత్యువాతపడ్డారు. అయితే, జూన్ నెలలో నిత్యం సగటున 9పాజిటివ్ కేసులు బయటపడగా గత వారంనుంచి ఈ సంఖ్య 109కి చేరడంతో ఆస్ట్రేలియా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

# రంగంలోకి దోబాల్ వెనక్కి తగ్గిన చైనా



**దిల్లీ:** గల్వాన్ లోయ తమదేనంటూ బీరాలు పలుకుతూ..దాదాపు రెండు నెలలపాటు భారత్‌తో కయ్యానికి కాలు దువ్వింది డ్రాగన్ దేశం. ఈ క్రమంలో జరిగిన ఘర్షణలో భారతీయ సైనికులు 20 మంది అమరులయ్యారు, పలువురు గాయపడ్డారు. ఈ పరిణామాల అనంతరం ఇరు దేశాల మధ్య శాంతి స్థాపన కోసం చర్చలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో చైనా బలగాలు తొలిసారిగా ప్రస్తుతం ఉన్న ప్రాంతం నుంచి కిలోమీటరు దూరం వెనక్కి వెళ్లాయి. దీనికి కారణం ఏంటి.. భారత్‌తో ఢీ అంటే ఢీ అన్న చైనా ఎందుకు వెనకడుగు వేసింది. ఇరు దేశాల సైనికాధికారుల మధ్య చర్చలు జరుగుతున్నా వెనకడుగు వేయని చైనాపై భారత్ ఏవిధంగా ఒత్తిడి పెంచింది అంటే సమాధానం ఒక్కటే.. జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోబాల్. ఆదివారం చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో రెండు గంటలపాటు దోబాల్ వీడియోకాల్‌లో మాట్లాడినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ఇరుదేశాలు వాస్తవాధీన రేఖను (ఎల్ఏసీ) గౌరవిస్తూ, గమనిస్తుండాలని.. అలానే వాస్తవ పరిస్థితులను మార్చేందుకు ఏ దేశం ఏకపక్ష చర్యలకు ఉపక్రమించకూడదని ఇరు దేశాల మధ్య అంగీకారం జరిగినట్లు సమాచారం. ఎల్ఏసీ వెంట ఉన్న సైనిక బలగాలను వీలైనంత త్వరగా అక్కడ నుంచి ఉపసంహరించడంతోపాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కలిసి పనిచేసేందుకు ఇరు దేశాలు అంగీకరించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. "ఎన్ఎస్ఏ అజిత్ దోబాల్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీలు పశ్చిమ ప్రాంతంలో నెలకొన్న వాస్తవ పరిస్థితుల గురించి ఇరువురు చర్చించడం జరిగింది. శాంతి పునరుద్ధరణ కోసం ఎల్ఏసీ వెంట ఉన్న సైనిక బలగాలను పూర్తిస్థాయిలో సరిహద్దుల నుంచి వెనక్కి రప్పించేందుకు ఇరుపక్షాలు అంగీకరించాయి. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు ఇరు దేశాల ప్రతినిధులు నిర్ణయం తీసుకున్నారు" అని విదేశాంగశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ చర్చల అనంతరం గల్వాన్ లోయలో ఘర్షణ జరిగిన ప్రాంతం నుంచి చైనా బలగాలు ఒక కిలోమీటరు మేర వెనక్కి వెళ్లినట్లు అధికారులు తెలిపారు. ప్రధాని మోదీ లద్దాఖ్లో పర్యటించి చైనాకు పరోక్షంగా గట్టి సందేశాన్ని పంపారు. తమ భూభాగాలను ఆక్రమించాలని చూస్తే భారత్ ధీటుగా బదులిస్తుందని చైనాను ఉద్దేశించి పరోక్షంగా హెచ్చరించారు..

# పట్టణాల్లో పెరిగిన నిరుద్యోగం



**న్యూఢిల్లీ:** కరోనా వల్ల ఎంతోమంది ఉద్యోగాలు హుష్‌కాకి అయ్యాయి. ఇప్పటికే నిరుద్యోగ భారతంగా పేరు గాంచిన మన దేశంలో నిరుద్యోగుల సంఖ్య ఇప్పుడు మరింత పెరిగింది. అర్బన్ ప్రాంతాల్లో లాక్‌డౌన్ వల్ల విధిస్తున్న కఠిన ఆంక్షల వల్ల పట్టణాల్లో నిరుద్యోగుల సంఖ్య 11.26 శాతానికి ఎగబాకిందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ(సీఎంఐఈ) అధ్యయనం తెలిపింది. ఈ అధ్యయనం ప్రకారం గత నాలుగువారాలుగా తగ్గుముఖంగా ఉన్న పట్టణ నిరుద్యోగిత జూలై 5 నాటికి 10.69 నుంచి 11.26 శాతానికి పెరిగింది. ఈ పెరుగుదల కర్ణాటక, తమిళనాడు, అస్సాం, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలో అధికంగా ఉంది. మరోవైపు లాక్‌డౌన్ వల్ల మార్కెట్లో డిమాండ్ పడిపోవడం, కూలీల కొరత.. సూక్ష్మ, స్థూల పరిశ్రమలపై ప్రభావం చూపుతోందని, ప్రతిఫలంగా ఉద్యోగ భద్రతపై నీలినీడలు కమ్ముకుంటున్నాయని స్పష్టం చేసింది.

# పుల్వామాలో ఎన్‌కౌంటర్



**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్‌లోని భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య మంగళవారం ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. పుల్వామాలోని గుసూ ప్రాంతంలో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో పోలీసు, ఓ ఆర్మీ సైనికుడు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న సమాచారంతో పోలీసులు, ఆర్మీ సంయుక్త బృందంతో గుస్సా ప్రాంతంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించింది. అయితే అప్పటికే అక్కడ మాటువేసిన ఉగ్రవాదులు వారిపై కాల్పులు జరిపారు. ఇరు పక్షాలకు జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో ఓ పోలీసు, ఆర్మీ సైనికుడు గాయపడినట్టు ఓ సీనియర్ పోలీసు అధికారి ధ్రువీకరించారు. ఈ ఘటనలో ఇద్దరు నుంచి ముగ్గురు ఉగ్రవాదులకు తీవ్ర గాయాలైనట్లు అధికారులు ఓ జాతీయ మీడియాకు వెల్లడించారు.

# విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ వార్తలు



విజయనగరం జిల్లా ఎస్పీ బి. రాజకుమారి, ఐపీఎస్ ఆదేశాల మేరకు జూలై 7న పట్టణంలోని లంక వీధిలో కరోనా అవగాహనా బృందం ప్రజలకు కరోనా వ్యాప్తి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు.
- వార్తావళి, విజయనగరం

## ఏఐబీసిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పంపన



**కాకినాడ, వార్తావళి, జూలై 7 :** అఖిల భారత బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గా బీసీ నేత పంపన రామకృష్ణ నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం కాకినాడ సుబ్బయ్య కళ్యాణమండపం లో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు గొలగాని కిషోర్ కుమార్ నియామకపత్రం అందజేశారు. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కిషోర్ కుమార్ మాట్లాడుతూ సామాజికంగా, ఆర్ధికంగా, రాజకీయంగా వెనుకబడిన అన్ని కులాల సమ్మేళనం ఫలితంగా ఏఐబిసిఎఫ్ ఏర్పడిందని, త్వరలో రాష్ట్ర, జిల్లా కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి ముందుకు వెడతామన్నారు. గత ప్రభుత్వాలు ఓబీసీ రిజర్వేషన్లు పట్టించుకోక పోవడంతో విద్య, వైద్య, రాజకీయ అవకాశాలు కోల్పోయామని తెలిపారు. బీసీలకు న్యాయం జరుగని పక్షంలో జాతీయ స్థాయిలో పోరాటం చేస్తామని అయన అన్నారు. నాయకులు ప్రెసంగి ఆదినారాయణ మాట్లాడుతూ నాయకులు ఈశ్వరయ్య, మంత్రి మల్లాడి కృష్ణారావు ఆలోచనల ఫలితంగా జాతీయ స్థాయిలో ఫెడరేషన్ ఏర్పడిందని, కేంద్ర, రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ పదవులు బీసీలకు కేటాయించాలని ఆదినారాయణ కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు పంపన రామకృష్ణ మాట్లాడుతూ వెనుకబడిన అన్నికులాల సంక్షేమానికి పోరాడతామని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురామ్, డా.కుంచె వెంకట రమణ, జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి గంగాధర్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఐఎస్టీయూసీ నాయకులు సబ్బతి ఫణీశ్వరరావు, పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

### ఇళ్లు శరవేగంగా పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలి

### ఎమ్మెల్సీ అబ్బు



**మండపేట, వార్తావళి, జూలై 7 :** పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించి, మిగిలిన ఇళ్లు కూడా శరవేగంగా పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని టీడీపీ కార్యక్రమాల నిర్వహణ జాతీయ కన్వీనర్, ఎమ్మెల్సీ వివివి చౌదరి(కూర్మపురం అబ్బు) ప్రభుత్వాన్నీ డిమాండ్ చేసారు. కూర్మపురం లోని ఆయన స్వగృహంలో మంగళవారం మీడియా తో మాట్లాడుతూ పేద వాడి కనీస అవసరాలు కూడు గూడు గుడ్డ పేద ప్రజలందరికీ అందజేయడం తెలుగు దేశం సిద్ధాంతం విధానమన్నారు. 1983 లో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు దివంగత నందమూరి తారక రామారావు నాయకత్వంలో టిడిపి ప్రభుత్వం యేర్పడ్డ తర్వాత దేశంలోనే మొదటిసారిగా రాష్ట్రంలో శాశ్వత గృహ నిర్మాణ పథకం ప్రవేశ పెట్టి మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. 2014 లో విభజిత రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో టిడిపి అధికారం చేపట్టిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లో ఎన్టీఆర్ గృహ నిర్మాణం, పట్టణ ప్రాంతాల్లో ఎన్టీఆర్ అర్బన్ గృహ నిర్మాణం పేరిట పేదవాడి స్వంత ఇంటి కల సాకారం దిశగా పనులు శరవేగంగా జరిగాయన్నారు. టిడిపి 5ఏళ్ల పాలనలో రూ50వేల కోట్లతో 25.57 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వ హౌస్ ఫర్ ఆల్ పథకాన్ని సద్వినియోగం చేసిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి నిర్మాణం పూర్తయిన ఇళ్లను పేదల స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించి, మిగిలిన ఇళ్లు కూడా శరవేగంగా పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## వివేకానంద పార్కులో వనం-మనం

**కాకినాడ, వార్తావళి, జూలై 7 :** సామాజిక వణసంరక్షణ లో భాగంగా ప్రతిఒక్కరూ మొక్క లు నాటి వాటిని బాధ్యతగా సంరక్షించాలని కాకినాడ నగరపాలకసంస్థ కమిషనర్ స్వప్నిల్ దిన్కర్ పుండ్కర్ సూచించారు. వనం-మనం కార్యక్రమంలో భాగంగా జిల్లా ఉద్యానవన శాఖ, నగరపాలకసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మొక్కల పంపిణీ కాకినాడ 40 వ డివిజన్ వివేకానంద పార్కులో మంగళవారం జరిగింది.కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం నివారణ మొక్కలతోనే సాధ్యమన్నారు. నగరంలో పచ్చదనం పెంపుకొరకు రోడ్ల మార్జిన్ల వెంట మొక్కలు నాటి సంరక్షిస్తున్నామని, ప్రతిఒక్కరూ వారి ఇండ్ల ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని అయన కోరారు . ఈసందర్భంగా ఉద్యానవన శాఖ సమకూర్చిన మొక్కలు నాటారు. అనంతరం ప్రజలకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో 40 వ డివిజన్ కార్పొరేటర్ సుంకర శివ ప్రసన్న, సుంకర విద్యాసాగర్, ఉద్యానవన శాఖ ఎడి సెరీల్, నగర పాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.




# కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద ఎమ్మెల్యే ధర్నా



**కాకినాడ, వార్తావళి, జూలై 7 :** తూర్పు గోదావరి జిల్లా పత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ధర్నా నిర్వహించారు. శంఖవరం మండలం వజ్ర కూటంలో అలనా కంపెనీ లో గత 2 రోజుల క్రితం అనంతపురం జిల్లాకు చెందిన ఇద్దరు కార్మికులు విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సంఘటన తెలిసిందే. వారి కుటుంబాలకు ఒక్కొక్కరికీ కోటి రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే పూర్ణచంద్ర ప్రసాద్ ,దళిత సంఘాలు డిమాండ్ చేశారు. యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో ఎమ్మెల్యే ధర్నాకు దిగారు. ధర్నాకు దిగిన ఎమ్మెల్యే పూర్ణచంద్ర ప్రసాద్, బాధిత కుటుంబాలతో కరణం కుమార్, పెద్దాపురం ఆర్డీవో మల్లిబాబు డి.ఎస్.పి శ్రీనివాస్ చర్చలు జరిపారు. రోజువారీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే కార్మికులు ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆ రెండు కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయాయి. శంఖవరం మండలంలోని వజ్రకూటం గ్రామ శివారున ఓ పరిశ్రమ నిర్మాణ పనుల్లో భాగంగా ఆదివారం బోరు వేస్తుండగా విద్యుత్తు ప్రమాదం చోటు చేసుకుంది. రిగ్ తవ్వుతుండగా పని ప్రదేశంలో పైన ఉన్న విద్యుత్తు తీగలు తగలడంతో విద్యుదాఘాతంతో అనంతపురం జిల్లా కనెకల్లు మండలం గోపాలపురానికి చెందిన హెచ్.రమేష్(23), డి.అంకన్న(35) అక్కడికక్కడే మృతి చెందారు. మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు సదరు పరిశ్రమ యాజమాన్యం ఎమ్మెల్యే ,అధికారులతో చర్చలు జరిపి ఒకొక్కరికి రూ.పన్నెండు లక్ష ల రూపాయలు చొప్పున పరిహారం చెల్లించేందుకు పరిశ్రమ యాజమాన్యం అంగీకరించడంతో శాంతించిన ఎమ్మెల్యే, దళిత సంఘాలు...పరిశ్రమ ఇచ్చిన పన్నెండు లక్షల రూపాయలు కాకుండా స్థానిక ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఒకొక్కరికి ఏభై వేల రూపాయలను అందజేశారు..మృతదేహాలను స్వగ్రామాలకు తరలించేందుకు అని ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

## వర్షానికి తగ్గిన వానరాలు..

### ఆహారం అందించే దాతృత్వం...



**కాకినాడ, వార్తావళి, జూలై 7 :** తూర్పుగోదావరి జిల్లాలో వానరాల కు క్రమం తప్పకుండా ఆహారం అందిస్తూ తమ దాతృత్వం చాటుతున్నారు. ముఖ్యంగా జర్నలిస్ట్ సంఘం నాయకులు, రాష్ట్రీయ బ్రాహ్మణ ఫ్రంట్ చైర్మన్ డి హెచ్‌వి సాంబశివరావు చేస్తున్న ఈ విశేష సేవలను పలువురు ప్రశంసిస్తూన్నారు.కాగా గతనాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వానరాలు చేదిరిపోయాయి. ప్రతి మంగళ, శనివారంలలో కాకినాడ యానాం రోడ్డు లోని కోరంగి వంతెన వద్ద వుండే వానరాలకు రాష్ట్రీయ బ్రాహ్మణ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఆహారం అందిస్తున్నారు.కాగా విజయవాడ పోలీస్ ఇంటిలిజెన్స్ డిఎస్పీ లో పోలంరాజు రాఘవ వానరాలకు ఆహారం అందించేందుకు ముందుకు వచ్చారు.మంగళవారం చొల్లంగి లోని స్వయంభూ ఆంజనేయ స్వామి వారి ఆలయం లో పూజలు అనంతరం వానరాలకు పలు రకాల ఆహారం అందచేశారు.అయితే తక్కువ సంఖ్య లోనే ఇవి రావడం బాధ కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో డి హెచ్ వి సాంబశివరావు, కాకినాడ డాల్ఫిన్ వెంకన్న, చాగంటిపాటి అబ్బు, జిల్లెళ్ల ప్రసాద్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.


## సకాలంలో ఇసుక సరఫరా చేయాలి

### జాయింట్ కలెక్టర్ డాక్టర్ జి.సి.కిశోర్ కుమార్



**విజయనగరం, వార్తావళి, జూలై 7 :** అవసరమైన వారందరికీ సక్రమంగా, సకాలంలో ఇసుక సరఫరా జరిగేలా చూడాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ జి.సి.కిశోర్‌కుమార్ ఆదేశించారు. ఇసుక నిల్వలు, సరఫరా, లభ్యత తదితర అంశాలపై తన ఛాంబర్‌లో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ అవసరాల కోసం శ్రీకాకుళం జిల్లా నుంచి తెప్పించి, జిల్లా స్టాక్ పాయింట్ లో నిల్వ చేసిన ఇసుక వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ అవసరమైన వారందరికీ సక్రమంగా ఇసుక సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకున్నవారందరికీ సకాలంలో ఇసుకను సరఫరా చేయాలన్నారు. ప్రతీ సచివాలయంలో ఇసుక బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరను అక్కడ చెల్లిస్తే, ఇంటికే ఇసుక సరఫరా చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో సుమారు 80 వరకు థర్డ్ ఆర్డర్ రీచ్‌లు ఉన్నాయని, వీటిలో 34 ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తరువాత వీటినుంచి ఉచితంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తీసుకువెళ్లేందుకు అనుమతినిస్తామని జెసి తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, గనులశాఖ డిప్యుటీ డైరెక్టర్ పూర్ణచంద్రరావు, ఎడిఎస్‌ఓ కె.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ ఏసీబీ అధికారి అరెస్టు







**పాతపట్నం (శ్రీకాకుళం జిల్లా), వార్తావళి, జూలై 7 :** నకిలీ ఏసీబీ అధికారిగా నగదు వసూళ్లకు పాల్పడుతున్న మండలంలోని పాశిగంగుపేటకు చెందిన గేదెల మురళీకృష్ణను, అతనికి సహకరించిన పాతపట్నం సీహెచ్‌సీ కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్ వాడ తిరుపతిరావును పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్లో ఎస్ఐ టీ రాజేష్ వెల్లడించిన వివరాల ప్రకారం... ఫిబ్రవరి 27న పాతపట్నం సామాజిక ఆస్పత్రి (సీహెచ్‌సీ)లో ఏసీబీ సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్ ఇన్‌చార్జి, ఎస్ఆర్ మెడికల్ ల్యాబ్ నిర్వాహకుడు బమ్మిడి అప్పలనాయుడు, కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్, ఏఎంసీ ల్యాబ్ నిర్వాహకుడు వాడ తిరుపతిరావులపై కేసులు నమోదు చేశారు. ఈ కేసు విషయంలో ఈ నెల 1న ఇద్దరిని శ్రీకాకుళం ఏసీబీ కార్యాలయంలో విచారణ కోసం పిలిపించారు. ఈ నెల 2న ఉదయం అప్పలనాయుడుకు ఫోన్ చేసి రూ.2.50 లక్షలు ఇస్తే కేసు లేకుండా చేస్తానంటూ మురళీకృష్ణ డిమాండ్ చేశాడు. అదే రోజు సాయంత్రం మరలా ఫోన్ చేసి, అరెస్టు చేయాలా డబ్బులు తెస్తావా? అని ఫోన్లో బెదిరించాడు. దీంతో అనుమానం వచ్చిన బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు నిందితుడి ఫోన్ నంబర్‌ను ట్రాక్ చేశారు. ఈ నెల 4న మళ్లీ ఫోన్ చేసి డబ్బులు పట్టుకుని జలుమూరు మండలం చల్లవానిపేట కూడలికి రావాలని ఆదేశించాడు. వెంటనే పోలీసులు బాధితుడిని తొలుత పంపించి చాకచక్యంగా వెళ్లి పట్టుకుని పాతపట్నం పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. తమదైనశైలిలో రోజంతా విచారించగా వాడ తిరుపతిరావు ప్రోద్బలంతో చేసినట్లు ఒప్పుకున్నాడు. దాంతో నిందితుడి ఫోన్ కాల్ డేటా ఆధారంగా నిర్ధారణకు వచ్చి శనివారం రాత్రి అతడిని అదుపులోకి తీసుకున్నారు. పాతపట్నం సీహెచ్‌సీలో కరోనా పరీక్షలు చేయగా నెగెటివ్ రిపోర్టులు రావడంతో కొటబొమ్మాళి కోర్టు జడ్జి కే ప్రకాష్‌బాబు ఎదుట హాజరు పరిచారు. 14 రోజులు రిమాండ్ విధించారు. పాతపట్నం సబ్‌జైలుకు నిందితులను తరలించామని ఎస్ఐ తెలిపారు.

## అపార్టుమెంటు, గ్రూపుహౌస్ వాసులు అప్రమత్తంగా ఉండాలి

### విజయనగరం జిల్లా ఎస్పీ బి. రాజకుమారి

**విజయనగరం, వార్తావళి, జూలై 7 :** విజయనగరం జిల్లాలో రోజు రోజుకు కరోనా కేసుల నమోదు సంఖ్య పెరుగుతున్నందున ప్రజలు, ముఖ్యంగా అపార్టుమెంట్లు, గ్రూపు హౌస్లో నివాసం ఉండేవారు మరింత అప్రమత్తంగా ఉండాలని విజయనగరం జిల్లా ఎస్పీ బి. రాజకుమారి తే. 07-07-2020 ది, మంగళవారం నాడు కోరారు. అపార్టుమెంట్లు, గ్రూపు హౌస్‌ల్లో నివాసం ఉండేవారు కరోనా నియంత్రణకు, వ్యాధి ప్రబలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కూడిన కరపత్రాన్ని జిల్లా ఎస్పీ బి. రాజకుమారి జిల్లా పోలీసు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బి. రాజకుమారి మాట్లాడుతూ - కరోనా కేసుల సంఖ్య క్రమంగా జిల్లాలో పెరుగుతూ, నేడు తీవ్రస్థాయికి చేరుకొనే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండి, మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ వ్యాధి ప్రబలడానికి ప్రధాన కారణంగా ప్రజలు భౌతికదూరం పాటించక పోవడం, ఒకే వస్తువును పలువురు వినియోగించడం, జాగ్రత్తలు తీసుకోవడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడమన్నారు. ప్రజలు ఎక్కువగా గుమిగూడేందుకు, వస్తువులను సామూహిక వినియోగం చేసే అపార్టుమెంట్లు, గ్రూపుహౌస్ వాసులు జాగ్రత్తలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, కేసులు సంఖ్య ఊహించని రీతిలో ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉందని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. కావున, అపార్టుమెంట్లు, గ్రూపు హౌస్ వాసులు పోలీసువారు సూచించిన సూచనలను తప్పనిసరిగా పాటించి, కరోనా మహమ్మారిని తరిమేందుకు చేస్తున్న ప్రయత్నానికి సహకరించాల్సిందిగా ఆమె కోరారు. పోలీసుశాఖ ప్రత్యేకంగా రూపొందించిన బోర్డులను వారి పరిధిలోని అపార్టుమెంట్లు, గ్రూపుహౌస్ లోని లిఫ్ట, షెల్లార్లులో అతికించాలని, సముదాయాల్లోని ప్రతీ ఇంటికి ఒక కరపత్రాన్ని అందించాలని జిల్లా ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. అపార్టుమెంట్లు, గ్రూపు హౌస్ సముదాయాల్లోకి ఇతరులను అనుమతించ వద్దని, పాలు, కూరగాయలు కొనుగోలు చేసిన తరువాత ఇంటి బయటనే వాటిని శుభ్రం చేయాలని, లిఫ్ట్ ను సామూహికంగా వినియోగించ వద్దని, లిఫ్ట్ బటన్స్, రెయిలింగ్సు, గోడలను నేరుగా తాకవద్దని, తులుపు హేండిల్స్ ను తరుచూ శానిటైజరుతో శుభ్రం చేయాలని, ఇండ్ల సముదాయాల్లోకి వచ్చే వ్యక్తుల వివరాలు, ఫోను నంబర్లు రిజిష్టరులో నమోదు చేయాలని, పేపరు బాయ్స్, బార్బర్స్‌సేల్స్ మేన్‌ను సముదాయాల్లోకి అనుమతించ వద్దని, ఆన్ లైనులో కొనుగోలు చేసిన వస్తువులను నేరుగా ఇంటికి తీసుకొని వెళ్ళవద్దని, చేతులను, కాళ్ళను శుభ్రంగా సబ్బుతో కడుక్కున్న తరువాతనే పనివారిని ఇండ్ల లోకి అనుమతించాలని, బర్త్ డే పార్టీలు, ముచ్చట్లు, సమావేశాలకు స్వస్తి పలకాలని, సామూహికంగా వాకింగులు, యోగా, షటిల్ బ్యాట్మింటన్, క్యారమ్స్, హౌసీ, అష్టా చమ్మా, క్రికెట్, వాలీబాల్ వంటి ఆటలను ఆడవద్దని, ఎవరికైనా కరోనా వ్యాధి లక్షణాలు పొడి దగ్గు, జ్వరం, గొంతునొప్పి, జలుబు వంటి లక్షణాలు ఉన్న వారికి దూరంగా ఉండాలని, అటువంటి వ్యక్తులు వెంటనే కరోనా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని, 104, 14410కు డయల్ చేసి, వైద్య సిబ్బంది సేవలను వినియోగించుకోవాలన్నారు. పోలీసు సహాయం కొరకు డయల్ 100 లేదా 6309898989కు వాట్సాప్ చేయాల్సిందిగా అపార్టుమెంట్లు, గ్రూపుహౌస్ వాసులకు జిల్లా ఎస్పీ బి. రాజకుమారి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మరియు ఎస్టీ సెల్ డిఎస్పీ బి. మోహనరావు, ఎఆర్ డిఎస్పీ ఎల్. మోహనరావు, ఎస్బీ సిఐలు వి.వి. అప్పారావు, ఎన్. శ్రీనివాసరావు, డిసిఆర్ బి సిఐ బి. వెంకటరావు, ఆతా రమణమూర్తి మరియు ఇతర పోలీసు అధిఆరులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ



**విజయనగరం, వార్తావళి, జూలై 7 :** కరోనా మహమ్మారి నేపథ్యంలో పేద ప్రజలను ఆదుకోవడం సామాజిక బాధ్యతగా గుర్తించి వారికి నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగిందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గాజులరేగ జోనల్ ఇంచార్జ్ సత్త ర వు శంకర్రావు, 49వ డివిజన్ పార్టీ నాయకులు కను గుల రాజా అన్నారు. మంగళవారం నాడు 49వ డివిజన్ గాజులరేగ పరిధిలో ఆచంట నగర్ లో లో 350 మంది పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా నేపథ్యంలో ఆచంట నగర్ ను అధికారులు రెడ్ జోన్ గా ప్రకటించడంతో నిరుపేదలు పనులకు వెళ్ళలేక ఇంటికే పరిమితం కావడంతో అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారు అని అన్నారు. శాసన సభ్యులు కోలగట్ల వీరభద్ర స్వామి గారి సూచనలతో ఆచంట నగర్ లోని 350 నిరుపేద కుటుంబాలకు పెసరపప్పు, పామాయిల్, గోధుమపిండి, గోధుమ నూక అప్పడాలు వంటి నిత్యవసర వస్తువులను అందజేయడం జరిగిందన్నారు. రాజకీయాలకు అతీతంగా పేద ప్రజలను ఆదుకోండి అంటూ ఎమ్మెల్యే కోలగట్ల సూచనలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు చేపడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని అన్నారు. ఈ ఈ కార్యక్రమంలో ఇప్పిలి గోపి తో పాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## కరోనా పాజిటివ్ కేసులు నమోదు

### 200 మీటర్ల వరకు కంటైన్మెంట్ జోన్

### సబ్ కలక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు



**పార్వతీపురం, వార్తావళి, జూలై 7 :** పార్వతీపురం మండలం బలగూడబ, బలిజిపేట మండలం జనార్ధనపురం, గరుగుబిల్లి మండలం నాగురూ, బొబ్బిలి మండలం నరతుమ్మిడిపేట, శివడవలస, పాచిపెంట మండలం పంచాలి గ్రామాలలో, సాలూరు టౌన్ చిన్నబజార్ జంక్షన్ వద్ద ఒక్కొక్కటి చొప్పున కరోనా పాజిటివ్ కేసులు నమోదైన దృష్ట్యా కంటైన్మెంట్ జోన్ గా ప్రకటిస్తూ పార్వతీపురం సబ్ కలక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీచేసారు. ఆయా గ్రామాలలో కరోనా పాజిటివ్ కేసు నివాసి గృహం నుండి 200 మీటర్ల వరకు కంటైన్మెంట్ జోన్ గాను, 400 మీటర్ల వరకు బఫర్ కంటైన్మెంట్ జోన్ గా ప్రకటించామని తెలిపారు. కంటైన్మెంట్ జోన్ పరిధిలో గల ప్రజలంతా అత్యవసర నిమిత్తం తప్ప బయటకు రాకూడదని ఆ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాంతంలోని ప్రజలంతా వీలున్నంత వరకు గృహ నిర్భంధంలో ఉండాలని, మాస్క్ లు, గ్లౌజ్ లు తప్పకుండా వినియోగించాలని, వ్యక్తుల మధ్య దూరాన్ని పాటిస్తూ ఆరోగ్య సేతు యాప్ డౌన్ లో డ్ చేసుకోవాలని కోరారు. అదేవిధంగా కరోనా లక్షణాలైన దగ్గు, జలుబు, జ్వరం ఉన్నవారు నిర్ధారణ పరీక్షలు జరుపుకోవాలన్నారు. పాజిటివ్ నమోదైన వ్యక్తితో కాంటాక్ట్ యైన వారు వెంటనే హోమ్ క్వారంటైన్ లోనికి వెళ్లాలని తెలిపారు. శానిటేషన్ సిబ్బంది ఆ ప్రాంతాన్ని హైపోక్లొరెడ్ ద్రావణాన్ని పిచికారి చేయడం జరుగుతుందన్నారు. కంటైన్మెంట్ జోన్ పరిధిలో చెక్ పోస్టులను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ ప్రాంతంలోని ప్రజలంతా జాగ్రత్తగా, స్వీయ రక్షణలో ఉండాలని తెలిపారు.

## గ్యాస్ ప్రభావిత ప్రాంత ప్రజలకు అన్ని రకాల వైద్యం



**విశాఖపట్నం, వార్తావళి, జూలై 7 :** ప్రమాదకర కంపెనీల విషయంలో రాజీ పడేదే లేదని పర్యాటక శాఖ మంత్రి అవంతి శ్రీనివాస్ తేల్చి చెప్పారు. ప్రమాదరక పరిశ్రమలు నివాస ప్రాంతం నుంచి తరలించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారన్నారు. మంగళవారం ఆయన వెంకటాపురంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభించారు. ఈ రోజు నుంచి వెంకటాపురం కేంద్రంగా వైఎస్సార్ క్లినిక్ ద్వారా 24 గంటల వైద్య సేవలు అందుతాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐదు గ్రామాల ప్రజలకు హెల్త్ కార్డులు మంజూరు చేశారు.

**త్వరలోనే ఎల్జీ పాలిమర్స్‌పై చర్యలు:** మంత్రి మాట్లాడుతూ.. గ్యాస్ ప్రభావిత ప్రాంత ప్రజలకు అన్ని రకాల వైద్యం అందుతుందని తెలిపారు. అవసరమైతే ప్రత్యేక వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు. హై పవర్ కమిటీ నివేదిక ఆధారంగా ఎల్జీ పాలిమర్స్ కంపెనీపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. త్వరలో స్థలం గుర్తించి వైఎస్సార్ క్లినిక్ భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సృజన, ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్, జేసీ అరుణ్ బాబు, జిల్లా వైద్యాధికారి తిరుపతిరావు, వైఎస్సార్‌సీపి సీనియర్ నాయకులు బెహరా భాస్కరరావు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## పొంచి ఉన్న ప్రమాదం

ఇక్కడ ప్రజల డబ్బుతో చదివి, స్వదేశాన్ని, బంధుమిత్రులను వదిలి వేలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న దేశాలకు చేరుకుని అక్కడి ప్రజలకు సేవ చేయాలని ఎందుకు అనుకుంటున్నారో పాలకులు ఒకసారి మనసుపెట్టి ఆలోచించాలి. వారికి అక్కడ లభిస్తున్న సదుపాయాలు, జీతభత్యాలు మనం ఇవ్వలేకపోవడంవల్లనే అక్కడికి పోతున్నారనేది కాదన లేని వాస్తవం. దేశ జనాభా అవసరం మేరకు కనీసం వైద్యసేవలు అందించాలంటే.. మరో ఐదారు లక్షల మంది అర్హత కలిగిన డాక్టర్ల అవసరం ఉంది. ఇక మందుల విషయంలో ఏమేరకు కేటాయిస్తున్నారో ఒక్కసారి పరిశీలించుకోవాలి. ఇన్ని లోపాలు పెట్టుకుని వైద్య ఆరోగ్య వ్యవస్థ కొట్టుమిట్టాడుతున్న తరుణంలో కరోనా వైరస్ ప్రజారోగ్యంపై దాడి చేస్తున్నది. ఇప్పటికైనా పాలకులు క్షేత్రస్థాయిలో వాస్తవికతను దృష్టిలో ఉంచుకుని వైద్యవిద్యారంగానికి అవసరమైన ప్రాధాన్యత ఇవ్వాలి. 'అప్పిచ్చువాడు వైద్యుడు.. ఎప్పుడు ఎడతెగక పారు ఏరు..లాంటి వసతులున్న చోటునే నివాసానికి ఎంపిక చేసుకోవాలని సుమతీ శతకారుడు ఏనాడో చెప్పారు. వైద్యానికి ఎంత ప్రాముఖ్యత ఉందో ఇంతకుమించిన ఉదాహరణ వేరే చెప్పనవసరం లేదు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి వైద్య రంగానికి అంతగా ప్రాముఖ్యత ఇవ్వలేదనే చెప్పొచ్చు. అవసరానికి అనుగుణంగా పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని కనీస వైద్యసదుపాయాలను అందించే దిశలో పాలకులు అడుగులు వేయలేదనే విషయం గత ఏడు దశాబ్దాలుగా అటు కేంద్రపాలకు కాని, ఇటు రాష్ట్ర పాలకులుకాని వైద్యరంగానికి కేటాయించిన నిధులే వెల్లడిస్తున్నాయి. అలా అని ఏమీచేయలేదని చెప్పడం లేదు. ప్రజారోగ్యంకోసం దేశవ్యాప్తంగా కోట్లాదిరూపాయలు ఖర్చు పెట్టారు, పెడుతున్నారు. డాక్టర్లు, సిబ్బంది ప్రజారోగ్యాన్ని కాపా డేందుకు కృషిచేస్తున్న మాటకూడా కొంత వాస్తవమే. కానీ పెరుగు తున్న రోగాలు, జనాభాకు అనుగుణంగా అది సరిపోవడం లేదనే విషయం పాలకులకు కూడా తెలియని కాదు. కరోనా మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా విస్తరించడం అందులో భారత్‌లో ఆలస్యంగానైనా విజృంభించడంతో పాలకుల అసమర్థత కొట్టొచ్చి నట్లుగా కనిపిస్తున్నది. ఈ రాష్ట్రం ఆ రాష్ట్రం అని కాదు. అటో ఇటో దేశమంతా అదే పరిస్థితి. ఎయిడ్స్, కేన్సర్, క్షయ, మెదడు వ్యాపు, స్వైన్‌ఫ్లూ, డెంగ్యూలాంటి వ్యాధులు కోరలు చాచి విజృంభిస్తూనే ఉన్నాయి. వాతావరణంలో మార్పులు వచ్చినప్పు డల్లా ఈ వ్యాధులు ప్రజారోగ్యంపై దాడి చేస్తూనే ఉన్నాయి. ఎన్ని ఆసుపత్రులు నిర్మించినా, సిబ్బంది సంఖ్యను పెంచి లక్ష లాది కోట్లు వెచ్చిస్తున్నామని అటు కేంద్ర పెద్దలు, ఇటు రాష్ట్ర పాలకులు ఎంతగా చెబుతున్నా.. ఆశించినమేరకు లక్ష్యాలు సాధించలేకపోతున్నారు. వ్యాధులను అదుపు చేయడంలో పాలక పెద్దలు విఫలమవ్వతూనే ఉన్నారు. తాజాగా గత నాలుగు నెలలుగా కరోనా వైరస్‌ను నియంత్రించడంలోకాని, చివరకు కరోనా సోకినవారికి కనీస వైద్యం అందించి ఆదుకోవడంలో డొల్లతనం చెప్పకనే చెపుతున్నది. అవసరం మేరకు పడకలు లేవు, సిబ్బంది లేరు, మందులు లేవు. చివరకు రోగ నిర్ధారణ పరీక్షలు కూడా సమయానికి చేయలేని నిస్సహాయ స్థితి. ఉదాహరణకు మెడికల్ హబ్‌గా దేశంలోనే గుర్తింపు తెచ్చుకున్న హైదరాబాద్ పరిస్థితినే తీసుకుందాం. కొవిడ్ రోగులకు సకాలం లో చికిత్స అందించే పరిస్థితులు లేవు. వ్యాధిబారిన పడినవారు చికిత్స సంగతి దేవ్వడెరుగు రోగ నిర్ధారణకు అవసరమైన పరీక్షలు కూడా చేయించుకోవడం గగనమైపోతున్నది. హైదరాబాద్‌లో మరో మూడు నాలుగు రోజులపాటు నమూనాలు సేకరించలేమని ప్రైవేటు ల్యాబ్‌లు ప్రకటించాయి. పడక కావాలన్నా పరీక్షలు చేయించుకోవాలన్నా ముందుగా రిజర్వు చేయించుకోవాలని కొన్ని ఆసుపత్రుల యాజమాన్యాలు సూచిస్తున్నాయి. హైదరాబాద్‌లో కొవిడ్ చికిత్సలు అందిస్తున్న దాదాపు 25 కార్పొరేటు ఆసుపత్రు లలో కొవిడ్‌కోసం రెండు వేల పడకలు కూడా లేవు. వాస్తవానికి ఆ ఆసుపత్రుల్లో దాదాపు పదిహేను వేల వరకూ పడకలు ఉన్నా కొవిడ్ బాధతులకోసం కేవలం రెండు, మూడు వేలు పడకలు కూడా కేటాయించలేకపోతున్నారు. అందుకు వారికి ఉన్న ఇబ్బం దులు వారికి ఉన్నాయి. ప్రభుత్వాసుపత్రుల్లో ముఖ్యంగా గాంధీ ఆసుపత్రిలో కొవిడ్ చికిత్సకు కేంద్రంగా మారినా సిబ్బంది కొరత తీవ్రంగానే ఉంది. కరోనాపై చేస్తున్న యుద్ధంలో ముందువరుస లో ఉన్న డాక్టర్లకు, ఇతర వైద్యసిబ్బంది ఈ వైరస్ రక్కసి వదలి పెట్టడం లేదు. దీంతో డాక్టర్లు కూడా వెనుకా ముందూ ఆలోచిం చాల్సిన పరిస్థితి ఏర్పడింది. చికిత్స అందక ప్రాణాలు కోల్పో తున్న కొవిడ్ బాధితుల వేదన అరణ్యరోదనగానే మిగిలిపోతు న్నది. మొన్న చెస్ట్ ఆసుపత్రిలో శ్వాస ఆడడం లేదని, ఆక్సిజన్ పెట్టడం లేదని ఒక యువకుడు వాట్సాప్ వీడియోద్వారా తన తండ్రికి తెలియజేసిన మరుగంటలో ప్రాణం వదిలాడు. హైదరాబాద్ శివారులోని ఒక ఇంజనీర్ శ్వాసకోశ సమస్యతో సమీపంలోని ఏ ఆసుపత్రులకు వెళ్లినా చేర్చుకునేందుకు నిరాక రించారు. తర్వాత కార్పొరేట్ ఆసుపత్రుల చుట్టూ తిరిగాడు. ఒకటి కాదు, రెండు కాదు అర డజను ఆసుపత్రుల మెట్లు ఎక్కి, ప్రాణాలను కాపాడాలంటూ ప్రాధేయపడ్డాడు. చివరకు తిరిగి తిరిగి ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో చేరుకోవడంతో అక్కడ చికిత్స అందిస్తుండగానే ప్రాణాలు వదిలాడు. గుండెను పిండిచేసే హృద య విదారకరమైన ఇలాంటి సంఘటనలు దేశంలో కోకొల్లలుగా జరుగుతున్నాయి. మరొకపక్క కొవిడ్ బాధితులకు చికిత్సలకు లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. ఒక కార్పొరేట్ ఆసు పత్రి ప్యాకేజీ కూడా ప్రకటించింది. ఈ వైరస్ తాకిన రోగికి చికిత్స అందించేందుకు ఏకంగా పదిహేడు లక్షల రూపాయల ప్యాకేజీని ప్రకటించింది. బీదా బిక్కే కాదు.. మధ్యతరగతి ప్రజలు కూడా అటు కన్నెత్తి చూడలేని పరిస్థితి దాపురించాయి. మెడికల్ హబ్‌గా పేరొందిన హైదరాబాద్‌లాంటి నగరంలోనే ఈ పరిస్థితి ఉంటే.. దేశంలోని మారుమూల గ్రామాల్లో ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలలో ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు.

# పరశురాముని గర్వభంగం

(నిన్నటితరువాయి)



రాజు రానే వచ్చాడు. స్వాగతం పలికారంతా. గుప్పెళ్ళతో పూలుజల్లారు. తమహర్షాన్ని వేయింతలు ప్రదర్శించారు. ప్రజల సంతోషానికి పరవశించిపోతూ కొడుకులు, కోడళ్ళసహా దశరథుడు అంతఃపురానికి చేరుకున్నాడు.కొద్దిరోజులు గడిచాయి. ఒకనాడు భరతుణ్ణి పిలిచాడు దశరథుడు. చెప్పాడిలా."మీ తాతగారికి నిన్ను చూడాలని ఉందట! నిన్ను తీసుకుని వెళ్ళేందుకు నీ మేనమామ వచ్చాడు. వచ్చి చాలా రోజులయింది. నువ్వుఏ మాటా చెప్పడం లేదట! అందుకనే చెబుతున్నాను. వెళ్ళిరా, తాతగారి కోరిక తీర్చి రా.""తప్పకుండా." అన్నాడు భరతుడు."శత్రుఘ్నుణ్ణి వెంట తీసుకుని వెళ్ళవచ్చు కదా?" తండ్రి అనుమతి కోరాడు."ఆనందంగా తీసుకుని వెళ్ళు." అన్నాడు దశరథుడు. తండ్రికి నమస్కరించి, మేనమామ, శత్రుఘ్నునిసహా భరతుడు తాతగారింటికి బయల్దేరాడు. రామలక్ష్మణులు తల్లిదండ్రులకు సేవలు చేస్తూ, తండ్రి ఆదేశించిన మేరకు పనులు చక్కబెట్టసాగారు. సదా మంత్రి సామంతుల వెంట ఉండి, వారి ఆలోచనలనూ, కార్యాలనూ గమనించసాగారు. నగరంలో ప్రజల బాధలను తెలుసుకోసాగారు. ఆ బాధల నుండి వారిని గట్టెక్కించి, అభినందనలు అందుకోసాగారు.రోజులు గడుస్తున్నాయి.సీతారాములు ప్రేమకు ప్రతిరూపం అన్నారు. సౌందర్యాలకీ, సౌశీల్యాలకీ వారు పెట్టింది పేరు అన్నారు. ప్రజలన్నట్టుగానే జీవిస్తూ, దీవిస్తూ సీతారాములు చల్లగా కాలం గడపసాగారు. అలా పన్నెండేళ్ళు గడిచిపోయాయి.

**మంధర దుర్బోధ: కాలనాగైన కైక**

వందిమాగధుల స్తోత్రపాఠాలతో సీతారాములు మేల్కొన్నారు. నారాయణుణ్ణి ధ్యానించారిద్దరూ. తర్వాత బ్రాహ్మణుల ఆశీర్వాదాలు అందుకున్నారు. అంతలో పెద్దపెద్ద ధ్వనులతో భేరీలు మోగాయి. అంటే...సీతారాముల ఉపవాస దీక్ష ముగిసిందను కున్నారు పౌరులు. ఉత్సాహంతో దీపాలు వెలిగించి, ఒకరిపై ఒకరు పువ్వులు చల్లుకున్నారు. నృత్యాలు చేశారు. అంతటా కోలాహలం చెలరేగింది. నవ్వులూ, కేకలూ వినవస్తున్నాయి. ఆ శబ్దాలకు చెవులు చిల్లులు పడ్డట్టనిపించిందేమో! చెవులుమూసుకుంది మంధర. అసలు ఎందుకు ఈ గోల? ఏమైంది? అది తెలుసుకునేందుకు కైకేయి ప్రాసాదం మీదికి పట్టి పట్టి అడుగులు వేస్తూ చేరుకోసాగిందామె.మంధర ఎక్కడపుట్టిందో తెలియదు. ఆమె తల్లిదండ్రులెవరో తెలియదు. బంధుదాసిగా కైకను ఆశ్రయించిందామె. పొట్టకూటికోసం చేతులు జోడించి, కన్నీరుపెట్టుకుంటే ఆమెను చేరదీసింది కైక. మరుగుజ్జు. వయసులో పెద్దది. పరుగెత్తి పెద్ద పెద్ద పనులు చేయలేదు. సరిగా నిలబడలేదు కూడా. అయినా జాలిపడి, మంధరను పరిచారికను చేసుకుంది కైక. తాను పరిచారికైనా, అంతకంటే ఎక్కు వగా ప్రవర్తిస్తూ వస్తోంది మంధర. కైకకు బాగా సన్నిహితురాలై, ఆమెను మందలించగలిగే స్థాయికి చేరుకోగలిగింది. దశరథుని ముద్దులరాణినే మందలించగలిగే స్థాయికి మంధర చేరుకోగలిగిందంటే, మామూలు మనుషులను ఆమె ఏ మేరకు అదు పులో ఉంచగలదో వేరే చెప్పనవసరం లేదు.తానొకతె ఉన్నదని తెలుసుకోవడం లేదు. తనని పట్టించుకోవట్లేదు. గోలగోల చేస్తున్నారు పౌరులు. ఎందుకు? ఏమిటి? అనుకుంటూ ప్రాసాదం మీదికి చేరుకుని, చుట్టూ కలయజూసింది మంధర. వీధుల్లో తోరణాలు కట్టి ఉన్నాయి. ముగ్గులు వేసి ఉన్నాయి. పువ్వులు జల్లుకుంటున్నారంతా. రకరకాల వాద్యాలు మోగిస్తూ నృత్యాలు చేస్తున్నారు. వేదఘోషలు వినవస్తున్నాయి. అలంకరించబడిన గుర్రాలూ, ఒంటెలూ, ఏనుగులూ బారులు తీరి ఉన్నాయి. అంతుచిక్కలేదు మంధరకు. ఆశ్చర్యపోతూ అటుగా చూసింది. కౌసల్య మందిరం మీద నిల్చుని, పూలతోరణాలు కడుతున్నారు పరిచారికలు. వాళ్ళలో ఒకదాన్ని కేకేసి పిలిచింది."ఏమిటీ కోలాహలం? ఎందుకిదంతా?" అడిగింది మంధర"ఎందుకంటే...తెల్లారితే మా రాములవారికి యువరాజ్య పట్టాభిషేకం. అందుకు." అంది ఆ పరిచారిక. ఆ అనడంలో దర్పాన్ని వ్యక్తం చేసిందామె. ఆ దర్పాన్ని తట్టులేకపోయింది మంధర. మండిపోయింది. కళ్ళెర్రజేసుకుంది. మెట్ల మీది నుంచి గుమ్మడికాయ దొర్లినట్టుగా దొర్లుకుంటూ కిందకి దిగింది. పరుగులాంటి నడకతో కైక గది దగ్గరకు చేరుకుంది. మూసి ఉన్న ఆ గది తలుపుల్ని విసు రుగా ముందుకు తోసింది. ఆ విసురుకి వెనక్కి వెళ్ళి గోడను బలంగా ఢీకొన్నాయి తలుపులు. గోడను ఢీ కొనడంతో తలుపులకు ఉన్న చిరుగంటలు పెద్దగా శబ్దించాయి. లోనికి ప్రవేశించింది మంధర. తల్పం మీద ఆదమరచి నిద్రపోతున్న కైకను సమీపించింది."కైకా" గట్టిగా అరిచింది. మంధర అరుపునకు మేల్కొంది కైక. కళ్ళిప్పి చూసింది."ఎందుకే? ఏమిటా కేకలు?" ఒళ్ళు విరుచుకుంటూ లేచి కూర్చుంది కైక."ఎందుకంటే ఏం చెప్పనే తల్లీ! మహారాజునీ బతుక్కి నిప్పు పెట్టేశాడు. నిన్ను దూరం చేశాడు." అంది మంధర. ఏడుపు అందుకుంది. (మిగతా రేపటి సంచికలో)

# రాజశేఖర రైతుబంధు

# ఎదురేది నీకు ఈ లోకమందు

జులై 8 జయంతి సందర్భంగా



యెదుగూరి సందింటి రాజశేఖరరెడ్డి (జులై 8, 1949 – సెప్టెంబర్ 2, 2009) ఆంధ్ర ప్రదేశ్ 16వ ముఖ్యమంత్రి, కాంగ్రెసు పార్టీ నాయకుడు. 1978లో తొలిసారిగా పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గంనుంచి శాసనసభలో అడుగుపెట్టిన రాజశేఖరరెడ్డి మొత్తం 6 సార్లు పులివెందుల నుంచి ఎన్నిక కాగా, 4 సార్లు కడప లోక్‌సభ నియోజకవర్గం నుంచి పార్లమెంటులో అడుగుపెట్టాడు. ఆయన పోటీచేసిన ప్రతి ఎన్నికలలోనూ విజయం సాధించారు. జనతాపార్టీ ప్రభంజనాన్ని తట్టుకొని విజయం సాధించిన తొలి ఎన్నికల (1978) వెంటనే మంత్రిపదవి పొందాడు. ఆ తరువాత వెనువెంటనే ముగ్గురు ముఖ్యమంత్రులు మారిననూ ఆ మూడు మంత్రిమండళ్లలో స్థానం సంపాదించాడు. ఆ తరువాత చాలా కాలం పాటు ఎటువంటి ప్రభుత్వ పదవీ దక్కలేదు. 1989–94 మధ్య ముఖ్యమంత్రి పదవి కోసం ప్రయత్నించినా అవకాశం రాలేదు. 1999లో మళ్ళీ శాసనసభకు ఎన్నికై ప్రతిపక్షనేతగా ఉంటూ తదుపరి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు వ్యూహం రచించాడు. 2003లో మండువేసవిలో 1460 కిలోమీటర్లు %ళ1ఠ% సాగిన పాదయాత్ర, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ప్రచారం అతని విజయానికి బాటలు పరచింది. 2004 ఎన్నికలలో పులివెందుల నియోజకవర్గం నుంచి 40వేలకు పైగా మెజారిటీతో విజయం సాధించడమే కాకుండా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలు పొందడంతో ముఖ్యమంత్రి పీఠం వై.ఎస్.రాజశేఖరరెడ్డికే దక్కింది. ఆయన సెప్టెంబర్ 2, 2009న చిత్తూరు జిల్లాలో రచ్చబండ కార్యక్రమానికి హాజరవడానికి వెళ్తూ నల్లమల అడవులలో హెలికాప్టర్ ప్రమాదానికి గురై దుర్మరణం పాలయ్యాడు. వైఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అవినీతిపై ఆయన మంత్రివర్గ సభ్యులే కాకుండా కేంద్రమంత్రులు, ప్రస్తుత మంత్రులు, ప్రధాన ప్రతిపక్ష నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే మైసూరారెడ్డి లెక్కలువేయగా%ళ2ఠ% అప్పటి మంత్రి పి.శంకర్రావు వ్యాఖ్యలను కోర్టు సుమోటాగా స్వీకరించి విచారణ చేపట్టింది. వైఎస్సార్ కాలంలో అవినీతి జరిగిందని సీబీఐ ప్రాథమిక విచారణలో వెల్లడించింది. "క్విడ్ ప్రో కో " రూపంలో వై. యస్. జగన్ కు చెందిన కంపెనీలలో పెట్టుబడులు వచ్చినట్లు సీబీఐ చార్జిషీటులో పేర్కొంది. వై.యస్.రాజశేఖర్ రెడ్డి 1949 జులై 8 న వైఎస్ఆర్ జిల్లా, జమ్మలమడుగులోని సి.ఎస్.ఐ. కాంప్‌బెల్ మిషన్ ఆసుపత్రిలో జన్మించాడు. ఆయన తల్లిదండ్రులు జయమ్మ, రాజారెడ్డి. ఆయన తండ్రి బళ్ళారిలో కాంట్రాక్టరుగా పనిచేస్తుండటం వల్ల ఆయన పాఠశాల చదువంతా బళ్ళారిలోని సెయింట్ జాన్స్ పాఠశాలలో సాగింది. ఆ తర్వాత విజయవాడ లయోలా కళాశాలలో చేరాడు. 1972లో గుల్బర్గా విశ్వవిద్యాలయం నుంచి వైద్యవిద్యలో పట్టా పుచ్చుకున్నాడు. గుల్బర్గాలోని మహాదేవప్ప రాంపూరే వైద్య కళాశాలలో వైద్యవృత్తిని అభ్యసిస్తుండగానే కళాశాల విద్యార్థిసంఘానికి అధ్యక్షుడిగా వ్యవహరించాడు. శ్రీ వెంకటేశ్వర వైద్యకళాశాల (యెస్.వి.ఆర్.ఆర్), తిరుపతి నుంచి హౌస్‌సర్జన్ పట్టా పొందాడు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల వైపు ఆకర్షితుడైన రాజశేఖరరెడ్డి యెస్.వి.ఆర్.ఆర్ కళాశాలలో పనిచేస్తుండగానే అక్కడ హౌస్‌సర్జన్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. తరువాత కొద్దిరోజులపాటు జమ్మలమడుగులోని సి.ఎస్.ఐ. కాంప్‌బెల్ ఆసుపత్రిలో వైద్య అధికారిగా పనిచేశాడు. ఆ తరువాత 1973లో పులివెందులలో తండ్రి వై.ఎస్.రాజారెడ్డి పేరుతో కట్టించిన 70 పడకల ఆసుపత్రిలో వైద్యుడిగా పనిచేశాడు. ఆ ఆసుపత్రి ఇప్పటికీ పనిచేస్తూనే ఉంది. వాళ్ళ కుటుంబం పులివెందులలో ఒక పాలిటెక్నిక్ కళాశాల, డిగ్రీ కళాశాలను కూడా నెలకొల్పారు. తరువాత వాటిని లయోలా సంస్థలకు అప్పగించారు. పులివెందుల దగ్గరిలో ఉన్న సింహాద్రిపురంలో ఉన్న కళాశాలను మాత్రం ఇప్పటికీ వీరి కుటుంబమే నిర్వహిస్తోంది. కళాశాల దశ నుంచే రాజకీయాలపై ఆసక్తి చూపిన రాజశేఖరరెడ్డి 1980–83 కాలంలో రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిపదవిని నిర్వహించాడు. కడప లోక్‌సభ నియోజకవర్గం నుంచి 4 సార్లు ఎన్నికయ్యాడు. పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 6 సార్లు విజయం సాధించాడు. రాష్ట్ర శాసనసభ ప్రతిపక్షనేత గా, రెండు సార్లు రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగానూ పనిచేశాడు. 1980 నుంచి 1983 దాకా గ్రామీణాభివృద్ధి, వైద్యశాఖ, విద్యాశాఖ మొదలైన కీలకమైన మంత్రి పదవులను నిర్వహించాడు. తెలుగు దేశం నేత నారా చంద్రబాబు నాయుడు మొదటగా కాంగ్రెస్ లో ఉన్నపుడు ఇరువురూ మంచి మిత్రులు. 1985 నుంచి 1998 వరకు పార్టీలో వై.ఎస్. నిత్య అసమ్మతివాదిగా పేరుపడ్డారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రులందరితో ఆయన పోరాటం చేయాల్సి వచ్చింది. 1989–94 మధ్య కాలంలో ముఖ్యమంత్రి కావాలని ప్రయత్నించినా సాధ్యపడలేదు. మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి, కోట్ల విజయ భాస్కర్ రెడ్డి వంటి నేతలతో ఆయన రాజకీయ యుద్ధమే చేశారు. వారికి వ్యతిరేకంగా క్యాంపులు నడిపాడు. మర్రి చెన్నారెడ్డిని, నేదురుమిల్లి జనార్ధన్‌రెడ్డిని పదవినుండి తొలగించడానికి ప్రధాన కారణమైన హైదరాబాదు నగరంలో జరిగిన అల్లర్లలో రాజశేఖర్ రెడ్డి వర్గపు పాత్ర ఉందన్న ఆరోపణలు వచ్చాయి. అదే తాను ముఖ్యమంత్రి అయ్యేనాటికి అలాంటి శిబిరాలు లేని పరిస్థితిని సృష్టించుకోగలిగాడు. రాజకీయాల్లో ముక్కుసూటితనానికి, నిర్మొహమాట ధోరణికి రాజశేఖరరెడ్డి ప్రసిద్ధుడు. **పిసిసి అధ్యక్షుడిగా:** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా వై.ఎస్.రాజశేఖరరెడ్డి రెండు సార్లు పనిచేశాడు. తొలిసారి 1983 నుంచి 1985 వరకు, రెండో పర్యాయం 1998 నుంచి 2000 వరకు ఆ పదవిలో ఉన్నాడు. 1999 నుంచి 2004 వరకు 11 వ శాసనసభలో ప్రతిపక్షనేతగానూ వ్యవహరించాడు.

**పాదయాత్ర:** 2003 వేసవికాలంలో ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో పాదయాత్ర చేపట్టి 1,467 కిలోమీటర్లు పర్యటించాడు. పాదయాత్ర వలన వ్యక్తిగతంగా వైఎస్.కు మంచి జనాదరణ లభించడమే కాకుండా ఆ తదుపరి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి దోహదపడింది.

**ముఖ్యమంత్రిగా:** 2004 మేలో జరిగిన 12వ శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికస్థానాలు సాధించడంతో అదివరకే పార్టీలో పేరు సంపాదించిన వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించాడు. పాదయాత్ర వలన జనాదరణ పొందడమే కాకుండా ఎన్నికల ప్రచారంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, పెండింగులో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తిచేయటం, జలయజ్ఞంలకు ప్రాధాన్యం ఇవ్వడంతో ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన పిదప తొలి సంతకం ఉచిత విద్యుత్తు ఫైలు పైనే చేశాడు. 2009 ఏప్రిల్లో జరిగిన 13వ శాసనసభ ఎన్నికలలో కూడా కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలలో విజయం సాధించడానికి కృషిచేసి వరుసగా రెండో పర్యాయం ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టాడు. 1600 ఎకరాల భూమిని డిసెంబరు 2006లో ప్రభుత్వానికి అప్పగించటం విపక్షాల విమర్శకి గురయ్యింది. చట్టాన్ని అతిక్రమించి భూమిని కలిగివున్నందుకు విపక్షాలు రాజశేఖరరెడ్డి రాజీనామా చేయాలని కోరాయి. సెప్టెంబర్ 2, 2009 న చిత్తూరు జిల్లా పర్యటనకు బయలుదేరగా ఉదయం గం.9.35 నిమిషాలకు హెలికాప్టరుతో సంబంధాలు తెగిపోయాయి. ముఖ్యమంత్రి ఆచూకీ కోసం గాలించగా 25 గంటల తరువాత ప్రమాదానికి గురైన హెలికాప్టర్ ఆనవాళ్ళు లభించాయి. వై.ఎస్.తో సహా మొత్తం ఐదుగురు హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు.

# నిరోధకత పెరగాలంటే..



లాక్‌డౌన్ కారణంగా కుటుంబ సభ్యులందరూ ఎక్కువ సేపు కలిసి ఉండడం, పెద్దగా కాలక్షేపం లేకపోవడంతో నచ్చిన ఆహార పదార్థాలు ఇంట్లో వండించుకోవడం బాగా పెరిగింది. అయితే ఎక్కువ తినేస్తున్నామన్న ఆందోళన చాలామందిలో కనిపిస్తోంది. "నిజానికి ఇది రోగ నిరోధక శక్తిని పెంచుకోవాల్సిన సందర్భం" అంటున్నారు న్యూట్రిజోన్ సంస్థ వ్యవస్థాపకురాలు, పోషకాహార నిపుణురాలు ముత్తులక్ష్మి. కరోనా సోకే ప్రమాదం ఎక్కువగా ఉన్న పిల్లలూ, వయోధికులతో పాటు పెద్దల తీసుకోవాల్సిన ఆహార సూచనలు చెబుతున్నారిలా...

మాంసం, చేపలు: చికెన్, మటన్, చేపలు... వీటిలో అధికశాతం ప్రొటీన్స్ ఉంటాయి. కణజాలాన్ని మరమ్మతు చేసుకోవడంలో, తెల్లరక్తకణాలు పెరగడంలో ప్రొటీన్లు సహాయపడతాయి. మాంస ఉత్పత్తులలో విటమిన్ – బి, జింక్, ఐరన్ అధికంగా ఉంటాయి. ఇవన్నీ రోగ నిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తాయి.

**యోగర్ట్ :** చిన్నారుల పేగులను యోగర్ట్ బలోపేతం చేస్తుంది. జీర్ణకోశ అనారోగ్యాలను నివారిస్తుంది. దీనిలోని ప్రోబయాటిక్స్ చెడు బ్యాక్టీరియాతో పోరాడతాయి.

**నట్స్:** వీటిలో విటమిన్–ఇ అధికంగా ఉంటుంది. కాబట్టి ఇవి శరీరానికి ఇమ్యూన్ బూస్టర్‌గానూ, యాంటీ ఆక్సిడెంట్స్‌గానూ ఉపకరిస్తాయి.

**ఆకు కూరలు:** క్యాబేజీ, బ్రోకోలీ, పాలకూర లాంటి ఆకు కూరలన్నిటితో పాటు టొమాటోలోనూ అనేక పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. వీటిలోని బీటా కెరోటిన్, ఇతర కెరోటినాయిడ్స్ రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. సీనియర్ సిటిజన్లలో చాలామందికి మధుమేహం, రక్తపోటు, ఆస్తమా లాంటి వ్యాధులు ఉంటాయి. వారి శరీరం ప్రొటీన్‌ను తక్కువగా ఉత్పత్తి చేస్తుంది. కాబట్టి వారికి సప్లిమెంట్స్ అవసరమవుతాయి. వీరు తినాల్సినవేమంటే...

గుడ్లు: కోడిగుడ్లలోని తెల్లసొనలో ప్రొటీన్ ఎక్కువగా ఉంటుంది. కణజాలం మరమ్మతుకు ఇది తోడ్పడుతుంది. శాకాహారులు తక్కువ కొవ్వు ఉన్న పాల నుంచి తయారుచేసిన పనీర్ వాడడం మంచిది.

**చికెన్:** ఇతర మాంసపదార్థాలతో పోలిస్తే చికెన్‌లో ప్రొటీన్ అధికం. కొవ్వు తక్కువ. అలాగే చికెన్‌లో ఉండే నియాసిన్, సెలీనియంలకు కేన్సర్‌తో పోరాడే గుణాలున్నాయి.

అన్నం:
ఇది క్లిష్టమైన కార్బోహైడ్రేట్. నెమ్మదిగా అరగడంతో పాటు శరీరం ఎక్కువసేపు శక్తిని వినియోగించుకోగలుగుతుంది. రైస్‌లో సోడియం పరిమాణం తక్కువ. పొటాషియం, బి–విటమిన్స్ తగు మోతాదులో ఉంటాయి. అన్నంలో కొవ్వు నామమాత్రమే. కొలెస్ట్రాల్ కూడా ఉండదు. గ్లుటెన్ రహితం కావడం వల్ల ఉదర కుహరానికి సంబంధ వ్యాధులు ఉన్నవారికి ఉపయుక్తం కూడా.

**యోగర్ట్ :** యోగర్ట్‌లో కాల్షియం అధికంగా ఉంటుంది. ఆస్టియోపోరోసిస్ (ఎముకలు గుల్లబారే వ్యాధి) నివారణకు ఇది తోడ్పడుతుంది. జీర్ణసంబంధ వ్యాధులు ఉన్నవారికి కూడా ఉపయుక్తం.

గుడ్లు : రోగ నిరోధక శక్తి వృద్ధి చెందడానికి తగినంతగా ప్రొటీన్ తీసుకోవడం అవసరం. గుడ్లు ఇందుకు బాగా తోడ్పడతాయి. విటమిన్– డి, జింక్, సెలినియం, విటమిన్– ఇ లాంటి పోషకాలు వీటిలో లభిస్తాయి.

**చికెన్:** చికెన్‌లో విటమిన్– బి6 అధికంగా ఉంటుంది. ఎర్ర రక్తకణాలు ఏర్పడేందుకు ఇది తోడ్పడుతుంది. చికెన్‌లో లివర్ తినడం వల్ల అదనంగా ఐరన్, జింక్ లభిస్తాయి.

పాలకూర (స్పినాచ్): రోగ నిరోధక శక్తిని పెంచుకోవడానికి విటమిన్–ఎ అవసరం. పాలకూరలో బీటా కెరోటిన్ లభిస్తుంది. ఆకు కూరలలో ఫోలెట్ లాంటివి అధికంగా ఉంటాయి. ఆకుకూరలు తినడం ఇష్టం లేనివారు గ్రీన్, లేదంటే ఆరెంజ్ రంగుల్లో ఉండే కూరగాయలు తీసుకోవచ్చు.

**బాదం :** బాదం పప్పులో విటమిన్– ఇ అధికంగా ఉంటుంది. అలాగే మ్యాంగనీస్, మెగ్నీషియం, ఫైబర్ ఉంటాయి. రోజూ గుప్పెడు బాదం పలుకులు తింటే పలురకాలుగా ఆరోగ్యానికి మేలు జరుగుతుంది.

# కురుల పరిమళం కోసం

శరీరం రోజంతా తాజాగా, పరిమళభరతంగా ఉండేందుకు పర్‌ఫ్యూమ్ వాడుతాం. చెమట వల్ల శరీరమే కాదు మాడు భాగం దురద పుట్టి, జుట్టంతా చెడు వాసన వస్తుంది. ఇంటి వద్ద తయారు చేసుకున్న స్ప్రేతో కేశాలను సువాసనతో తాజాగా మార్చుకోండిలా...

**కావలసినవి:** సగం కప్పు రోజ్ వాటర్, కొన్ని చుక్కల వెనీలా ఎక్స్ట్రాక్ట్, 10–15 చుక్కల జాస్మిన్ నూనె, కొన్ని చుక్కల స్వీట్ ఆరెంజ్ నూనె.

**తయారీ:** ఒక గిన్నెలో రోజ్ వాటర్, వెనీలా ఎక్స్ట్రాక్ట్,



జాస్మిన్ నూనె, స్వీట్ ఆరెంజ్ నూనె తీసుకొని బాగా కలపాలి. ఈ ద్రావణాన్ని స్ప్రే బాటిల్‌లో పోయాలి. అంతే హెయిర్ పర్‌ఫ్యూమ్ రెడీ. ఇప్పుడు స్ప్రే బాటిల్‌ను షేక్ చేయాలి. తరువాత ఆ బాటిల్‌ను పొడి ప్రదేశంలో ఉంచాలి. ఈ పర్‌ఫ్యూమ్‌ను తలస్నానం చేసిన తరువాత లేదా తలంటు చేయకున్నా వెంట్రుకలపై స్ప్రే చేసుకోవచ్చు. జుట్టు తాజాదనం, మెరుపు కోల్పోయినట్టు అనిపిస్తే ఈ హెయిర్ పర్‌ఫ్యూమ్ ఉపయోగించి చూడండి.

ఆ.వె . కర్మజేయువరకుకర్తవునీవెగా,!
కర్మఫలితమునకుకర్తకావుజి
కావున ఫలితమునకాశించ
వలదీవు
తెలిసిమెలగుమయ్య!తెలుగు
వాడ!



– మల్లాది సోమేశ్వర శర్మ, 9603995769

# విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు పుస్తక ఆవిష్కరణ



**విశాఖపట్నం, పశ్చిమం, వార్తావళి, జూలై 7:** పోరాడి సాధించుకున్న ఉక్కు ఫ్యాక్టరీ ఘన చరిత్రను పుస్తక రూపంలో విడుదల చేస్తున్నట్లు విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు పుస్తక రచయిత,సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ నరసింగరావు చెప్పారు.ఈ రోజు నగర సిపిఎం కార్యాలయంలో ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న అరుణ్ జీ,కే.స్వతంత్రకుమార్,దండునాగేశ్వర రావులు విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు పుస్తకాన్ని ఆవిష్కరించారు.స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాలకు ఈ పుస్తకం ప్రామాణికంగా ఉపయోగపడుతుందని నరసింగరావు అభిప్రాయపడ్డారు.త్యాగాలతో సాధించుకున్న ఉక్కు ఫ్యాక్టరీని ఉద్యమాలతో రక్షించుకోవాలని కోరారు.ఉక్కు ఉద్యమంలో చాలామంది ప్రాణాలు కోల్పోయారని,లక్షకు పైగా కుటుంబాలు ప్రత్యక్షంగా,పరోక్షంగా ఉక్కు ఫ్యాక్టరీ పై ఆధారపడి ఉపాధిపొందుతున్నారని చెప్పారు.నగర సిపిఎం కార్యదర్శి డాక్టర్ బీ.గంగారావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం నుంచి ప్రస్తుతం ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలలో ప్రత్యక్షంగా పాల్గొన్న నరసింగరావు రాసిన పుస్తకం భావితరాలకు మార్గదర్శకం కాగలదని చెప్పారు.జిల్లా కార్యదర్శి లోకనాథం మాటాడుతూ ఎంతో అనుభవంతో రాసిన ఈ పుస్తకం అన్నితరాలవారికి ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.ఈ ఆవిష్కరణ సమావేశంలో సిపిఎం నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్వేపల్లి నియోజకవర్గంలో స్థానికులకే ఉద్యోగాలు



**పొదలకూరు, వార్తావళి, జూలై 7:** నెల్లూరు జిల్లా, సర్వేపల్లి నియోజకవర్గం, పొదలకూరు మండలం, అమ్మ వారి పాళెం గ్రామంలో పర్యటించి, స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలియజేసిన వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, సర్వేపల్లి శాసన సభ్యులు కాకాణి గోవర్ధన్ రెడ్డి గారు. సుమారు 70 లక్షల రూపాయలతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు. అమ్మ వారి పాళెం ప్రాథమిక పాఠశాలను సందర్శించి, నాడు-నేడు పథకం ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కాకాణి.

సర్వేపల్లి నియోజకవర్గంలో స్థానికులకే ఉద్యోగ ఉపాధి అవకాశాలలో ప్రాధాన్యత ఇస్తాం. ఎన్నికల ముందు పలు సందర్భాల్లో చెప్పిన విధంగా స్థానికేతరులను తరిమికొట్టి, స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. తెలుగుదేశం ప్రభుత్వంలో టిడిపి నాయకులు ముడుపులకు కక్కుర్తి పడి స్థానికులకు అన్యాయం చేసి, స్థానికేతరులకు ఉద్యోగాలు కల్పించారు. సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలో విద్యుత్ సబ్ స్టేషన్ లలో షిఫ్ట్ ఆపరేటర్లు గా పని చేస్తున్న స్థానికేతరులను తొలగించి, వారి స్థానాలలో స్థానికులకు ఉద్యోగావకాశం కల్పించే కార్యక్రమానికి మొట్టమొదటగా శ్రీకారం చుట్టాం. రాబోవు రోజుల్లో కంపెనీ యాజమాన్యాలు జగన్మోహన్ రెడ్డి గారు రూపొందించిన చట్టం ప్రకారం ఖచ్చితంగా 75% మంది స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించి తీరాల్సిందే. జగన్ మోహన్ రెడ్డి గారు అసెంబ్లీలో చేసిన చట్టం ప్రకారం కంపెనీల యాజమాన్యం 75 శాతం స్థానికులకే ఉద్యోగాలు ఇచ్చే విధంగా పట్టుపట్టి సాధిస్తాం.

# బిఎండబ్ల్యు, మినీ కార్లకు సరిసాటి లేని సర్వీస్



బిఎండబ్ల్యు గ్రూప్ ఇండియా వినియోగదారులకు ఆనందాన్ని అందించే భరోసాను మరింత బలోపేతం చేసుకోగా, సర్వీస్/మెయింటెనెన్స్ ఆఫర్లలో నూతన అనుకూలతలను పరిచయం చేసింది.సర్వీస్ ఇన్క్లూజివ్ బిఎండబ్ల్యు, గ్రూపు ఇండియా పారదర్శక సర్వీస్ ప్యాకేజెస్ శ్రేణిలో ఉండగా మెయింటెనెన్స్, ఇన్స్పెక్షన్, వేర్ అండ్ టేర్‌లు ఇందులో కలిసి ఉన్నాయి. రిపేర్ ఇన్క్లూజివ్ స్టాండర్డ్ వారెంటీ విస్తరణను కలిగి ఉంటుంది. ఒక ఆకర్షణీయమైన అడ్వాన్స్ చెల్లింపు విస్తృత శ్రేణి సేవలను కలిగి ఉంది. తమ వినియోగానికి అనుగుణంగా బిఎండబ్ల్యు, మరియు మిని వినియోగదారులకు అత్యంత ఆకర్షణీయమైన, ముందుగా నిర్ణయించిన ధరలో ప్యాకేజ్ మరియు పోర్ట్‌ఫోలియోను ఎంపిక చేసుకునే అనుకూలతలను అందిస్తోంది. ఇప్పుడు వారికి తమ సర్వీస్ ఇన్క్లూజివ్ ప్యాకేజ్‌ను గడువు తీరిన తరువాత కూడా 15 నెలల వరకు రెన్యువల్ లేదా విస్తరించుకునే ఎంపికకు అవకాశం కల్పిస్తుంది. బిఎండబ్ల్యు, గ్రూపు ఇండియా యాక్టింగ్ ప్రెసిడెంట్ అర్లిండో టీక్సీరా మాట్లాడుతూ "బిఎండబ్ల్యు, గ్రూప్ ఇండియా ఆఫ్టర్ సేల్స్ ఉత్పత్తులు మరియు సేవలకు ఒక సరళమైన లక్ష్యాన్ని కలిగి ఉంది- వినియోగదారులను మైలు తరువాత మైలుకు, ఏడాది అనంతరం ఏడాదికి ప్రయాణాన్ని ఆనందించేందుకు సంసిద్ధం చేయడం ఇందులో ఉంది. సర్వీస్ మరియు రిపేర్ ఇన్క్లూజివ్ ద్వారా మా వినియోగదారులకు సంపూర్ణ మనఃశ్శాంతి లభిస్తుంది. వారు మెయింటెయినెన్స్ లేదా వేర్ అండ్ టేర్ గురించి కొంచెం కూడా ఆలోచించి మనసు పాడు చేసుకోవలసిన అవసరం ఉండదు, ఎందుకంటే వారు తమ బిఎండబ్ల్యు లేదా మినిలకు అత్యుత్తమ కవరేజ్ పొంది ఉన్నామని వారికి తెలుసు. సర్వీస్ మరియు రిపేర్ ఇన్క్లూజివ్‌లో ఇవి అన్నీ ఉన్నాయి: మా సర్వీస్ స్పెషలిస్టుల పరిణితి, బిఎండబ్ల్యు, ఒరిజినల్ పార్ట్స్ వినియోగం మరియు వారి కారు అత్యుత్తమ నిపుణుల చేతిలో ఉందన్న మహోన్నత భావన కలుగుతుంది. నూతన అదనపు అనుకూలతలతో మేము మా అసాధారణ సేవా కొలమానాలకు ఈ వర్గంలో అత్యుత్తమ విలువలను అందించడాన్ని కొనసాగించడం ద్వారా సరిసాటి లేని యాజమాన్యపు అనుభవాన్ని సృష్టిస్తామని" తెలిపారు.

## రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

### జాయింట్ కలెక్టర్ డాక్టర్ జి.సి.కిశోర్ కుమార్

**విజయనగరం, వార్తావళి, జూలై 7:** ఈ నెల 8వ తేదీన రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జా యింట్ కలెక్టర్ డాక్టర్ జి.సి.కిశోర్ కుమార్ ఆదేశించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో, రైతు దినోత్సవ ఏర్పాటు చేశారు.

# క్వారంటైన్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

## వసతులు, పారిశుధ్యాన్ని మెరుగు పర్చాలని ఆదేశం



**డెంకాడ, గుర్ల, వార్తావళి, జూలై 7:** జిల్లాలోని చింతవలస, గుర్ల క్వారంటైన్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం.హరి జవహర్‌లాల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి వసతులను పరిశీలించారు. మెనూపై ఆరా తీశారు. సిబ్బంది పనితీరుపట్ల ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోవాలని, పారిశుధ్యాన్ని మెరుగు పర్చాలని ఆదేశించారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా కొంతమందిని క్వారంటైన్ కేంద్రాల్లో ఉంచాల్సి వస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. డెంకాండ మండలం చింతలవసల వద్దనున్న ఎంవిజిఆర్ క్వారంటైన్ కేంద్రాన్ని సోమవారం మధ్యాహ్నం కలెక్టర్ హరి జవహర్‌లాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కేంద్రంలో 200 మందిని ఉంచేందుకు తగిన వసతి సౌకర్యం ఉందని డిఆర్ఓ జె.వెంకటరావు తెలిపారు. ప్రస్తుతం కేంద్రంలో 36 మంది ఉన్నారని చెప్పారు. ఇకనుంచీ సాధారణ ప్రజలను గుర్ల, ఎస్‌కోట క్వారంటైన్ కేంద్రాలకు తరలిస్తామని, రోగులతో ప్రైమరీ కాంటాక్ట్ ఉన్నవారిని ఎంవిజిఆర్ క్వారంటైన్ కేంద్రంలో ఉంచుతామని డిఆర్ఓ చెప్పారు. ఈ కేంద్రంలో అమలు చేస్తున్న మెనూ, కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఎంవిజిఆర్ క్వారంటైన్ కేంద్రం నిర్వహణపై కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. కొందరు ఉద్యోగులు పనితీరు బాగులేదని, ఇలాగే కొనసాగితే కఠిన చర్యలను తీసుకుంటామని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పారిశుధ్యాన్ని మెరుగు పర్చాలని ఆదేశించారు. సాయంత్రం గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న క్వారంటైన్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమాల్లో డెంకాడ తాశీల్దార్ చంద్రమౌళి, ఎంపిడిఓ స్వరూపరాణి, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, గుర్ల తాశీల్దార్ జి.కల్పవల్లి, ఎస్ఐ లీలావతి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల ఇళ్ల కేటాయింపులో అవకతవకలు

## విజయనగరం మాజీ ఎమ్మెల్యే మీసాల గీత



**విజయనగరం, వార్తావళి, జూలై 7:** పేదలకు ఇళ్ల కేటాయింపు విషయంలో వైకాపా ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు ఆశ్చర్యంగా ఉందని విజయయనగరం మాజీ ఎమ్మెల్యే మీసాల గీత అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రతి పేదవాడికి ఇల్లు ఉండాలనే ఉద్దేశంతో ,పార్టీలతో సంబంధం లేకుండా అర్హత కలిగిన ప్రతి పేదవాడికి ఇల్లు మంజూరు చేశారన్నారు. వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్హులకు కాకుండా కేవలం వైకాపా నేతలు చెప్పినవారికే ఇళ్ల పందేరం చేస్తున్నారన్నారు. తెలుగుదేశం హయాంలో కేటాయించిన లబ్ధిదారులను మభ్యపెట్టి, బెదిరించి, పేదవాడికి ఇల్లు లేకుండా లాగేస్తున్నారని ఆరోపించారు. తెలుగుదేశం హయాంలో వేల ఇళ్ల నిర్మాణం కోసం అనుమతులు ఇచ్చారని, వాటిలో చాలా వరకు ఇల్లు నిర్మించుకుని సంతోషంగా ఉన్నారన్నారు. కొన్ని ఇళ్ల నిర్మాణాల బిల్లులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. వైకాపా ప్రభుత్వం పెండింగ్ బిల్స్ గురించి ఇప్పటివరకు ఆలోచన చేయలేదన్నారు. వైకాపా నేతలు ఆదాయం వచ్చే వాటిని మాత్రమే చూసుకుంటున్నారు తప్ప పేదల కలను నెరవేర్చే పనులు చేయడం లేదని విమర్శించారు. ఇక నుంచైనా సరే రాష్ట్రంలో జరుగుతున్న పరిస్థితులు గాని, పేద వారు పడుతున్న ఇబ్బందులు

# పి.ఎం.ఏ.వై అపార్ట్మెంట్ ప్లాట్స్ వద్ద టీడీపీ నేతల నిరసన



**కడప, వార్తావళి, జూలై 7:** కడప అసెంబ్లీ తెదేపా ఇంచార్జ్ వి.ఎస్.అమీర్ బాబు, రాష్ట్ర తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శులు రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్ లు సంయుక్తంగా మీడియాతో మాట్లాడుతూ వెంటనే లబ్ధిదారులకు ఫ్లాట్స్ అప్పగించాలని డిమాండ్ చేశారు. ఏడాదైనా నిరుపేదలకు అపార్ట్ మెంట్ ఫ్లాట్లు ఎందుకు అప్పగించడం లేదన్నారు. వడ్డీలకు తీసుకువచ్చి ఇంటి కోసం కడితే ఇళ్లు రాలేదు... బాకీలు పెరుగుతున్నాయి. ఇళ్ల అద్దెలు కట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి.. బాధితుల ఆవేదన చెందుతున్నారన్నారు. ఇళ్ల పట్టాల పంపిణీలో జగన్మోహన్ రెడ్డి గారు ప్రభుత్వం చేస్తోంది గోరంత... జరుగుతోంది కొండంత అవినీతి జరుగుతుందన్నారు. పేదల మాటున పెద్దలు చేస్తున్న దోపిడీ. జగన్మోహన్ రెడ్డి గారు ప్రభుత్వం పాల్పడిన అతిపెద్ద కుంభకోణం. ఏడాది తప్పిదాలను మభ్య పుచ్చే మాయ. మీ మాయలో పడటానికి రాష్ట్ర ప్రజానీకం సిద్ధంగా లేరన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో శాప్ మాజీ సభ్యుడు జయచంద్ర, ఉపాధి హామీ పథకం సభ్యులు పీరయ్య, మాజీ జీ.పీ. గుల్జప్ప, బాలదాసు, జయకుమార్, కొమ్మల పాటి, రాంప్రసాద్, నాసిర్ అలీ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం మండలం ముడిదాం గ్రామంలోని నాయుడు చెరువు వద్ద గతంలో చేసిన అభివృద్ధి పనులను జిల్లా కలక్టరు డా. ఎం. హరి జవహర్ లాల్ పరిశీలించారు.
- వార్తావళి, విజయనగరం

# "ఫస్ట్ డే ఫస్ట్ షో కీ హోమ్ డెలివరీ"




**ముంబై, వార్తావళి, జూన్ 06:** భారతదేశంలో డిస్నీం హాట్‌స్టార్‌విజయవంతమైన తరువాత, డిస్నీం హాట్‌స్టార్ మల్టీప్లెక్స్‌ను ప్రారంభించి లక్షలాది మంది భారతీయులు సినిమాలను వీక్షించే విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చేందుకు శ్రీకారం చుట్టింది. దేశం సాధారణ స్థితికి చేరుకుంటున్న ఈ సమయంలో, భారతదేశంలో భారీ స్థాయిలో వీడియో సేవలను అందించే సంస్థ బాలీవుడ్ బ్లాక్ బస్టర్స్ మరియు భారీ తారల వెలుగు జిలుగుల మాయాజాలాన్ని దేశవ్యాప్తంగా లక్షలాది స్మార్ట్‌ఫోన్ తెరలపైకి నేరుగా తోడ్కొని వస్తోంది. దేశవ్యాప్తంగా సినీ అభిమానులు తమ అభిమాన తారలను చూసేందుకు, నూతన బాలీవుడ్ బ్లాక్ బస్టర్ల విడుదలతో ఆనందాన్ని, భావోద్వేగాలకు తిరిగి పొందేందుకు ఆత్రుతతో వేచి చూస్తున్నారు. డిస్నీం హాట్‌స్టార్ మల్టీప్లెక్స్‌టిని అందించే వాగ్దానం చేస్తుంది! 2020లో విడుదలై, అందరూ అత్యంత ఆసక్తితో వేచి చూస్తున్న 7 సినిమాల ప్రీమియర్లను బాలీవుడ్ అభిమానులు వీక్షించేందుకు జులై 24, 2020 నుంచి అవకాశం అందుబాటులోకి వస్తుండగా, ఇందులో భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన నటులు, అక్షయ్ కుమార్ మరియు కియారా అద్వానీ నటించిన లక్ష్మీ బాంబ్, అజయ్ దేవ్‌గన్, సోనాక్షి సిన్హా మరియు సంజయ్ దత్ల భుజ్: ది ప్రైడ్ ఆఫ్ ఇండియా, దివంగత నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్, సంజన సంఘి మరియు సైఫ్ అలీ ఖాన్‌ల దిల్ బెచారా, సంజయ్ దత్, అలియా భట్, ఆదిత్య రాయ్ కపూర్ మరియు పూజాభట్ నటించిన సడక్ 2, ది బిగ్ బుల్‌లో అభిషేక్ బచ్చన్‌ను మరియు విద్యుత్ జామ్‌వాలాను ఖుదా హాఫీజ్‌లో, కునాల్ కెమ్ముమరియు రసిగా దుగల్‌నటించిన లూట్‌కేస్‌తదితరాలు ఇందులో ఉన్నాయి.

# బ్రిటానియా మారీ గోల్డ్ మై స్టార్ట్ అప్ సీజన్ 2ఫినాలేది




10 మంది గృహిణులు తమ వ్యాపార ప్రయాణాన్ని ప్రారంభించుకునేందుకు తలా రూ.10 లక్షల పెట్టుబడి మూల ధనాన్ని అందుకుంటారు. భారతదేశంలో 3వ అతి పెద్ద బిస్కెట్ బ్రాండ్ మరియు గృహిణులకు 60o ఏళ్లుగా అత్యంత ప్రియమైన బ్రాండ్ బ్రిటానియా మారి గోల్డ్ నేడు పూర్తి స్థాయివర్చువల్ ఫినాలేగా నిర్వహించిన కార్యక్రమంలో తన వార్షిక మహిళా వ్యాపారవేత్తల ఇనీషియేటివ్, బ్రిటానియా మారీ గోల్డ్ మై స్టార్టప్ జాగృతిలో విజేతలుగా నిలిచిన పది మంది విజేతల పేర్లను ప్రకటించింది. వినూత్నమైన ఈ కార్యక్రమంలో భాగంగా, విజేతలుగా నిలిచిన 10 మంది విజేతలను సత్కరించి, వారు కలలు కంటున్న వ్యాపారాన్ని ప్రారంభించుకునేందుకు తలా రూ.10 లక్షల నగదును పురస్కారంగా అందజేశారు. బ్రిటానియా మారీ గోల్డ్ మై స్టార్టప్ అనేది ఔత్సాహిక గృహిణుల్లోని వ్యాపార దక్షతను ప్రోత్సహించి, ఆర్థిక స్వేచ్ఛతోవారు తమ కలలను సాకారం చేసుకునేందుకు, తమను తాము ఉద్యోగ సృష్టికర్తలుగా తీర్చిదిద్దుకునేందుకు రూపొందించిన ఒక ప్రత్యేక వేదిక. ఆర్థిక సహకారంతో పాటు, బ్రిటానియా మేరీ గోల్డ్ మై స్టార్ట్ అప్ తాజా ఎడిషన్ 10,000 మంది గృహిణులకు నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (NSDC) భాగస్వామ్యంతో భారతదేశంలో మొట్ట-మొదటి సారిగా ఆన్‌లైన్‌లో వారి అవసరాలకోసమే ప్రత్యేకంగా రూపొందించిన నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకు వస్తోంది. ఈ ఆన్‌లైన్ కోర్సు గృహిణులు తమ సొంతకాళ్లతో నిలబడి, భవిష్యత్తు వైపు మొదటి అడుగు వేస్తున్నప్పుడు వారికి కావలసిన వ్యాపార దక్షత నైపుణ్యాలను మెరుగుపరచుకునేందుకు కావలసిన ఆత్మ విశ్వాసాన్ని అందిస్తుంది. నైపుణ్య అభివృద్ధి శిక్షణ పొందిన గృహిణుల్లో చాలామంది వ్యాపారవేత్తలుగా రూపుదిద్దుకుంటారని బ్రిటానియా విశ్వసిస్తోంది.

# విద్యార్థులు, విద్యావేత్తల కోసం డిజిటల్ భద్రత

**విశాఖపట్నం, వార్తావళి, జూలై 7:** విద్యార్థులు మరియు విద్యావేత్తలు కోసం డిజిటల్ భద్రత మరియు ఆన్ లైన్ సంక్షేమం మరియు ఆగమెంటెడ్ రియాలిటి (ఏఆర్) పై పాఠ్యాంశాన్ని ప్రారంభించడానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరి ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) మరియు ఫేస్ బుక్ లు భాగస్వామం చెందాయని మానవ వనరుల అభివృద్ధి శాఖ (హెచ్ఆర్ డి) యూనియన్ గౌరవనీయ మంత్రి శ్రీ రమేష్ పొఖ్రియాల్ ఈరోజు ప్రకటించారు. 'ఆగమెంటెడ్ రియాలిటీలో టీచర్లు కోసం, విద్యార్థులు కోసం డిజిటల్ భద్రత మరియు ఆన్ లైన్ సంక్షేమంలో ధృవీకరించబడిన కార్యక్రమాలను పరిచయం చేయడానికి ఫేస్ బుక్ మరియు సీబీఎస్ఈలను నేను అభినందిస్తున్నాను" అని మానవ వనరుల అభివృద్ధి శాఖ (హెచ్ఆర్ డి) యూనియన్ గౌరవనీయ మంత్రి శ్రీ రమేష్ పొఖ్రియాల్ అన్నారు.

విద్యార్థుల ఆన్ లైన్ సంక్షేమాన్ని నిర్ధారించి, భవిష్యత్తు పని కోసం వారిని తయారు చేసే లక్ష్యంతో , సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరి ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) మరియు ఫేస్ బుక్ లు డిజిటల్ భద్రత మరియు ఆన్ లైన్ సంక్షేమం మరియు ఆగమెంటెడ్ రియాలిటి (ఏఆర్) పై సమగ్రమైన పాఠ్యాంశం ప్రారంభిస్తోంది. మాడ్యుల్స్ సెకండరి పాఠశాల విద్యార్థులు కోసం ఉద్దేశ్యించబడ్డాయి. పాఠ్యాంశం ఇప్పుడు సీబీఎస్ఈ వెబ్ సైట్ http://cbseacademic.nic.in/fb/FacebookForEducation.htmlపై లభిస్తోంది. అభ్యసించే వివిధ కమ్యూనిటీను రూపొందించడానికి మరియు ప్రపంచాన్ని ఒక చోటకు చేర్చడానికి ఈ భాగస్వామ్యాన్ని ఒక అంతర్జాతీయ చొరవగా ఫేస్ బుక్ చదువు కోసం నిర్వహిస్తోంది. చాలామంది యువ యూజర్లు ఆన్ లైన్ లోకి వస్తుండటంతో, యువ వయోజనులకి అవగాహన కలిగించడం మరియు విద్యార్థులు ఆన్ లైన్ లో మంచి అవగాహనా ఎంపికలు చేయడం ప్రధానంగా మారింది మరియు సురక్షితంగా ఇంటర్నెట్ ని నేవిగేట్ చేయడానికి అవసరమైన నైపుణ్యాల్ని అభివృద్ధి చేయడానికి కూడా వారికి సహాయపడుతుంది. ఆరోగ్యవంతమైన డిజిటల్ అలవాట్లను రూపొందించడానికి డిజిటల్ భద్రత మరియు ఆన్ లైన్ సంక్షేమం పై పాఠ్యాంశం భద్రత, గోప్యత, మానసిక ఆరోగ్యం మరియు ఇన్ స్టాగ్రామ్ గైడ్ వంటి అంశాల్ని కవర్ చేస్తుంది. విద్యార్థులు బాధ్యతాయుతమైన డిజిటల్ యూజర్లుగా మారడానికి, వేధింపు మరియు బెదిరింపు గుర్తించడానికి మరియు తప్పుడు సమాచారం నివేదించడానికి మాడ్యూల్ రూపొందించబడింది. కనీసం 10,000 మంది విద్యార్థులు శిక్షణలో భాగంగా ఉంటారు. సెంటర్ ఫర్ సోషల్ రీసెర్చ్ (సీఎస్ఆర్) శిక్షణను కేటాయిస్తుంది. ఆరోగ్యవంతమైన డిజిటల్ అలవాట్లను రూపొందించడానికి ఇన్ స్టాగ్రామ్ వారి గైడ్ The Jed Foundation (JED%) (యంగ్ లీడర్స్ ఫర్ యాక్టివ్ సిటిజన్ షిప్)సహకారంతో అభివృద్ధి చేయబడింది. ఇది ఇన్ స్టాగ్రామ్ పై యువత గడిపే సమయం అనుకూలంగా, ప్రేరేపణగా మరియు సమతుల్యంగా ఉండేలా నిర్ధారించే లక్ష్యంతో టీచర్లు, విద్యావేత్తలు మరియు తల్లితండ్రులు కోసం తయారు చేయబడింది. యువత ఆపరేట్ చేసే సామాజిక-ఉద్వేగభరితమైన అంశాల్ని మెరుగ్గా అర్థం చేసుకోవడానికి మరియు ఇన్ స్టాగ్రామ్ ను ఉపయోగించడంలో లేదా వేరే ఇతర సామాజిక మాధ్యమం వ్యవస్థల్లో ఆరోగ్యవంతమైన సంభాషణల్లో నిమగ్నం చేయడం ద్వారా వారికి మద్దతు ఇవ్వడానికి ఇది ఒక గైడ్ వలే పని చేస్తుంది.ఇంకా, సహకారంలో భాగంగా, ఫేస్ బుక్ తన మొట్ట మొదటి చొరవలో ఏఆర్ ను ఒక పాఠ్యాంశంగా ప్రవేశపెట్టడానికి సీబీఎస్ఈకి మద్దతు తెలిపింది. మొదటి దశలో భాగంగా 10,000 మంది టీచర్లు, రెండవ దశలో 30,000 మంది టీచర్లు శిక్షణ పొందుతారు. మూడు వారాల శిక్షణ బ్యాచెస్ వారీగా నిర్వహించబడుతుంది. ఇది ఏఆర్ ప్రాథమికాంశాల్ని మరియు ఫేస్ బుక్ సాఫ్ట్ వేర్ ను ఉపయోగించే విధానాల్ని కవర్ చేస్తుంది, ఆగమెంటెడ్ రియాలిటి అనుభవాల్ని తయారు చేయడానికి ఏఆర్ స్టూడియోని ప్రోత్సహిస్తుంది. అభ్యాసకులు ఊహించడానికి, తమ సొంత ఏఆర్ అనుభవాల్ని తయారు చేసి మరియు బ్రాండ్ చేయడానికి ఒక అవకాశం మరియు వ్యవస్థను ఇవ్వడమే లక్ష్యం. ఆచరణలో అభ్యాసన అనుభవం కలిగిన ఏఆర్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో కేరీర్ కోసం విద్యార్థుల్ని తయారు చేయడంలో సహాయం చేస్తుంది. మొదటి దశలో భాగంగా శిక్షణను విజయవంతంగా పూర్తి చేసే టీచర్లు రెండవ దశలో 30,000 మంది విద్యార్థులకు శిక్షణనిస్తారు. ఎస్ వీ. కో డిజిటల్ లెర్నింగ్ ప్లాట్ ఫాం ప్రైవేట్ లిమిటెడ్ అమలుచేసే భాగస్వామిగా బాధ్యతను చేపట్టింది. పాఠ్యాంశం ప్రకటిస్తూ సీబీఎస్ఈ ఛైర్ పర్సన్ మనోజ్ ఆహూజా అన్నారు, "ఫేస్ బుక్ తో మా భాగస్వామ్యాన్ని ప్రకటించడానికి సీబీఎస్ఈ తరపున, నేను ఆనందిస్తున్నాను. సీబీఎస్ఈ తరపున ఫేస్ బుక్ తో మా భాగస్వామ్యాన్ని ప్రకటించడానికి నేను సంతోషిస్తున్నాను. యువత మరియు ఆగమెంటెడ్ రియాలిటి కోసం డిజిటల్ భద్రత మరియు ఆన్ లైన్ సంక్షేమం, ఇన్ స్టాగ్రామ్ టూల్ కిట్ మాడ్యూల్స్ ప్రవేశపెట్టిన ఏకైక బోర్డ్ సీబీఎస్ఈ మాత్రమేనని తెలియచేయడానికి నేను గర్విస్తున్నాను. పాఠశాల పాఠ్యాంసంలో సాంకేతికత మరియు డిజిటల్ భద్రత చేర్చడం డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో విద్యార్థులు విజయాన్ని సాధించడానికి కావల్సిన విజ్ఞానాన్ని సంపాదించడంలో మాత్రమే కాకుండా మరియు ఒక సురక్షితమైన ఆన్ లైన్ వాతావరణంలో అభ్యాసన చేయడానికి మరియు సహకరించడాన్ని నిర్ధారిస్తుంది." భారతదేశం, దక్షిణ మరియు మధ్య ఆసియా పబ్లిక్ పాలసీ డైరక్టర్ అంఖి దాస్ ఇలా అన్నారు, " ప్రస్తుతమున్న అంతర్జాతీయ మహమ్మారి మన జీవితాలు పై ఎంతో ప్రభావంతో దేశం చూసిన అత్యంత తీవ్రమైన ఆరోగ్య మరియు మానవాళి సంక్షోభం. సంప్రదాయబద్ధమైన బోధనా పద్ధతులకు ఇది కలిగించిన అంతరాయం వర్చ్యువల్ విధానంలో నేర్చుకోవడానికి మారవలసిన అవసరాన్ని మేము గుర్తించాము. భారతదేశంలో విద్యా కార్యక్రమానికి మా ఫేస్ బుక్ ద్వారా, సురక్షితమైన ఆన్ లైన్ అనుభవాలు పోషించడం పై పాఠాలు ప్రారంభించడానికి, ఆన్ లైన్ సంక్షేమాన్ని పరిష్కరించడం మరియు ప్రస్తుత వాతావరణంలో నేర్చుకోవడం మరియు మళ్లీ అభివృద్ధి మార్గం వైపు రావడానికి తల్లితండ్రులు, విద్యావేత్తలు మరియు విద్యార్థులకు సులభమైన టూల్ కిట్ కేటాయించడం ద్వారా దేశంలో విద్యా సంస్థలకి మద్దతు చేయాలని మేము కోరుకుంటున్నాము. దీనితో పాటు, ఏఆర్ పాఠ్యాంశం తమ పాఠ్యాంశంలో భాగంగా మొదటిసారి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతని అన్వేషించడానికి యువ అభ్యాసకులకు ఒక అవకాశం ఇస్తోంది. మేము సీబీఎస్ఈతో భాగస్వామం చెందడానికి ఉద్వేగం చెందాము మరియు దేశంలో ఈ సహకారం మరింతమంది టీచర్లు విద్యార్థులకు మద్దతు ఇవ్వడానికి వృద్ధి చెందుతుందని ఆశిస్తున్నాము."

# తిరుపతి, గుంటూరు, కడప, కర్నూలు, నెల్లూరు వార్తలు

## టిటిడి ఉద్యోగులకు ముమ్మరంగా కరోనా టెస్ట్‌లు

**తిరుమల, వార్తావళి, జూలై 7 :** తిరుమలలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ కరోనా టెస్ట్ లు చేయాలని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఆదేశం ఉద్యోగులకు కరోనా టెస్టులు నిర్వహించడానికి ట్రూనాట్ కిట్ లు కొనుగోలు చేయాలని ఆదేశించిన ఈఓ తిరుమల ఉద్యోగుల క్యాంటీన్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఆహారం అందించాలని ఆదేశించిన ఈవో తిరుమలలో డ్యూటీలు చేస్తూ బ్యారక్ లో ఉంటున్న సెక్యూరిటీ సిబ్బందికి కొందరికి కరోనా పాజిటివ్ ఉద్యోగులందరికీ ప్రత్యేకంగా గదులు కేటాయించాలని ఈఓ ఆదేశం శ్రీవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఇప్పటి వరకూ ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఎదురు కాలేదు భక్తులతో ఫోన్ ద్వారా ఆరోగ్యం గురించి వివరాలు సేకరిస్తున్నాం ఈఓ అనిల్ కుమార్ సింఘాల్ టీటీడీ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ పై టిటిడి చైర్మన్ వై వి సుబ్బారెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష ఉద్యోగుల ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించిన టీటీడీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి.



చిత్తూరు మంగళవారం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్లు,ఎస్పీలతో ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి గారు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక జిల్లా సచివాలయం నుండి పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా. నారాయణ భరత్ గుప్తా,ఎస్పీ సెంథిల్ కుమార్, జాయింట్ కలెక్టర్లు డి.మార్కండేయులు, వీరబ్రహ్మం, ఎఎస్పీ రిశాంత్ రెడ్డి మరియు జిల్లా అధికారులు.

– వార్తావాళి, చిత్తూరు

# ఆగస్ట్ 15న ఇళ్ల స్థలాలు పంపిణీ

**చిత్తూరు, వార్తావళి, జూలై 7 :**రాష్ట్రంలోని దాదాపు 30 లక్షల మంది పేదలకు ఆగస్ట్ 15 వ తేది స్వాతంత్ర దినోత్సవం రోజున ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలనుకుంటున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా సచివాలయంలో అమరావతి నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి హౌస్ సైట్స్, ఇసుక, కోవిడ్-19, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పై వివిధ జిల్లాల జిల్లా కలెక్టర్లు, ఎస్.పి.లు, జిల్లా జాయింట్ కలెక్టర్లు, డి.ఎం అండ్ హెచ్ ఓ లు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల ఈ నెల 8 న జరగాల్సిన ఇండ్ల స్థలాల కార్యక్రమం ఆగస్ట్ 15 న పంపిణీ చేయాలనుకుంటున్నామని తెలిపారు. పేద వారికి రిజిస్ట్రేషన్ చేసి ఇంటి పట్టాలు వారి చేతికి ఇస్తే వారికి ఆస్తి ఇచ్చినట్లు అవుతుందన్నారు. ఇండ్ల స్థలాల పంపిణీ వాయిధా పడడంతో ఈ కార్యక్రమం మరింత మెరుగ్గా చేయడానికి అవకాశం ఏర్పడిందన్నారు. జిల్లాలలో ఇంటి స్థలాల పంపిణీ కారణంగా జిల్లా కలెక్టర్ల పేర్లు చిర స్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. ఇళ్ల స్థలాల పంపిణీ కోసం దాదాపు 62 వేల ఎకరాలు పంపిణీ చేస్తున్నామన్నారు. 20 వేల కోట్ల రూపాయలు 30 లక్షల కుటుంబాల చేతుల్లో ఆస్తుల రూపంలో పెడుతున్నామని చెప్పారు. ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమం అనేది రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే ఒక గొప్ప కార్యక్రమం అన్నారు. లే ఔట్లలో చెట్లను నాటించే కార్యక్రమం చేపట్టాలన్నారు. ఇంటి స్థలాల పట్టా డాక్యుమెంట్ ట్లో ఫోటోలు పెట్టడడం, ప్లాట్ నెంబర్, హద్దులు పేర్కొనడం చేయాలన్నారు. అర్హత ఉండి ఎవరికైనా ఇంటి స్థలం రాకుండా ఉంటే వారు ధరఖాస్తు చేసుకున్న 90 రోజుల లోపే కొత్త స్థలం కొని ఇంటి స్థలం ఇచ్చే కార్యక్రమం చేస్తామన్నారు. వర్షాలు పడుతున్నందు వల్ల అవసరమైన ఇసుక స్టాక్ ను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలైన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, నాడు-నేడు పనులు తదితర ప్రభుత్వ పనులకు ఇసుక కొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. నాణ్యత గల ఇసుకను సరఫరా చేయాలన్నారు. అడిగిన వారందరికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను కల్పించాలన్నారు. గ్రామ సచివాలయాలు అన్ని కూడా ఆగస్ట్ 31 వ తేది లోగా పూర్తి కావాలన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలకు సంబంధించి సైట్ లను గుర్తించాలని తెలిపారు. అంగన్ వాడి కేంద్రాలకు సొంత బిల్డింగ్ లు, స్థలాలు లేని వాటికి స్థల సేకరణ చేపట్టాలన్నారు. కోవిడ్ -19 లో భాగంగా 10 లక్షలకు పై గా టెస్ట్ లను చేయగలిగామని ఈ కార్యక్రమం అందరి భాగసౌమ్యంతో జరగడం జరిగిందని, ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్లను, వైద్యాధికారులను అభినందిస్తున్నామన్నారు. హెూమ్ ఐసోలేషన్ అన్నది చాలా ముఖ్యమైనదని తెలిపారు. హెూమ్ ఐసోలేషన్ కు రెఫర్ చేసిన వారిని భాగా చూసుకుంటున్నారా, వారికి మందులు సరిగ్గా అందుతున్నాయా లేదా అనేది పరిశీలిస్తూ%శీ%డాలన్నారు. జిల్లా స్థాయిలో ఉన్న కోవిడ్ కంట్రోల్ రూమ్ భాగా పనిచేయాలని తెలిపారు. అలాగే హెూమ్ ఐసోలేషన్ పైన జిల్లా కలెక్టర్లు దృష్టి పెట్టాలని తెలిపారు. కోవిడ్ కేర్ సెంటర్ లలో నాణ్యమైన సేవలైన ఆహారం, బాత్ రూమ్ సౌకర్యం, బెడ్ ల సౌకర్యం, వైద్యుల పర్యవేక్షణ, తదితర అంశాల పై దృష్టి కేంద్రీకరించాలన్నారు. రాష్ట్ర స్థాయి కోవిడ్ ఆసుపత్రులు అలాగే జిల్లాల్లోని కోవిడ్ ఆసుపత్రులలో క్వాలిటీ పైన దృష్టి పెట్టాలన్నారు. కోవిడ్ పై ప్రజల్లో భయాందోళనలు తొలగిపోయేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ నారాయణ భరత్ గుప్త, ఎస్.పి శెందిల్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ మార్కండేయులు, జాయింట్ కలెక్టర్ (అభివృద్ధి) వీరబ్రహ్మం, డి.ఆర్.ఓ రాజశేఖర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారి డాక్టర్ పెంచలయ్య, డి.సి.హెచ్.ఎస్.డాక్టర్ సరళమ్మ, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





ప్రభుత్వ ఆదేశాల మేరకు 2020- 21 ఆర్థిక సంవత్సరమునకు గాను చెల్లించవలసిన ఇంటి పన్నులు జూలై 31వ తేదీ వరకు 5% రిబెట్ పొడిగించి యున్నరు. కనుక శ్రీకాళహస్తి పట్టణ ప్రజలు ఈ యొక్క సదావకాశం వినియోగించుకుని 2020- 21 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించిన ఇంటి పన్నులు మరియు కొళాయి పన్నులు ఏక మొత్తంలో చెల్లించి పై అవకాశం సద్వినియోగం చేసుకోవలసినదిగా కోరడమైనది. ఇందుకుగాను పురపాలక సంఘ కార్యాలయంలో ఆన్లైన్లో కౌంటర్లో చెల్లించి తగు రసీదు పొందవలసిందిగా కోరడమైనది. మీ వార్డు సమీప సచివాలయంలో కూడా డిడి.లు మరియు చెక్కుల రూపంలో కూడా ఇవ్వవచ్చును. కావున పట్టణ ప్రజలు అందరు సహకరించి సకాలంలో పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడ వలసినదిగా తెలియజేయడమైనది.

– వార్తావళి, శ్రీకాళహస్తి

## జనసేన యువ నాయకత్వాన్ని బలోపేతం చేయడమే లక్ష్యం

### స్థానిక ఎంపిడిఓతో జనసేన మండల నాయకులు

**నెల్లూరు, వార్తావళి, జూలై 7 :** నీటి ట్యాంకు నిర్మించి 20 సంవత్సరాలు అయినది. ప్రస్తుతం తుప్పు పట్టి శిధిలావస్థలో ఉన్నది. కొత్త ట్యాంకు నిర్మాణం జరగాలి. అంతవరకు తాత్కాలికంగా రిపేరు చేయాలి. గ్రామంలో నిరుపేదలలో నిరుపేదలు ఉన్నారు. వారికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి. లేదా లెంటిల్ వరకు నిర్మాణం జరిగింది. మోల్డ్ బిల్ ఎవరు తీసుకున్నారో భగవంతునికి ఎరుక !సింగల్ ఫేస్ విధ్యుత్ లైను ఒక ఇంటి ప్రక్కనే ఉన్నది. ఇది అనువైన స్థలం కాదు. వర్షం పడితే చిన్న పిల్లలు ఉన్నారు. చాలా ప్రమాదం. విధ్యుత్ లైను చాలా క్రిందకు వేలాడుతూ ఉన్నది. ఇది కూడా ప్రమాదకరమే. ఒక వీధిలో ఇంకొక పోల్ నాటవలసి ఉన్నది. ప్రక్కన ఉన్న ఇళ్లకు కరెంటు సౌకర్యం లేదు. మానసిక వైకల్యం కలిగిన వారు 2 ఉన్నారు. వారికీ మానవతా దృక్పధంతో డాక్టర్ లే గ్రామానికి వచ్చి సదరం సర్టిఫికెట్ మంజూరుచేయాలి. వారికీ వెంటనే ఇవ్వాలి. వీరి పరిస్థితి అతి దారుణంగా దయనీయంగా ఉన్నది. నిరుపేదలు కొంతమంది ఇల్లు నిర్మించు కున్నారు. కాని పూత వేయించుకోలేని కడుదీన స్థితిలో ఉన్నారు. మురుగునీరు సౌకర్యం లేక ఎక్కడి కక్కడ నీరు నిల్వ వలన, చిన్నపిల్లలు మరియు పెద్దలు అనారోగ్యం కలిగే పరిస్థితి ఉన్నది. పేద రైతులకు పట్టాదారు పాస్ పుస్తకం (అనువంశికం ) ఇవ్వాలి. ప్రస్తుతం కాలయాపన చేస్తున్నారు. చేతి బోరును రిపేరు చేసి తాగు నీరు అందించాలి. గ్రామంలో తాగు నీరు లేక గత ఐదు రోజులుగా ఇబ్బంది పడుతున్న ప్రజలు. తాత్కాలికంగా అందిస్తున్న ట్యాంకు (ట్రాక్టర్ ద్వారా) నీరు సరిపోక నానా వస్తపడుతున్న నిరుపేదలు. నిరుపేదలకు కోసం కేటాయించిన ఇళ్ల స్థలాలను నిరుపేదలకే ఇవ్వాలి. కాని పేదల ఇళ్లలో పెద్దల నివాసంగా మారే ప్రమాదం ఉన్నది. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామ ప్రజలకు పనులు కల్పించాలి. ఈ కార్యక్రమానికి సహకరించిన జనసైనికులు గుణ, సాగి అబిలాష్, వర్మ, శ్రీ రామ్ వర్మ, మురళి, రాము, మునిరాజ్, గౌతమ్, శంకర్, తిరుమల, ధర్మ పాల్గొన్నారు.




## సృష్టిలోని సకల జీవరాశులు ఆయురారోగ్యాలతో ఉండాలి

### టిటిడి అదనపు ఈవో ఎవి.ధర్మారెడ్డి



**తిరుమల, వార్తావళి, జూలై 7 :** సృష్టిలోని సకల జీవరాశులు ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థిస్తూ సుందరకాండ ప్రథమ సర్గ సంపూర్ణంగా 211 శ్లోకాలతో అఖండ పారాయణం నిర్వహించినట్లు టిటిడి అదనపు ఈవో శ్రీ ఎవి.ధర్మారెడ్డి ఉద్ఘాటించారు. తిరుమలలోని నాదనీరాజనం వేదికపై మంగళవారం ఉదయం జరిగిన సుందరకాండ ప్రథమ సర్గ అఖండ పారాయణంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కరోనా వైరస్ వ్యాప్తి చెందినప్పటి నుండి తిరుమలలోని నాద నీరాజనం వేదికపై "యోగవాశిష్ఠం – శ్రీ ధన్వంతరి మహామంత్రం" ను 62 రోజుల పాటు పారాయణం చేసినట్లు తెలిపారు. ప్రపంచాన్ని కరోనా నుండి రక్షించేందుకు ప్రముఖ పండితుల సూచనల మేరకు జూన్ 11వ తేదీ నుండి సుందరకాండ పారాయణం ప్రారంభించామన్నారు.

## పోలీసులమంటూ ప్రేమజంటపై దౌర్జన్యం



**అనంతపురం, వార్తావళి, జూలై 7 :** బుక్కరాయసముద్రంలో మంగళవారం దారుణం చోటు చేసుకుంది. పోలీసులమంటూ ఇద్దరు వ్యక్తులు ఓ ప్రేమికుల జంటపై బెదిరింపులకు పాల్పడుతూ అమానుషంగా ప్రవర్తించారు. వివరాల్లోకి వెళితే.. కానిస్టేబుల్ సురేంద్ర, తన స్నేహితుడు రాజశేఖర్‌తో కలిసి ఓ ప్రేమజంటను బెదిరించారు. అంతటితో ఆగకుండా ప్రియుడు నవీన్‌పై దాడి చేసి యువతిని అపహరించారు. దీంతో ప్రియుడు నవీన్ డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. మరోవైపు కానిస్టేబుల్ చెర నుంచి బయటపడ్డ బాధితురాలు తనను సురేంద్ర అత్యాచారం చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనకు పాల్పడ్డ నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపడుతున్నారు.

## ఉధృతమైన ఉదయగిరి జిల్లా ఉద్యమం





**నెల్లూరు, వార్తావళి, జూలై 7 :** కరువు పీడిత ప్రాంతమైన ఉదయగిరికి ప్రత్యేక జిల్లా హెూదా ఇవ్వాలంటూ తలపెట్టిన ఉద్యమం ఉగ్రరూపం దాలుస్తోంది.. జిల్లా ఉద్యమానికి రాజకీయ నాయకులు మద్దతు పలక పోతే పుట్టగతులు ఉండవు అంటూ.... మీరు ఓట్ల కోసమా? లేక ప్రజల అభివృద్ధి కోసమా? తేల్చుకోవాల్సింది మీరే అంటూ జన విజ్ఞాన వేదిక, ఉదయగిరి జిల్లా సాధన సమితి ఐక్యవేదిక హితవు పలికింది. మంగళవారం కరువు పీడిత ప్రాంత ఉదయగిరి జిల్లా సాధన సమితి ఐక్యవేదిక ఉదయగిరి లోని ప్రెస్ క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వానికి నూతన జిల్లాలు ఏర్పాటు చేయాలన్న ఆలోచన కలిగినప్పటికీ ఈ ప్రాంత అధికార ఈ వర్గంలో ఉన్న నాయకులు కానీ ప్రతిపక్షంలో ఉన్న నాయకులు కానీ స్పందించకపోవడం విచిత్రంగా ఉందని జన విజ్ఞాన వేదిక నాయకులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సిగ్గు శరం ఉంటే రాజకీయాలకు అతీతంగా ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడాలని బాధ్యత ఉందంటూ వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు సుభిక్షంగా ఉంటేనే రాజకీయ పార్టీలు వర్ధిల్లుతాయని ఈ ప్రాంతానికి ఏదో ఒకటి చేస్తే తప్ప రాజకీయం దేనికని వారు సూటిగా ప్రశ్నించారు. ఇప్పటివరకు తలపెట్టిన గ్రామస్థాయి మీటింగులు, పోస్టుకార్డు ఉద్యమాలు ఒక ఎత్తు అయితే ఇప్పుడు జరగబోయే ఎటువంటి ఆందోళన కార్యక్రమాలు మరొక ఎత్తు అవుతాయని సుదీర్ఘ రాజకీయ భవిష్యత్తు కావాలనుకునే ఒక్కరైనా ప్రజల తరఫున పోరాటం చేయవలసిన అవసరం ఉందని వారన్నారు. తరతరాలుగా వివక్షకు ఎదుర్కొన్న ఈ ప్రాంతానికి కనీసం ప్రత్యేక జిల్లా హెూదా ఇస్తే అభివృద్ధి జరుగుతుందన్న నమ్మకంతో ఉద్యమం ప్రారంభమైందని, ఈ ప్రాంత రాజకీయ నాయకులు తమ చిత్తశుద్ధి చాటుకుని ప్రజల విశ్వాసాన్ని చూడగానే సమయం ఆసన్నమైందని వారు అన్నారు. ప్రజల సంక్షేమం కోసం స్వచ్ఛందంగా ఒక్క రూపాయి ఫలితం ఆశించకుండా ప్రజల శ్రేయస్సే ప్రాంతీయ శ్రేయస్సుని భావించి 35 సంవత్సరాలుగా ఉద్యమం నడుపుతున్న జనవిజ్ఞాన వేదిక ప్రయత్నం నేడు ప్రత్యేక జిల్లా సాధన కోసం నడుంబిగించింది అని ఇప్పుడైనా రాజకీయ పార్టీలు స్పందించకపోతే చరిత్రహీనులు అవడం ఖాయమని వారు అన్నారు. నియోజకవర్గంతో పాటు పురుగు జిల్లాలో ఉన్న కరువు పీడిత ప్రాంతాల్లో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయబోతున్నామని, అన్ని రాజకీయ పార్టీలతో యువతతో కలిసి అఖిలపక్ష కమిటీ ఏర్పాటు చేస్తున్నామని, ప్రత్యేక జిల్లా వచ్చేవరకు నిద్రపోయే ప్రసక్తే లేదని, తప్పకుండా ఈ ప్రాంత అధికార పార్టీ పాలకవర్గాలు కలిసి వస్తాను నమ్మకం తమకుందని వారు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డాక్టర్. వేణుగోపాల్, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు షేక్ దస్తగిరి అహ్మద్, షేక్ గాజుల ఫారుక్ అలీ, షేక్ గౌస్ బాషా, ప్రజా ఉద్యమ నాయకులు బసిరెడ్డి మాలకొండారెడ్డి, గాజులపల్లి. రామిరెడ్డి సీనియర్ జర్నలిస్టు అయిన పెనుబర్తి. మల్లికార్జున. బాలినేని. పెద్దమామయ్య,, ఓంకారం శ్రీనివాసరాజు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆవుల రవి యాదవ్, రైతు సంఘం నాయకులు బసిరెడ్డి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి ఆలయం వద్ద ట్రై ఓజోన్ స్ప్రేయింగ్ సిస్టమ్ ఏర్పాటు



**తిరుమల, వార్తావళి, జూలై 7 :**టిటిడి కరోనా వైరస్ వ్యాప్తి నివారణ చర్యలలో భాగంగా తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు వ్యాధి కారక క్రిముల నుండి ఎలాంటి హాని కలుగకుండా నిర్మూలించేందుకు ట్రై ఓజోన్ స్ప్రేయింగ్ సిస్టమ్‌ను మంగళవారం ఉదయం స్వామివారి ఆలయంలోనికి ప్రవేశించే రెండు మార్గాలలో ఏర్పాటు చేశారు. శ్రీవారి ఆలయ మహాద్వారం ముందు భక్తులు ప్రవేశించే స్కానింగ్ సెంటర్ వద్ద, విధి నిర్వహణలో ఉన్న అర్చకులు, ఉద్యోగులు ప్రవేశించే బయో మెట్రిక్ వద్ద ట్రై ఓజోన్ పొగమంచు రూపంలో స్ప్రేయింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. ఇందులోని హైడ్రాక్సిల్ ఫ్రి ర్యాడికల్ ఐయాన్ స్ప్రేయింగ్ చేయడం వలన వ్యాధికారక సూక్ష్మక్రిములు నశిస్తాయి. తద్వారా భక్తులు, ఉద్యోగులు, అర్చకులు ఆనారోగ్య కారక క్రిముల నుండి ఉపశమనం పొందవచ్చు. టిటిడి ఇప్పటికే కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు విస్తృత చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా దర్శనానికి విచ్చేసే భక్తులు మాస్కులు తప్పనిసరిగా ధరించాలని, చేతులు శుభ్రం చేసుకుని, భౌతిక దూరం పాటిస్తూ నిర్ణీత సంఖ్యలో శ్రీవారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేసింది. అలిపిరి వద్ద భక్తులకు, ఉద్యోగస్తులకు థర్మల్ స్కానింగ్, కరోనా పరీక్షలకు శాంపుల్స్ తీసుకుంటున్నారు. టిటిడి ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో నిర్ణీత సమయంలో క్యూలైన్లు, ఆలయంలోని అన్ని ఉపరితలాల్లో సేంద్రీయ సూక్ష్మ క్రిమి నిర్మూలన కారకాలతో నిరంతరం శుభ్రం చేస్తున్నారు. అదేవిధంగా తిరుమలలోని ప్రధాన కూడళ్లలో, రద్దీ ప్రాంతాలలో, వసతి సముదాయాలు, విశ్రాంతి భవనాలు, కల్యాణకట్ట, అన్న ప్రసాద భవనం వద్ద ఎప్పటికప్పుడు శానిటైజ్ చేస్తున్నారు.

## గుట్టుచప్పుడు కాకుండా తప్పించారు



**అనంతపురం, వార్తావళి, జూలై 7 :**జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కొందరు పోలీసులు అక్రమార్కులకు అండగా నిలిస్తున్నారు. తప్పు సొంతవారు చేస్తే వదిలేయడం..సామాన్యులు చేస్తే రూల్స్ మాట్లాడడం పరిపాటిగా మారింది. ఇటీవల వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో పేకాట నిర్వహిస్తూ పట్టుబడిన ఓ కానిస్టేబుల్‌కు వన్‌టౌన్ పోలీసులు అండగా నిలిచారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎస్పీ సత్యయేసు బాబు దీనిపై విచారణ చేపడితే అసలు బాగోతం వెలుగు చూస్తుందని పోలీసు వర్గాలు అంటున్నాయి. గత నెలలో వన్‌టౌన్ పరిధిలోని లెనిన్‌నగర్‌లో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం వచ్చింది. ఓ ఎస్‌ఐ నేతృత్వంలో పేకాట నిర్వహిస్తున్న ఇంటిని పోలీసులు తనిఖీ చేశారు. అందులో ఆరుగురు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. పేకాట నిర్వహిస్తున్న వ్యక్తి ఓ కానిస్టేబుల్ అని తెలిసింది. దీంతో పోలీసులు అవాక్కయ్యారు. గుట్టుచప్పుడు కాకుండా కానిస్టేబుల్‌ను తప్పించేశారు. కేవలం ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.55 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఓ ఎస్‌ఐ అండదండలతోనే కానిస్టేబుల్‌ను తప్పించినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో భారీగానే చేతులు మారాయన్న ఆరోపణలు ఉన్నాయి.

# ఇది దురుద్దేశ చర్య: టీటీడీ



**తిరుమల, వార్తావళి, జూలై 7 :** తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ)పై రోజురోజుకీ కుట్రలు పెరిగిపోతున్నాయి. అడుగడుగునా అన్యమత ముద్ర వేసేందుకు కొన్ని వర్గాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. గతంలో అనేక సార్లు తిరుమల శ్రీవారు, ఆలయంపై అవాస్తవ సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేయగా.. వాటిని ఖండించిన టీటీడీ అసత్య కథనాలపై ఫిర్యాదు చేసింది. ఇక తాజాగా మరోసారి తమకు సంబంధం లేకున్నా టీటీడీ మరోసారి వార్తల్లో నిలిచింది. గుంటూరుకు చెందిన ఒక పాఠకుడికి టీటీడీ మాస పత్రిక సప్తగిరితో పాటు అన్యమతానికి చెందిన మరో పుస్తకం రావడం కలకలం రేపింది. దీంతో వెంటనే అప్రమత్తమైన టీటీడీ.. ఇది దురుద్దేశ చర్య అంటూ తీవ్రంగా ఖండించింది. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. విచారణ చేపట్టారు. కాగా సప్తగిరి మాస పత్రిక ప్యాకింగ్, డెలివరీ భాధ్యత మొత్తం పోస్టల్ శాఖవారే చూస్తారన్న విషయం తెలిసిందే. పోస్టల్ శాఖకు పోస్టేజి చార్జీలతో పాటు ఒక్కో ప్రతికి అదనంగా రూ. 1.05 టీటీడీ అదనంగా చెల్లిస్తోంది. ఇక గతంలో టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యత్వానికి సుధా నారాయణమూర్తి రాజీనామా చేశారని ఫేస్‌బుక్‌లో అసత్య ప్రచారం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అదే విధంగా.. తిరుమలలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, భక్తులు తిరుమలకు వెళ్లకూడదని తమిళ నటుడు శివకుమార్ ప్రచారం చేశారని తమిళ్‌మయ్యాన్ అనే వ్యక్తి ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయగా అతనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# అనకాపల్లి వార్తలు

## నాటుసారాతో పట్టుబడితే జరిమానతోపాటు కట కటాల వెనక్కే

### ఎస్సై పి. రామారావు

**మాడుగుల, వార్తావళి, జూలై 7 :** నాటుసారా తయారు చేసినా, అమ్మకాలు చేపట్టిన వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని, ఇకపై అలా దొరికితే భారీ జరిమానతో పాటు కేసులు నమోదు చేసి కట కటాల వెనక్కి పంపించాల్సిన పరిస్థితి తప్పదని, నూతనంగా వెలువడిన చట్టాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవడానికి సిద్దంగా ఉన్నామని మాడుగుల ఎస్సై పి.రామారావు అన్నారు. మంగళవారం స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ మాడుగుల మండలంలోని పోతనపూడి అగ్రహారంలో ఇద్దరు వ్యక్తుల నుండి 25 లీటర్ల నాటుసారా వీరవిల్లి అగ్రహారం వీరనారాయణంలో ఒక వ్యక్తి నుండి 5 లీటర్లు నాటుసారాతో ముగ్గురు వ్యక్తులను పట్టుకుని న్యాయమూర్తి ముందు హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించారన్నారు. ఇకపై నాటుసారాతో మొదటిసారి పట్టుబడితే ఎనిమిదేళ్ల జైలు శిక్షతో పాటు 2లక్షలు 50 వేలు జరిమానా, రెండవ సారి పట్టుబడితే 10 ఏళ్లు జైలు శిక్షతో పాటు 5 లక్షలు జరిమానా విధించే విధంగా కొత్త చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ప్రభుత్వం నాటుసారా నిర్మూలనలో భాగంగా పలు చర్యలు చేపడుతుందని ఇప్పటికైనా నాటుసారా తయారీదార్లు, అమ్మకందార్లు సారా జోలికి పోకుండా ఉండాలని హెచ్చరించారు.

## సచివాలయం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు

### గ్రామాభివృద్ధి పంచాయతీ కార్యదర్శి కె.యశ్వంత్

**మాడుగుల, చోడవరం, వార్తావళి, జూలై 7 :** రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు సచివాలయం వ్యవస్థ మరియు వాలంటీర్లు వ్యవస్థ ఉద్యోగులుమరియు అధికారులందరూ సమన్వయంతో కలిసి పని చేసి ప్రజా సమస్యలు నేరుగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చోడవరం మండలం గజపతినగరం గ్రామ పంచాయతీ సెక్రెటరీ కె.యశ్వంత్ పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వాలంటీర్లకు మరియు సచివాలయ ఉద్యోగులకు వారానికొకసారి శిక్షణా తరగతులు ఇస్తున్నామని పథకాలపై పూర్తి అవగాహన కల్పిస్తున్నామని సెక్రటరీ కె. యశ్వంత్ తెలిపారు. ఎప్పటికప్పుడు వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి సమాచారం తెలుసుకుందామని అర్హులైన వారిని గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని గ్రామాభివఅద్ధికి వాలంటీర్లు సచివాలయ ఉద్యోగుల పాత్ర ఎంతో ఉందని వీరు ఎంతో సహకరిస్తున్నారని రాజకీయాలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందరికీ అందేలా చర్యలు తీసుకుంటామని గ్రామ సెక్రెటరీ కె.యశ్వంత్ తెలిపారు.

## మందపాటి జానకిరామరాజు (జాని) జన్మదిన వేడుకలు



**అనకాపల్లి, వార్తావళి, జూలై 7 :** వైఎస్సార్సీపీ పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు జన్మదిన వేడుకలు స్థానిక రింగు రోడ్‌లో శాసనసభ్యులు గుడివాడ అమర్నాథ్ క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగాయి పేదవారికి చీరలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు గొర్లి సూరి బాబు, కొణతాల మురళీకృష్ణ, పొలమరసెట్టి మురళి, డాక్టర్ రామ్మూర్తి, జాజుల రమేష్, డాక్టర్ య శ్వంత్, పలక రాము, బొడ్డేడ శివ, విల్లూరి శివ సూరి, పి.డి గాంధీ, కొణతాల భాస్కర్, మాజీ చైర్మన్ సకలా గోవింద్, మాజి కౌన్సిలర్ నడిశెట్టి మదన్ మోహన్, ఆళ్ళ నాగేశ్వరరావు, వెంపరాల శర్మ, మాజి కౌన్సిలర్ పెతకం శెట్టి జగన్ మోహ న్ రావు, యల్లపు చంద్ర మోహన్, పలకా రవి, పాండురంగ సత్యారావు, వేగి త్రినాథ్, గైపురీ రాజు, సమ్మంగి కనకారావు, చవితిని కాంతం, కె. ఎమ్.నాయుడు, కుండల రామకృష్ణ, మైలపల్లి నాగేశ్వరరావు, అప్పికొండ వెంకట్రావు, కోన ఉమా, బోండా శంకర్రావు, కొణతాల ప్రసాద్, కోరుకొండ రాఘవ, డొంక సత్య, రాయవరపు జోగి రాజు, ఉగ్గిన అప్పారావు, మళ్ళ రామచంద్ర రావు, కాండ్రేగుల శ్రీరామ్, శోభ, అనురాధ, దాడి ఈశ్వరరావు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నాన్ షెడ్యూల్డ్ ఏరియా గిరిజన సమస్యలు పరిష్కరించాలి

### లీగల్ అసిస్టెంట్ శ్రీను, కిముడు కృష్ణ



**మాడుగుల, వార్తావళి, జూలై 7 :** నాన్ షెడ్యూల్డ్ ఏరియా గిరిజన సమస్యలు పరిస్కారం అయ్యే వరకు తమ పోరాటం ఆపేది లేదని, నిరంతర పోరటం చేసి అయినా సమస్య పరిష్కరించుకుంటామని ఆదివాసి సంఘం మాడుగుల మండల సంఘం కార్యదర్శి, లీగల్ అసిస్టెంట్ శ్రీను, కిముడు కృష్ణలు అన్నారు. నాన్ షెడ్యూల్డ్ ఏరియా గిరిజన సమస్యల పరిష్కరించే విధంగా ప్రభుత్వానికి రిపోర్టు సిఫార్స్ చెయ్యాలని కోరుతూ ఏపి ఆదివాసి హక్కుల సాధన సంఘం ఆద్వర్యంలో స్థానిక తహసీల్దార్‌కి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాన్ షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న గిరిజన గ్రామాలను 5వ షెడ్యుల్డ్‌లో చేర్చే విధంగా రాష్ట్రంలో గుర్తించబడిన 524 గ్రామాలలో 21 అధికారులు గ్రామ సభలు ఏర్పాటు చేసి, దానికికి సంబంధించి రిపోర్టుని తయారు చేసి ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి నివేదించి నాన్ షెడ్యూల్డ్‌లో ఉన్న గిరిజన ప్రజలకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. అదే విధంగా మైదాన, ఏజెన్సీ మారుమూల గిరిజన ప్రాంతాల నుంచి నానా అవస్థలు పడుతూ ఆధాయ, కుల దృవీకరణ సర్టిఫికెట్స్ కోసం వచ్చిన వారికి వెను వెంటను పని అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. అదే విధంగా నాన్ షెడ్యూల్డ్‌లో ఉన్న గిరిజనులకు పోడు వ్యవసాయ భూములకు సంబంధించి ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ని కోరారు. పాడేరు ఐటీడీఏ పీవో గుర్తించబడిన నాన్ షెడ్యూల్డ్ ఏరియాలో రెవిన్యూ అధికారులు గ్రామ సభలు నిర్వహించి వారి సమస్యలు తెలుసుకొని ఉన్నతాధికారులకు సిఫార్స్ చెయ్యాలని డిమాండ్ చేశారు. అధికారులు ఇప్పటి వరకూ చిన్నచూపు వైఖరి అవలంబించడం కారణంగా అన్ని విధాలుగా నష్టపోతూ వస్తున్నామని అన్నారు. వైద్య, ఆరోగ్యం, ఉద్యోగ ప్రమోషన్ వంటి వివిద రకాల హక్కులకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఇప్పటికైన అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. అయితే దీనికి స్పందించిన తహసీల్దార్ సంబంధిత నివేధికను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి సిఫార్స్ చేసి తగు న్యాయం చేసే దిశగా చర్యలు తీసకొంటామని ఈ సందర్భంగా హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాడుగుల మండల ఆదివాసి సంఘం కార్యదర్శి అంపరంగి శ్రీను, సభ్యులు బోనంగి రాజు, దాసు, లీగల్ అసిస్టెంట్ కిముడు కృష్ణ తదితరులు పాల్గన్నారు.

## జిల్లా ఆ సుపత్రిలో మొట్ట మొదటి సిజేరియన్ ఆపరేషన్ తల్లి బిడ్డ క్షేమం



**పాడేరు, వార్తావళి, జూలై 7 :** పాడేరు మండల కేంద్రంలో ఉన్న జిల్లా ఆసుపత్రిలో మొట్టమొదటి సిజేరియన్ ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. హుకుంపేట మండల సంతారి గ్రామానికి చెందిన గర్భిణీ స్త్రీ లోచలి వసంత (23) రెండవ ప్రసవం కోసం సోమవారం (6.7.20)న స్థానిక జిల్లా ఆసుపత్రిలో చేరారు. వైదులు పరీక్షించి సిజేరియన్ ఆపరేషన్ పడుతోందని గుర్తించి మంగళవారం జిల్లా ఆసుపత్రిలోని వైద్యులు డా. ఒ. శ్రీలత, డా. తమర్భ నరసింగరావు, డా. సరిత బృందం సిజేరియన్ ఆపరేషన్ నిర్వహించి తల్లి బిడ్డలను క్షేమంగా రక్షించ గలిగారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారు. గతంలో సిజేరియన్ ఆపరేషన్లకు పాడేరు నుంచి గర్భిణీ స్త్రీలను విశాఖపట్నం తరలించేవారు. ఇటీవల కాలంలో ఐటిడి ఏ ప్రాజెక్టు అధికారి డా. వేంకటేశ్వర్ స్వయంగా వైద్యులు కావడంతో వైద్య సేవలు సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించారు. గత వారం జిల్లా ఆసుపత్రిని సందర్శించి ఆపరేషను ఆవసరమైన అన్ని ఏర్పాట్లు, థియేటర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపధ్యంలో ప్రత్యేకంగా అధిక వేతనం ఐటిడి ఏ నుంచి ఇచ్చి నలుగురు వైద్య నిపుణులను నియమించారు. డా.శారదా, డా.ప్రవీణ్ వర్మ, ప్రభావతి, డా. భాను సాయి కుమార్లను నియమించి మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పుష్ప శ్రీవాణి, అరకు ఎం.పి. జి.మాధవి,పాడేరు ఎం. ఎల్. ఎ.కె. భాగ్యలక్ష్మి, అరకు ఎం. ఎల్. ఎ చెట్టి పాల్గుణ, ఐటిడి ఏ పి.ఓ. డా. వేంకటేశ్వర్, మెడికల్ కౌన్సిల్ సభ్యులు డా. నర్సింగరావు జిల్లా ఆసుపత్రిని సందర్శించి తల్లి బిడ్డను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాతా శిశువులకు మన్యంలో మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డా. కృష్ణారావు, డా. ప్రవీణ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల హక్కులను కాలరాసే వారిని మహిళా కమిషన్ ఉపేక్షించబోదు

**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, జూలై 7:** ఇళ్లస్థలాలు రాకుండా అడ్డుకునే వారిని మహిళలు నిలదీయండి సామాజిక స్థితిలో మార్పుతోనే మహిళాసాధికారిత పథకాల అమల్లో రోల్ మోడల్‌గా ఏపి రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ మహిళలకు ప్రభుత్వం కలగ జేస్తున్న హక్కులను కాలరాచే వారిని రాష్ట్ర మహిళా కమిషన్ ఉపేక్షించబోదని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను అడ్డుకునేవారిని ఎలా నిలదీయాలో మహిళలు ఆలోచన చేయాలని అన్నారు. మహిళలకు ఇళ్ల పట్టాలు రాకుండా అడ్డుకునేవారు చరిత్ర హీనులుగా మిగిలిపోతారని వాసిరెడ్డి పద్మ పేర్కొన్నారు. మహిళలకు న్యాయంజరగడం ఆయావర్గాలకు పార్టీలకు ఇష్టం లేనట్లుగా ఉందని, అందుకే అడుగడుగునా అడ్డ తగులుతున్నారన్నారు. స్థానిక ఆర్ అండ్ బి భవన సముదాయంలో మంగళవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో మహిళాకమిషన్ ఛైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ అంతా సజావుగా జరిగి ఉంటే 30 లక్షలమంది మహిళలకు వారి పేరుమీద ఇళ్లస్థలాల పట్టాలను రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగి వారి కలసాకారం అయ్యేదని, ఆకార్యక్రమాన్ని పిటీషన్ వేసి అడ్డుకున్నారని, రాష్ట్ర చరిత్రలోనే ఈరోజు బ్లాక్ డేగా చెప్పుకోవచ్చని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ వాసిరెడ్డి పద్మ ఆవేదన వ్యక్తం చేసారు. రాష్ట్రంలో 30 లక్షల మంది మహిళలకు పెద్ద ఎత్తున ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ చేసే కార్యక్రమాన్ని ఒక వేడుకగా జరపాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఆశించిందన్నారు. మహిళలకు ఆస్థి హక్కు రిజిస్ట్రేషన్ జరిపి ఇచ్చే ప్రక్రియను అడ్డుకునేందుకు కొందరు పిటీషన్లు వేయడం ఎంతో ఆవేదన కలిగించిందన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం చేయనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున మహిళలకు ఆర్థిక ప్రయోజనాలను వారి ఖాతాల్లోనే జమచేయడం జరుగుతోందన్నారు. కరోనావంటి విపత్తు సమయంలో కూడా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంపట్ల దేశం యావత్తు మన రాష్ట్రం వైపు చూస్తోందన్నారు. పథకాల అమల్లో ఇతర రాష్ట్రాలకు ఏపి రోల్ మోడల్ గా నిలుస్తున్నదన్నారు. 108, 104 అంబులెన్స్ వాహనాలను 1088 ను ఒకే రోజు ప్రారంభించి దేశం యావత్తు ఎంతో ఆశ్చర్యంగా చూడడంతో పాటు ఎంతో మంది ప్రముఖులు రాష్ట్ర ప్రభుత్వాన్ని పెద్ద ఎత్తున ప్రశంసించడం మనం చూశామన్నారు. పలు రాష్ట్రాల మహిళా కమిషన్లు రాష్ట్రంలో మహిళలకు అమలు చేస్తున్న 50 శాతంరిజర్వేషన్ల వివరాలను, మహిళలకు అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అడిగితెలుసుకుంటున్నాయన్నారు. మహిళలు వివక్షతకు గురి అవుతున్నారని, మహిళలు పేరుపై ఆర్థిక ప్రయోజనాలను, ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లను ప్రభుత్వం చేపట్టడం ద్వారా వారిపట్ల ఆయా కుటుంబాల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. ఏకుటుంబంలో నైనా మహిళ దే కేంద్రస్థానం అని, మహిళ బాగుంటేనే ఆసమాజం అంతా బాగుంటుందని, అటువంటి మహిళల నోటిదగ్గరకు వచ్చిన ముద్దను కాలితో తన్నినట్లుగా వీటిని అడ్డుకునేందుకు కొందరు పిటీషన్లు వేయడం బాధాకరం అన్నారు. రెక్కాడితేగానీ డొక్కాడని పేదమహిళలకు ఇళ్లస్థలాలు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తుంటే అడ్డుపడి వారి జీవితాలతో ఎందుకు చెలగాటమాడుతున్నారు అని ఆమె ప్రశ్నించారు. మహిళలు పెద్ద ఎత్తున అటువంటివారిని ప్రశ్నించాలని, తగిన గుణపాఠం చెప్పాలని వాసిరెడ్డి పద్మ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, వేస్తున్న అడుగులు మహిళా సాధికారిత దిశగా ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయన్నది వాస్తవం అన్నారు. ఉపన్యాశాలతో మహిళాసాధికారిత రాదని, మహిళల పేరుతో ఇళ్లస్థలాలు, ఇళ్లు, ప్రభుత్వ ఆర్థికసహాయం వారి పేరున ఇవ్వడం ద్వారానే మహిళల కుటుంబంలో గౌరవ మర్యాదలు పెరిగి సామాజిక స్థితిలో మార్పువచ్చి మహిళాసాధికారిత వస్తుందన్నారు. మహిళాసాధికారిత ఎలా సాధ్యం అవుతుందో ముఖ్యమంత్రి చేసి చూపిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. గత ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు 50 శాతం వాటాను కల్పించేదిశలో పథకాల అమలుతో అడుగులు వేస్తుంటే కొందరు వారి స్వార్ధ రాజకీయాలుకోసం అడ్డుకుంటున్నారన్నారు. మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తూ రాజకీయపరంగానూ, నామినేటెడ్ పోస్టులతోపాటు, నామినేటెడ్ పనుల్లో కూడా 50 శాతం వాటాను మహిళలకు కలగజేయడం జరిగిందన్నారు.

## చెరుకు రైతులకు చెక్కులు పంపిణీ



**అనకాపల్లి, వార్తావళి, జూలై 7 :** జూలై 8 వ తేదీన రాజశేఖర్ రెడ్డి జయంతిని రైతు దినోత్సవంగా ప్రకటించిన సందర్భంగా అనకాపల్లి షుగర్ ఫ్యాక్టరీ రైతులకు సుమారు 1305 మంది రైతులకు 4.63 కోట్ల రూపాయల బకాయిలను ప్రభుత్వం విడుదల చేయడానికి గౌరవ శాసనసభ్యులు శ్రీ గుడివాడ అమర్నాథ్ గారు చేసిన కృషికి రైతులందరూ హర్షించారు అందులో భాగంగా జూలై 8 న వెంకుపాలెం గ్రామంలో రైతుల బకాయిలను శాసనసభ్యులు శ్రీ గుడివాడ అమర్నాథ్ గారి చేతుల మీదగా రైతులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం చేయబడును అదేవిధంగా గౌరవ ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం రైతులు బకాయిలను విడుదల చేసినందుకు జూలై 7వ తేదీన అన్ని గ్రామాలలో రైతులు స్వచ్ఛందంగా ముఖ్యమంత్రి గారి ఫోటోకి పాలాభిషేకం చేయబడును అని మండల పార్టీ అధ్యక్షుడు గొర్లి సూరిబాబు గారు చెప్పడం జరిగింది.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, మండల కార్యదర్శి బిశెట్టి జగన్, కసింకోట మండల పార్టీ ప్రెసిడెంట్ గొల్లవిల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కాశ్మీర్ ఉద్యమం కోసం ప్రాణ త్యాగం చేసిన ముఖర్జీ

### ఎమ్మెల్సీ మాధవ్



**అనకాపల్లి, వార్తావళి, జూలై 7 :** దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన వారిలో శ్యాంప్రసాద్ ముఖర్జీ ఒకరని ఎమ్మెల్సీ మాధవ్ పేర్కొన్నారు. మోదీ 2.0 కార్యక్రమాల్లో భాగంగా డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా సోమవారం సేవ కార్యక్రమం నిర్వహించారు. బిఆర్‌టి కాలనీలో ఎస్సీ సెల్ అధ్యక్షులు కొండబాబు మాస్టర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ దేశమంతా ఏకమై ఉండాలని తలచనివారిలో శ్యాం ప్రసాద్ ఒకరన్నారు. కాశ్మీర్ దేశం లోనే ఉండాలని పోరాటం చేసి ప్రాణాలు విడిచార నారు. అతని కలను ప్రధాని మోడీ నెరవేర్చా రనారు. దేశ ప్రజలకు భాజపా ఆధ్వర్యంలో అనేక పథకాలు అందుతున్నాయ నారు. అనంతరం పేదలకు నిత్యావసరాలు ను పంపిణీ చేశారు. జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడతూ ప్రభుత్వ పథాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కసిరెడ్డి శ్రీను అధ్యక్షత వహించారు. భారతీయ జనతా పార్టీ జనరల్ సెక్రెటరీ ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి కర్రి రామకృష్ణ, యువమోర్చ జిల్లా అధ్యక్షులు డాక్టర్ గల్లా రాజు, మాజీ ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రామ్ 34 వ వర్ధంతి

### నివాళులు అర్పించిన ఎం ఎల్ సి బుద్ధ నాగ జగదీశ్వరరావు



**అనకాపల్లి, వార్తావళి, జూలై 7 :** బాబు జగ్జీవన్ రామ్ 34 వ వర్ధంతి సందర్భంగా సోమవారం అనకాపల్లి పట్టణంలో అరుంధతి నగరంలో బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు ఈ సందర్భంగా శాసనమండలి సభ్యులు శ్రీ బుద్ధ నాగ జగదీశ్వరరావు మాట్లాడుతూ దేశ స్వతంత్రం కోసం పోరాడుతూనే సామాజిక సమానత్వం కోసం అనగారిన వర్గాల హక్కులకోసం అలుపెరగని పోరాటం సాగించిన రాజకీయ సవ్యసాచి సామాజిక విప్లవ యోధుడు బాబు జగ్జీవన్ రామ్ జాతి జనుల విద్యావంతులుగా ఆత్మాభిమానం కలవారిగా చేయాలన్నదే తన లక్ష్యంగా భావించారని నాగ జగదీష్ తెలిపారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు మల్ల సురేంద్ర పాలమర సెట్టు వేణు కొలతల కారు బాబు దొడ్డి జగదీశ్వర రావు పెట్ల మోనో పెట్ల సత్యనారాయణ బొడ్డేడ మురళి దూలం ప్రసాద్ పాల్గొన్నారు.


## టిడ్కో గృహాలను వెంటనే లబ్ధిదారులకు అందజేయాలి

### ఎంఎల్‌సి బుద్ధ నాగజగథీశ్వరరావు



**అనకాపల్లి, వార్తావళి, జూలై 7 :** రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాటలు ప్రచారానికి ఎక్కువ పనులకు తక్కువగా ఉన్నాయని శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు విమర్శించారు. ఇళ్ల పట్టాలు పంపిణీ కార్యక్రమాన్ని చంద్రబాబు నాయుడు అడ్డుకుంటున్నారని చేతగాని విమర్శలు చేస్తున్నారని ఓడ లేక మద్దిలి దరువు అయిందని చందంగా ఉందని చేతగాని పాలనతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నారని రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో టిడ్కో గృహాలు పట్టణ ప్రాంతంలో ఆరు లక్షలు 25 వేలు నిర్మించారని 19 లక్షలు గ్రామీణ ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టారని వాటిలో సుమారు ఆరు లక్షలు పూర్తి చేసుకొని లబ్ధిదారులకు కొన్ని ప్రాంతాల్లో ఇవ్వడం జరిగిందని మరికొన్ని ప్రాంతాల్లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిలుపుదల చేశారని అధికారంలోకి వచ్చి 13 నెలలు అయినప్పటికీ నేటికీ లబ్ధిదారులకు ఇవ్వకుండా తాత్సారం చేసి మేమే నిర్మించి ఇస్తున్నట్లుగా ప్రకటనలు చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని మౌలిక సదుపాయాలు కల్పించవలసిన ఉన్న ప్రభుత్వం పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని అనకాపల్లి మండలం సత్యనారాయణపురం మేగా లే అవుట్ లో 2,520 ఇళ్ళులు నిర్మాణలు పూర్తిచేసి తెలుగుదేశం హయంలో లబ్ధిదారులుకు అందిచడం జరిగింది అని దీని మూలంగా లబ్ధిదారులు అద్దెలు చెల్లించలేక కేటాయించిన ఇల్లులోకి వెళ్లలేక సతమత అవుతున్నారని వీటిలో చాలా మంది లబ్ధిదారులకు వివిధ బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేశారని వాటికి వడ్డీలు పెరిగిపోతున్నాయని లబ్ధిదారులు గోల పెడుతున్న అధికారులు ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోవడం లేదని నాగ జగదీష్ తెలిపారు.

## న్యాయవాదుల కోసం కేటాయించిన 100 కోట్లు వెంటనే విడుదల చేయాలి: ఐఎల్



**అనకాపల్లి, వార్తావళి, జూలై 7 :** న్యాయవాదుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రకటించిన100 కోట్లు వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని ఐ ఎ.ఎల్ సంఘం జిల్లా అధ్యక్షులు సి. శివయ్య ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక కొడు గంటి.గోవిందరావు భవన్ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ సమావేశం జరిగింది ఈ సమావేశంలో ఐ. ఎ .ఎల్ జిల్లా అధ్యక్షులు శివయ్య గారు మాట్లాడుతూ కరోనా మహమ్మారి విజృంభించడం వలన గత మూడు నెలలపాటు కోర్టులు మూసివేయడం వలన తద్వారా న్యాయవాదులు ఆదాయం కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి వందకోట్లు న్యాయవాదుల సంక్షేమా నిధికి విడుదల చేసి న్యాయవాదులను ఆదుకోవాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో శేఖర మంత్రి సాయి వెంకట లక్ష్మణరావు, పల్లా సుశీల, టి పి నాయుడు, మైకేల్, గంట సురేష్, కనిశెట్టిసురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు

# విశాఖపట్నం వార్తలు

## ఆపత్కాలంలో పంపాన రాజ్యలక్ష్మి ఆపన్నహస్తం



**విశాఖపట్నం, పశ్చిమం, వార్తావళి, జూలై 7:** లాక్ డౌన్ కారణంగా ఇబ్బందులు పడుతున్న పేదలకు ఇప్పటికే ఎంతో సహాయపడ్డ 32వ వార్డ్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి స్థానికులకు పంపాన రాజ్యలక్ష్మి అండ ఇప్పటికీ ప్రజలకు సహాయం చేస్తూనే ఉన్నారు.తాజాగా ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులుపడుతున్న స్థానిక తెలుగుదేశం కార్యకర్తలకు,మహిళలకు ఆపన్న హస్తం అందిస్తున్నారు.శాసనసభ్యుడు వాసుపల్లి గణేష్ కుమార్ ఆదేశాలమేరకు వార్డులోని కర్ణాలవీధికి చెందిన నిరుపేద యామిని అనే యువతికి ఉద్యోగం ఇప్పించి ఉపాధికల్పించారు. అలాగే గొల్లలపాలెంకు చెందిన పార్టీ మహిళా కార్యకర్త రమాదేవి ఆరోగ్య సమస్యలతో పాటు ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారనే వార్త తెలుసుకొని రమాదేవి ఇంటికి వెళ్లి పరామర్శించి ఏ సమస్యవచ్చిన అండగా ఉంటానని హామీ ఇచ్చి ధైర్యం చెప్పారు.మందులు,పళ్ళు,నగదు ఇచ్చి సహాయం చేసారు.ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ వార్డులోకరోనా వైరస్ తో ఇబ్బందులు పడుతున్న అన్ని వర్గాల ప్రజలకు సహాయం చేసానని చెప్పారు. రాచపోలమాంబ ఆలయంలో కుర్చీలు, బెంచీలు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. నగరంలో వైరస్ విజృంబిస్తున్నవేళ వార్డ్ మొత్తం శానిటైజర్ తో శుభ్రంచేయించి బ్లీచింగ్ చెల్లించినట్లు రాజ్యలక్ష్మి చెప్పారు.తనకు అన్నివిధాలా సహకరిస్తున్న దక్షిణ శాసనసభ్యుడు వాసుపల్లి గణేష్ కుమార్ కు,వార్డు నాయకులకు, కార్యకర్తలకు రాజ్యలక్ష్మి ధన్యవాదాలు చెప్పారు. కష్టకాలంలో తమను ఆదుకున్న రాజ్యలక్ష్మికి యామిని,రమాదేవిలు కృత్జ్ఞతలు చెప్పారు.

## ఎల్జీ పాలిమర్స్ యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలి: సీపీఐ డిమాండ్

**విశాఖపట్నం, తూర్పు, వార్తావళి, జూలై 7:** ఎల్జీ ప్రమాదం యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే జరిగిందని,కనీస భద్రతా ప్రమాణాలు చేపట్టకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం వల్లే ప్రమాదం చోటు చేసుకొందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె వి సత్యనారాయణ మూర్తి అన్నారు. ఇదే విషయాన్ని హైపవర్ కమిటీ కూడా ప్రభుత్వానికి నివేదించిందని ఆయన చెప్పారు. ఎల్జీ పాలిమర్స్ ను జనావాసాల నుంచి తరలించాలని,యాజమాన్యాన్ని తక్షణం అరెస్టు చేయాలనే డిమాండ్లతో ఈ రోజు జీవీఎంసీ గాంధీ విగ్రహం ముందు సీపీఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు.ఈ సందర్భంగా జె వి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ఎల్జీ పాలిమర్స్ కంపెనీ గ్యాస్ లీక్ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన హైపవర్ కమిటీ 329 పేజీల తుది నివేదికలో అదుపుచేయలేని స్టైరెన్ విడుదల వల్ల ప్రమాదం సంభవించిందని పేర్కొన్నటు ఆయన తెలిపారు. యాజమాన్యం యొక్క తీవ్ర నిర్లక్ష్యం వల్లే ఈ ఘోర ప్రమాదం జరిగిందని,ఈ ప్రమాదకర పరిశ్రమను జనావాసాల నుండి తరలించాలని కమిటీ తేల్చి చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేస్తూ తక్షణం ఎల్జీపాలిమర్స్ కంపెనీ తరలింపు పట్ల ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో మరెక్కడా ఇలాంటి ప్రమాదాలు జరగకుండా నివారించడానికి రాష్ట్ర స్థాయిలోను, జాతీయ స్థాయిలోను భద్రతా బోర్డులను నెలకొల్పాలని కమిటీ సూచించినట్లు పేర్కొంటూ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులను సైతం ఇందులో బాద్యులను చేయాలని సత్యనారాయణ మూర్తి డిమాండ్ చేశారు. ఎన్జీటి సూచనల మేరకు జిల్లా కలెక్టర్ వద్ద డిపాజిట్ చేసిన 50 కోట్లు రూపాయలు సరిపోవని 500 కోట్ల రూపాయలు డిపాజిట్ చేయాలని,అలాగే భవిష్యత్తులో ఆప్రాంతవాసులకు మెరుగైన చికిత్స నిమిత్తం హాస్పిటల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా, నగర కార్యదర్సులు బాలేపల్లి వెంకటరమణ, మరుపిళ్ల పైడిరాజు జిలా, నగర సహాయ కార్యదర్సులు పొట్టిక సత్యన్నారాయణ, ఎస్ కె రెహమాన్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఎ విమల, నగర కార్యవర్గ సభ్యులు గుడాల రాంబాబు, పాత్రపల్లి చంద్రశేఖర్, జి. వామనమూర్తి, పైలా ఈశ్వరరావు, ఆర్. శ్రీనివాసరావు,నాయకులు ఎం మన్మదరావు, టి వి రావు, వై త్రినాద్, కె నారాయణరావు, రమణ, నల్లయ్య, నాగేశ్వరరావు, జి గణపతి, విఅమర్, జి ఓబులేసు, నాగరాజు, తదితరులతో పాటు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.






విశాఖపట్నం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి వర్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు గారిని కలసిన విశాఖ రురల్ జిల్లా ఎస్పీ బొడ్డే పల్లి కృష్ణారావు. బొడ్డే పల్లి కృష్ణారావు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సందర్బంగా మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందించారు. - వార్తావళి, విశాఖపట్నం

## కరోనాపై అప్రమత్తంగా ఉండాలి



**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, జూలై 7:** 34వ వార్డ్‌లో మన గ్రామ పెద్దలు, 2 టౌన్ పోలీస్ శాఖ వారు కలిసి కొబ్బరితోట, ద్రోణంరాజు కోలని, నేతాజీ నగర్, మురళీధర్ వీధిలో కరోనా వ్యాధి ప్రబలగుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, అప్రమత్తంగా ఉండాలని చైతన్య పరిచారు. వీధుల్లో గుంపులుగా ఉండకూడదని, సామాజిక దూరం పాటించాలని, తప్పనిసరిగా మాస్క్ ధరించాలని, పరిశుభ్రత పాటించాలని, హౌసీ, అష్ట చమ్మా, పేకాట, కేరామ్స్ వంటి ఆటలు ఎట్టి పరిస్తితిలో ఆడకూడదని, ప్రతి ఒక్కరు బాధ్యత యుతంగా ఉండాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో 2 వ పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ నర్సింగరావు గారు, వైసిపి వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ లింగం శ్రీనివాస్ గారు, 34వ వార్డ్ గ్రామ పెద్దలు లండ రమణ, గొర్లి గౌరిష్, సురాడ మసేను, గంటా శ్రీను, అంబటి వెంకటరావు, గరికిన కొండబాబు (యూత్), సురపతి అమ్మోరు బాబు, లక్ష్మణ (మైక్), నడిగడ్ల పైడిరాజు మరియు 2 టౌన్ పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీదేవి విజ్ఞాన జ్యోతి ట్రస్ట్ అధినేత్రి కీర్తి పట్నాయక్ సేవలకు పట్టాభిషేకం



**విశాఖపట్నం, ఉత్తరం, వార్తావళి, జూలై 7:** శ్రీ దేవి విజ్ఞాన జ్యోతి ట్రస్ట్ అధినేత్రి కీర్తి పట్నాయక్ చేసిన సేవలను పలువురు కొనియాడారు. కరోన లాక్ డౌన్ కారణంగా అనేక రకాలుగా ఇబ్బం దులు పడుతున్న పేద,బలహీన, బడుగు, దళిత వర్గాలకు చెందిన ప్రజలను ఎన్నోవిధాలుగా ఆదుకొని సేవలు చేసారని ప్రశంసించారు కీర్తి పట్నాయక్ చేసిన సేవలను.గుర్తించి దళిత సంఘాలు, ఆగాపే మహిళలు ఆమెకు బృందా వన్ పార్క్‌లో మహిళా సంఘాలు,రాష్ట్ర దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆమెకు ఘన సన్మానం చేసారు.ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ వేణు, జీవీఎంసీ వార్డు సూపర్వైజర్ సింహాచలం, వార్డు సెక్రటరీ రేష్మ, శోభారాణి ప్రెసిడెంట్ గ్రేస్,సెక్రటరీ లూదియమ్మ తదితరులు పాల్గొని ఆమెకు శాలువా కప్పిపూలమాలలతో సత్కరించి మెమొంటో ప్రదానం చేసారు.

## కొనసాగుతున్న కర్రీ అప్పలస్వామి చారిటబుల్ ట్రస్ట్ సహాయ కార్యక్రమాలు



**విశాఖపట్నం, పశ్చిమం, వార్తావళి, జూలై 7:** లాక్ డౌన్ సందర్భంగా గత నూట ఎనిమిది రోజులుగా పేదలకు నిరంతర సేవలందిస్తున్న శ్రీ కర్రీ అప్పలస్వామి చారిటబుల్ ట్రస్ట్ ఈ రోజు కూడా సహాయ కార్యక్రమాలను కొనసాగించింది.జీవీఎంసీ 98 వ వార్డులో స్థానిక శ్రీనివాసా కళ్యాణ మండపంలో గ్రామంలో వున్న25 నిరుపేద కుటుంబాలకు, మహిళలకు 10 కేజి ల రైస్ బ్యాగులనుపంపిణీ చేసినట్లు ట్రస్ట్. చైర్మన్ స్వామి తెలియచేసారు.తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో భాద పడుతున్నారని తెలుసుకొని బియ్యం పంపిణీ చేసినట్లు స్వామి చెప్పారు. ఇప్పటివరకు ట్రస్ట్ ద్వారా ఎంతోమందికి సహాయం చేయాలనే సదుద్దేశంతో కర్రీ అప్పలస్వామి ఆర్థిక సహాయంతో గ్రామంలో సుమారు 5000 ప్రతీ కుటుంబానికి బియ్యం, కూరగాయలు , కోడిగుడ్లు,పండ్లు పంపిణీ చేసారు.వ్యాధి గ్రస్తుల కు,గర్భిణీ స్త్రీలకు చేతనైనంత సహాయ సహకారాలు అందించామని స్వామి చెప్పారు.కరోనా వైరస్ ప్రభావంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కరోనావైరస్ ని నివారించడానికి తీవ్ర ప్రయత్నం చేసినప్పటికీ అదుపులో రావట్లేదని,ప్రజలందరూ పరిశుభ్రంగా ఉంటూ భౌతిక దూరం పాటించి వైరస్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్వామి కోరారు.ఈ కార్యక్రమంలో అడవివరం సహకార పరపతి సంఘం పాలకవర్గ సభ్యులు కొలుసు గుర్నాథ రావు, మజ్జి సూరిబాబు,లోగిష గణేష్ మరియు ఎన్ అప్పారావు, మునసనూకరాజు, కొలసురామారావు, కంపర సురేష్ పాల్గొన్నారు.

## ఎన్ఏడి పై వంతెన పురోగతిపై సమీక్ష

**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, జూలై 7:** మంగళవారం విఎంఆర్డిఏ కార్యాలయంలో అధికారులు, ఇపిసి కాంట్రాక్టర్ ప్రతినిధులతో (విజయ్ నిర్మాన్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్) విఎంఆర్డిఏ చైర్ పర్సన్ ద్రోణంరాజు శ్రీనివాసరావు మెట్రోపాలిటన్ కమిషనర్ పి.కోటేశ్వరరావు, ఐఎఎస్ ఎన్.ఎ.డి జంక్షన్ వద్ద చేపట్టిన ఫ్లై-ఓవర్ (పై వంతెన) నిర్మాణం పనుల పురోగతి పై సమీక్షించారు. ఇప్పటి వరకు ఇపిసి కాంట్రాక్టర్ ప్రతినిధులు 60% భౌతిక పనులను పూర్తి చేసి 55% ఆర్థిక పురోగతిని సాధించారని తెలియజేశారు. అధిక ట్రాఫిక్, లారీల సమ్మె, ఇసుక లభించకపోవడం మరియు కోవిడ్-19 లాక్డౌన్ కారణంగా పనులలో ఆలస్యం కి కారణమని కాంట్రాక్టర్ ప్రతినిధులు పేర్కొన్నారని తెలిపారు. విమానాశ్రయం నుండి ఎన్ఎస్‌టిఎల్ వైపు రహదారి పూర్తయిందని మరియు ట్రాఫిక్ తెరవడానికి సిద్ధంగా ఉందని, గోపాలపట్నం వైపు పనులు పురోగతిలో ఉన్నాయని మరియు 15.08.2020 నాటికి పూర్తవుతాయని, మర్రిపాలెం వైపు పనులు పురోగతిలో ఉన్నాయని 15.10.2020 నాటికి పూర్తవుతాయని తెలియజేసారు. ఎన్ఎస్‌టిఎల్ నుండి విమానాశ్రయం వైపు రహదారి పనులను పూర్తయిన విమానాశ్రయం నుండి ఎన్ఎస్‌టిఎల్ రహదారిపై ట్రాఫిక్ అనుమతించిన పిదప పనులను ప్రారంభించబడి 30.11.2020 నాటికి పూర్తవుతాయని తెలియజేసారు. దిగువ రోటరీ కి సంబందించిన పనులు డిసెంబర్ -2020 చివరి నాటికి పూర్తి చేయడానికి ఏజెన్సీకి కాలపరిమితిని ఇచ్చినట్టు తెలియజేసారు. విధించిన కాలపరిమితులను ఖచ్చితంగా పాటించడం ద్వారా ఫై వొంతెన పనుల అన్ని రకములగా డిసెంబర్ -2020 చివరి నాటికి పూర్తి చేసి విశాఖ నగరవాసులకు వినియోగంలోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులకు మరియు కాంట్రాక్టర్ ప్రతినిధులను చైర్ పర్సన్, విఎంఆర్డిఏ ఆదేశించారు. అలాగే రైల్వే ఓవర్ బ్రిడ్జ్ (ఆర్ఓబి) వంతెనకి సంబంధించి రైల్వే అధికారులు నుంచి ఎటువంటి అనుమతులు రాలేదని, అనుమతులు వచ్చిన పిమ్మట 7 నెలల వ్యవధిలో పూర్తి చెయ్యగలమని కాంట్రాక్టర్ ప్రతినిధులు తెలియజేసారు.

ఈ సమీక్ష సమావేశం లో మెట్రోపాలిటన్ కమిషనర్ పి. కోటేశ్వరరావు ఐఎఎస్, అదనపు కమిషనర్ మనజిర్ జీలని సామూన్ ఐఎఎస్, సూపరింటెండింగ్ ఇంజనీర్ కె రామ మోహన్ రావు, చీఫ్ అర్బన్ ప్లానర్ బి . సురేష్ కుమార్ , చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ వై. హరి ప్రసాద్ మరియు కాంట్రాక్టర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎల్‌జీ పాలిమర్స్ కంపెనీని వెంటనే తరలించాలి సిపిఎం డిమాండ్



**విశాఖపట్నం, తూర్పు, వార్తావళి, జూలై 7:** ఎల్జీ పాలిమర్స్ కంపెనీ గ్యాస్ లీక్ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన హైపవర్ కమిటీ సమర్పించిన 329 పేజీల తుది నివేదికను వెంటనే అమలు చేయాలనీ సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేసారు.ఈ రోజు సిపిఎం జిల్లా కార్యాలయంలో మీడియా తో మాట్లాడుతూ అదుపుచేయలేని స్టైరెన్ రిలీజ్ వల్ల దారుణంగా ప్రజలు చనిపోయారని నివేదికలో పేర్కొన్నారని, ఎం-6 ట్యాంకు డిజైన్ తో సహా ప్లాంట్ నిర్వహణలో పూర్తి లోపాలు వున్నాయని నివేదికలో స్పష్టంగా ఉన్నట్లు చెప్పారు.పర్యావరణ అనుమతులు లేకుండా 23 సంవత్సరాలు ఈ పరిశ్రమ నడపడం యాజమాన్యం తప్పిదమని,36 చోట్ల అల్లారం పాయింట్ లు ఉన్నా సైరన్ మోగించలేదని నర్సింగరావు ఆవేదన వ్యక్తం చేసారు.యాజమాన్యం యొక్క తీవ్ర నిర్లక్ష్యం వల్లే ఈ ఘోర ప్రమాదం జరిగిందని,ఈ ప్రమాదకర పరిశ్రమను జనావాసాల నుండి తరలించాలని కమిటీసూచించిన ప్రకారం తక్షణం ఎల్జీపాలిమర్స్ కంపెనీ ని తరలించాలని, కంపెనీ యాజమాన్యాన్ని హత్యానేరం క్రింద వెంటనే అరెస్ట్ చేయాలని సిపిఐ(ఎం) పార్టీ తరపున డిమాండ్ చేసారు. సిపిఎం కార్యదర్శి బీ.గంగారావు మాట్లాడుతూ ఎల్జీ పాలిమర్స్ గ్యాస్ లీక్ ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని హైపవర్ కమిటీ భవిష్యత్ లో యిటువంటి ప్రమాదాలు జరగకుండా అనేక సిఫార్సులు చేసిందని,ఆసిఫార్సులను రాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయాలని కోరారు. స్టైరన్ గ్యాస్ లీక్ దుర్ఘటనకు చనిపోయిన వై. కనకరాజు, కె. సత్యన్నారాయణ, పి వెంకాయమ్మలకు కోటిరూపాయిలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని గంగారావు డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో ఎల్జీ పాలిమర్స్ బాధితుల సంఘ నాయకులు పి.వెంకట రెడ్డి,యూ.రాజు ,ఎస్.రమణ, సీఐటీయూ నాయకులు డి. అప్పలరాజు, డి.సతీష్,ఎల్జీ పాలిమర్స్ బాధితులు కే.గోపి, వై.లావణ్య,జె.రాజు, ఏ ప్రసాద్ పాల్గొన్నారు.

## ఓడించినందుకు ప్రజల మీద కక్ష కట్టిన తెలుగుదేశం: అవంతి



**విశాఖపట్నం, ఉత్తరం, వార్తావళి, జూలై 7:** అందరికీ గృహవసతి కల్పించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా పేదలకు ఇళ్ల పట్టాలు ఇద్దామనుకుంటే తెలుగుదేశం అధినేత చంద్రబాబు,తెలుగుదేశం నాయకులు రాజకీయం చేస్తున్నారని మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మండిపడ్డారు.ఈ రోజు విశాఖ నగర వైస్సార్సీపీ కార్యాలయంలో మీడియాసమావేశంలో మాట్లాడుతూ మంచిపని ఏది చేసినా అడ్డుకుంటున్నారని ఓడించినందుకు ప్రజల మీద కక్ష కట్టారని మంత్రి విమర్శించారు.ఇళ్ల పట్టాలు అడ్డుకోవడమే,చంద్రబాబు నాయుడు దిగజారుడుతనానికి నిదర్శనమని మంత్రి దుయ్యబట్టారు.విశాఖ నగరంలో నలుగురు తెలుగుదేశం ఎమ్మెల్యేలను గెలిపిస్తే, రెండు లక్షల మందికి ఇల్లు ఇవ్వకుండా కోర్టు కేసులు వేయించి అడ్డుకున్నారని మండిపడ్డారు.లబ్ధిదారుల్లో పేద తెలుగుదేశం కార్యకర్తలు కూడా ఉన్నారని ముత్తంశెట్టి అన్నారు.ఇళ్ల పట్టాలలో అవినీతి జరిగితే నిరూపించాలని మంత్రి సవాల్ విసిరారు.గత ప్రభుత్వంలో కట్టిన ఇళ్లు కూడా ఇస్తున్నామని,ఎక్కడా ఆపలేదని మంత్రి ముత్తంశెట్టి స్పష్టం చేసారు.దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను ఎటువంటి హంగు ఆర్భాటాలకు తావు లేకుండా కేవలం సేవ కార్యక్రమాల ద్వారా నిర్వహిస్తామని ముత్తంశెట్టి తెలిపారు.ఈ కార్యక్రమంలో వీఎమ్ఆర్డీఏ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాసరావు, శాసనసభ్యుడు తిప్పలనాగిరెడ్డి.నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు తదితరులు పాల్గొన్నారు.

## 15నిమిషాలలో మీ ఇంటిముంగిటకే వైద్యం




**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, జూలై 7:** పట్టణ ప్రాంతాలలో పదిహేను నిమిషాలలోనే వైద్యం అందించేలా 108, 104ల వాహనాల కొనుగోలు చేసి మన ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన నిర్ణయం తీసుకుంది.ఇక ఈ వాహనాలు పట్టణ ప్రాంతాలలో అయితే 15ని పల్లె ప్రాంతాలలో ఐతే 20ని ఏజెన్సీ ప్రాంతాలలో ఐతే 25నిలో చేరుకుని ఇంటివద్ద నుండే మెరుగైన వైద్యం అందించనున్నాయి.

**విలేకరులు కావలెను**

'వార్తావళి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు పశ్చిమగోదావరి, అనంతపురం జిల్లాల్లో జిల్లా ఇన్‌చార్జ్‌లుగా పనిచేయుటకు కమీషన్ పద్ధతిలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను. ఆసక్తి గల వారు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

**7032034001, 8500159006**

## కరోనా వ్యాధి విలయ తాండవం



**గాజువాక, వార్తావళి, జూలై 7 :** గాజువాక నియోజకవర్గ పరిధిలో కరోనా వ్యాధి విలయ తాండవం చేస్తున్నప్పటికీ ప్రత్యన్మయ చర్యలు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వము మరియు జివిఎంసి పూర్తిగా వైఫల్యము చెందాయని గాజువాక మాజీ శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో అందు బాటులో ఉన్న ముఖ్య ప్రతినిధులతో సమావేశం నిర్వహించి జివిఎంసి మరియు రాష్ట్ర ప్రభుత్వము తీరును ఎండగట్టారు. పెళ్లికి 50 మంది, చావుకు 30 మంది అంటూ నిబంధనలు పెడుతున్న ప్రభుత్వం లిమద్యం షాపులు వద్ద మాత్రం వేలాది మందికిలి అనుమతి ఇస్తుందని అన్నారు. గాజువాకలో ఉన్న ప్రజలు తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నప్పటికి జివిఎంసి మరియు రాష్ట్ర ప్రభుత్వము కనీస వార్డుల్లో బ్లీచింగ్ చల్లించడంలో గాని క్రిమి సంహరక మందులు చల్లించడంలో కానీ చొరవ తీసుకుపోవటం బాధ్యతరహిత్యం అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వము జివిఎంసి సంయుక్తంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి యుద్ధ ప్రాతిపదికన కొత్త 20 వార్డులలో నివారణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి ప్రసాధుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా టీడీపీ నాయకులు బెల్లంకొండ రాజనారాజు, చెరుకూరి నాగేశ్వరరావు, ఆడారి రామకృష్ణ, సింగూరు అనంత్, నామాల పెంటయ్య, వార్డు అధ్యక్షులు బోండా జగన్, గోమాడ వాసు, టీడీపీ నాయకులు రెట్టి వాసు, నమ్మి సింహాద్రి, జాజుల గంగరాజు, కర్రి కనకారావు, కాటూరి జయలత, రెట్టి జయమ్మ పాల్గొన్నారు.

## గ్యాస్ ఏజెన్సీ తక్షణం ప్రారంభించాలని కాంగ్రెస్ డిమాండ్



**అరకు, వార్తావళి, జూలై 7:** డుంబ్రిగుడ గ్రామం నందు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ విశాఖపట్నం వారు గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ పేరిట మంజూరు చేసిన గ్యాస్ ఏజెన్సీ తక్షణం ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అరకు పార్లమెంట్ డిస్టిక్ ఇన్చార్జి పాచిపెంట శాంతకుమారి ఒక ప్రకటనలో డిమాండ్ చేసారు.గ్యాస్ ఏజెన్సీ ప్రారంభం నిమిత్తం సిలిండర్లు తో పాటు ఇతర స్టాక్ కూడా సరఫరా చేసిసుమారుఐదునెలలు గడిచినా, నేటికీ ప్రారంభించకపోవడంవల్ల డుంబ్రిగుడ మండలం చుట్టుపక్కల గ్రామ వినియోగదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని శాంతకుమారి ఆవేదన వ్యక్తం చేసారు. పాడేరు నుండి సకాలంలో గ్యాస్ వ్యాన్ డుంబ్రిగూడ లో రాకపోతే వినియోగదారులు పాడేరు వెళ్లి గ్యాస్ సిలిండర్లు తెచ్చుకోవాల్సివస్తోందని చెప్పారు.దీనివల్ల సమయం,ఆర్థికంగా కూడా నష్టపోవాల్సివస్తోందని శాంతకుమారి అన్నారు.కాబట్టి పాడేరు ఐ.టి.డి.ఏప్రాజెక్టు అధికారి ప్రజల సమస్యలను ఇబ్బందిలు దృష్టిలో పెట్టుకొని గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ విశాఖపట్నం వారికీ వెంటనే డుంబ్రిగూడ గ్రామంలో గ్యాస్ ఏజెన్సీ ప్రారంభం చేయవలసిందిగా ఆదేశాలు ఇవ్వాలని శాంతకుమారి డిమాండ్ చేసారు.

Printed, Published and Owned by B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh.
Editor B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh. Email : bulusu009@gmail.com, Cell : 8500159006